ఆంధ్రజ్యోతి
5
ప్రకాశం
జిల్లా వార్తలు
బుధవారం 23, ఏప్రిల్ 2025



ఈ భవనం రెండో అంతస్తులోనే వీరయ్య హత్యకు గురైంది

38 కత్తిపోట్లు

టీడీపీ నేత, మాజీ ఎంపీపీ వీరయ్యచౌదరి దారుణ హత్య

- కార్యాలయంలో ఉండగానే కత్తులతో గుర్తుతెలియని దుండగులు దాడి
- కిరాయి హంతకుల పనిగా భావిస్తున్న పోలీసులు
- మృతదేహం రిమ్స్‌కు తరలింపు
- భారీగా తరలివచ్చిన నేతలు, పార్టీ శ్రేణులు
- ఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్పీ దామోదర్
- తక్షణమే దర్యాప్తు ప్రారంభం
- గుండెపోటుకు గురైన వీరయ్య మేనమామ ఈదర

- ఒంగోలు నడిబొడ్డున ఘటన
- ఉలిక్కిపడిన నగరం

ఒంగోలు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో దారుణం చోటుచేసుకుంది. టీడీపీ ముఖ్యనేత, ఎన్‌జీపాడు మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు ముప్పవరపు వీరయ్యచౌదరి హత్యకు గురయ్యారు. వంటిపై మొత్తం 38 కత్తిపోట్లు ఉండటాన్ని బట్టి చూస్తే ఆయన్ను ఎంత కర్కశంగా పొడిచారో అర్థమవుతోంది. ఈ ఘటనతో నగర ప్రజలు ఉలిక్కిపడ్డారు. యావత్తు పార్టీశ్రేణుల్లో ఆందోళన నెలకొంది. నగరంలోని పాత బైపాస్ రోడ్డులోని వీరయ్య కార్యాలయంలోకి ప్రవేశించిన నలుగురు యువకులు కత్తులతో విచక్షణారహితంగా పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. రాత్రి 7.30 ప్రాంతంలో ఈ హత్య జరిగింది. నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన వీరయ్య చౌదరి దాదాపు మూడు దశాబ్దాలకుపైగా

మిగతా 6వ పేజీలో



రిమ్స్‌లో వీరయ్య చౌదరి మృతదేహాన్ని పరిశీలిస్తున్న మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ సత్య (ఇన్‌సెట్‌లో) వీరయ్య చౌదరి (ఫైల్)

పంచాయతీరాజ్‌లో సంస్కరణలు

- పంచాయతీల విస్తరణాధికారి పోస్టును డిప్యూటీ ఎంపీడీవోగా మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఆశాఖ సిబ్బందికి త్వరలో ఉద్యోగోన్నతులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్‌లో సంస్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆశాఖలో విస్తరణాధికారులుగా పనిచేస్తున్న వారికి డిప్యూటీ ఎంపీడీవోల హోదా ఇచ్చింది. ఎంపీడీవోల పదోన్నతుల్లోనూ వారికి 60శాతం కోటా కల్పించింది. ఈమేరకు ఉత్తర్వులు ఇచ్చింది. ఇతర సిబ్బందికి కూడా త్వరలో ఉద్యోగోన్నతులు లభించనున్నాయి. దీంతో ఆశాఖ ఉద్యోగుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీరాజ్‌లో మండల స్థాయిలో పనిచేసే విస్తరణాధికారులకు ప్రత్యేక హోదాతోపాటు ఇతర సిబ్బందికి ఉద్యోగోన్నతులు కల్పించాలని ఆశాఖ ఉద్యోగులు



సుదీర్ఘకాలంగా కోరుతూ వస్తున్నారు. కానీ గత ప్రభుత్వం దీని గురించి పట్టించుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే దృష్టి సారించింది. అందుకు సంబంధించి తాజాగా జీవో నంబర్ 35ను జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రస్తుతం మండల స్థాయిలో పనిచేస్తున్న పంచాయతీల విస్తరణాధికారి పోస్టు డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (డీఎంపీడీవో)గా మారింది. గ్రామ పంచాయతీల్లో పనిచేసే బిల్ కలెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్లు, కార్యదర్శులు, విస్తరణాకారుల సంఖ్యాబలం అధికంగా ఉండటంతో

మిగతా 6వ పేజీలో



అజెండాలో ఆరే!

నేడు డీఆర్సీ సమావేశం

టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న జిల్లా సమీక్షా మండలి (డీఆర్సీ) రెండో సమావేశం అజెండా పరిమితంగానే ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రధానమైనవిగా భావిస్తున్న ఆరు కీలక అంశాలపై చర్చించాలని ఇన్‌చార్జ్ మంత్రి నిర్ణయించారు. అందులో ఉపాధి హామీ పథకం, తాగునీటి సరఫరా, గృహ నిర్మాణం, విద్య, ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రధానాంశంగా తీసుకొన్న ప్రజా విజ్ఞప్తుల పరిష్కారం (పీజీఆర్ఎస్) ఉన్నాయి.

పరిమిత అంశాలు
క్షేత్రస్థాయి పరిస్థితులపై చర్చిస్తేనే ఫలితం

- ఉపాధి అక్రమార్కులపై నామమాత్రపు చర్యలు
- కదలని సూర్యఘర్ పథకం
- పశ్చిమాన దాహం కేకలు
- వినతుల పరిష్కారంపై ప్రజల పెదవి విరుపు
- గృహ నిర్మాణం అంతంతమాత్రమే

ఒంగోలు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయిలో అత్యంత కీలకమైన డీఆర్సీ సమావేశం బుధవారం జరగనుంది. ఇన్‌చార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రకాశం భవన్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహిస్తున్న ఈ సమావేశానికి కీలక ప్రజాప్రతినిధులు అయిన ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. ఆమేరకు వారందరికీ అధికారులు ఆహ్వానం పంపారు. అలాగే కార్పొరేషన్ చైర్మన్ల విషయంలో తర్జనభర్జన పడినప్పటికీ చివరకు వారికి కూడా సమాచారాన్ని పంపినట్లు తెలిసింది. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడ్డాక డీఆర్సీ జరగడం ఇది రెండోసారి. ఇన్‌చార్జ్ మంత్రుల నియామకం గత అక్టోబరులో జరగ్గా తొలి సమావేశాన్ని నవంబరు 4న నిర్వహించారు. మళ్లీ మూడు నెలలకే తదుపరి సమావేశాన్ని ఏర్పాటు

మిగతా 6వ పేజీలో

కొనుగోళ్లు వేగవంతం.. నోబిడ్లు తగ్గింపు

బోర్డు అధికారులు, కంపెనీల బయ్యర్లకు సూచించిన మంత్రి డాక్టర్ స్వామి

- ఎమ్మెల్యే బీఎన్‌తో కలిసి ఒంగోలులో పొగాకు కొనుగోళ్ల పరిశీలన
- రైతులను ఆదుకొంది టీడీపీ ప్రభుత్వమేనని స్పష్టీకరణ

ఒంగోలు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మార్కెట్లో పొగాకు కొనుగోళ్లు వేగవంతంగా సాగేలా చూడటంతోపాటు రోజువారీ నోబిడ్ బేళ్లు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి పొగాకు బోర్డు అధికారులు, కంపెనీల బయ్యర్లకు సూచించారు. స్థానిక కర్నూల్ రోడ్డులోని పేర్నమిట్ట సమీపంలో



ఒంగోలు-1లో కొనుగోళ్లను పరిశీలిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే బీఎన్

ఉన్న ఒంగోలు-1 పొగాకు వేలం కేంద్రాన్ని ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌తో కలిసి మంగళవారం మంత్రి స్వామి సందర్శించారు. కొనుగోళ్లను పరిశీలించడంతోపాటు లభిస్తున్న ధరలు, రోజువారీ వేలం వివరాలను రైతులు, బోర్డు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు ధరలు ఒక మోస్తరుగా ఉన్నప్పటికీ రోజువారీ నోబిడ్‌లు అధికంగా ఉండటంతో ఇబ్బందిపడుతున్నట్లు మంత్రి దృష్టికి తెచ్చారు. వేలం కూడా చాలా ఆలస్యంగా సాగుతుందన్నారు. కర్ణాటకలో వేలం ముగిసినా

మిగతా 6వ పేజీలో



బడి రూపురేఖలు మారే!

- మొత్తం ఎనిమిది రకాల పాఠశాలలు
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయి. ప్రస్తుతం ఉన్న ఆరు రకాల స్కూళ్ల స్థానంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎనిమిది రకాలు అమలులోకి రానున్నాయి. కేంద్రప్రభుత్వం తెచ్చిన నూతన విద్యా విధానం ఎన్‌ఈపీకి అనుగుణంగా గత ప్రభుత్వం ఎనిమిది రకాల పాఠశాలలను తెస్తూ జీవో 117ను అమలు చేసింది. అయితే దాన్ని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల హామీని నిలబెట్టుకుంటూ 117 జీవోను రద్దు చేసింది. ప్రత్యామ్నాయంగా ఐదు రకాలను ప్రతిపాదిస్తూ జనవరిలో ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు వచ్చిన వివిధ మార్పుల్లో తాజాగా ఎనిమిది రకాల బడులు వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి రానున్నాయి. కూటమి ప్రభుత్వం తొలుత ప్రకటించిన ఐదు రకాల పాఠశాలలకు అదనంగా ప్రాథమికోన్నత పాఠశాలలు, 1 నుంచి 10వ తరగతి వరకు హైస్కూళ్లు, హైస్కూల్ ప్లస్ (ఇంటర్మీడియట్) పాఠశాలలు చేరనున్నాయి. ఈ ఎనిమిది రకాల పాఠశాలలకు 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల డ్రైవ్ కూడా ప్రారంభమైంది.
శాటిలైట్ ఫౌండేషనల్ స్కూల్ : ఈ పాఠశాలల్లో కేవలం పూర్వ ప్రాథమిక విద్యను

మిగతా 6వ పేజీలో

ఉమ్మడి జిల్లాలోని 3,048 పాఠశాలల మార్పు ఇలా..

పాఠశాల పేరు	సంఖ్య
బేసిక్ ప్రైమరీ స్కూళ్లు (బీపీఎస్)	1,394
మోడల్ ప్రైమరీ స్కూళ్లు (ఎంపీఎస్)	670
ఫౌండేషన్ స్కూళ్లు	353
అప్పర్ ప్రైమరీ స్కూళ్లు	85
బీపీఎస్‌లుగా డౌన్ గ్రేడ్ అయినయూపీలు	38
యూపీఎస్‌లుగా డౌన్ గ్రేడ్ అయిన యూపీలు	44
హైస్కూళ్లు (6 నుంచి 10 తరగతులు)	318
హైస్కూళ్లు బీపీఎస్(1 నుంచి 10తరగతులు)	47
హైస్కూళ్లు ప్లస్ ఎంపీఎస్ (1 నుంచి 10)	15
యూపీహెచ్ ఎస్‌లుగా అప్‌గ్రేడ్ ప్లస్ బీపీఎస్	6
యూపీలు హెచ్‌ఎస్‌లుగా అప్‌గ్రేడ్ ప్లస్ ఎంపీఎస్	76
శాటిలైట్ స్కూళ్లు	2
మొత్తం	3,048



కౌశిక్ నరసింహ   ఉదయ్‌కృష్ణారెడ్డి

సివిల్స్‌లో సత్తా

- పేర్నమిట్టకు చెందిన కౌశిక్‌కు 225, ఊళ్లపాలెం వాసికి 350 ర్యాంకు
- పై అధికారి అవమానించారని కానిస్టేబుల్ ఉద్యోగాన్ని వదిలి సివిల్స్ సాధించిన ఉదయ్

వివరాలు మెయిన్‌లో..

ప్రభుత్వ భూమి ఆక్రమణ

- అమ్మేందుకు ప్రయత్నాలు
- గతంలో అదే భూమికి ఆన్‌లైన్ చేసిన తహసీల్దార్ సస్పెన్షన్
- ఇప్పుడు రిలయన్స్ సీబీజీ ప్లాంట్ మంజూరుతో కొందరు పాగా

7



ఆక్రమించి దున్నిన భూమి

పొగాకు సమాఖ్య పీఐసీగా జేసీ బాధ్యతల స్వీకరణ

ఒంగోలు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. పీఐసీగా ఆయన్ను నియమిస్తూ సహకారశాఖ కమిషనర్ ఈనెల 15న ఉత్తర్వులు ఇచ్చిన విషయం విదితమే. మంగళవారం సమాఖ్య సిబ్బంది సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ పీఐసీ విషయంలో గతంలో పెద్ద రగడే జరిగింది. ఒంగోలు కేంద్రంగా ఉన్న సమాఖ్యకు ఒకప్పుడు రాష్ట్రంలో సహకార సంఘంలోని రైతు సంస్థలలో ప్రత్యేక గుర్తింపు ఉండేది. కాగా వైసీపీ కాలంలో క్రమంగా ఆ ప్రాభవం తగ్గిపోయింది. రెండు నెలల క్రితం పాలక మండలి పదవీ కాలం పూర్తైంది. కాగా సహకార శాఖ జిల్లా అధికారులు అసిస్టెంట్‌రిజిస్ట్రార్ కేడర్‌లో డీసీఏవో హోదాలో పనిచేస్తున్న సూరి శ్రీనివాసరావును పీఐసీగా నియమించారు. అధికార పార్టీ కీలక నేతలతో మాట మాత్రం కూడా చెప్పకుండా నియామకం చేయడమే కాక కనీసం డివిజనల్ సహకార అధికారి, ఆపైస్థాయి వారిని నియమించాల్సిన పీఐసీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌ను నియమించడంపై

మిగతా 6వ పేజీలో



జేసీని అభినందిస్తున్న పొగాకు సమాఖ్య సిబ్బంది

అజెండాలో ఆరే!

(5వ పేజీ తరువాయి)

చేయాలనున్నప్పటికీ రకరకాల కారణాలతో జాప్యమైంది. చివరకు ఐదున్నర నెలల అనంతరం బుధవారం నిర్వహిస్తున్నారు. ఆయా అంశాలను పరిశీలిస్తే.. జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులు ప్రస్తుతం వేగం పుంజుకుంటున్నాయి. రోజువారీ లక్షా 20వేల మంది కూలీలు పనులకు వస్తుండగా పంచ ప్రాధాన్యాలుగా గుర్తించి పనులు చేయిస్తున్నారు. మూడు నెలలుగా పనులు చేసిన కూలీలకు రూ.25కోట్లకుపైగా వేతనాలతోపాటు మెటీరియల్ కోటా కింద చేసిన పనులకు సంబంధించి సుమారు రూ.132 కోట్లు పెండింగ్ బిల్లులు ఉండటం ఇబ్బందికరంగా మారింది.

విచారణపై చర్యలు ఏవీ?

గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో ఉపాధి హామీ పథకంలో అడ్డగోలుగా అవినీతి జరిగిందన్న ఫిర్యాదుతో కలెక్టర్ విచారణకు ఆదేశించిన విషయం విదితమే. త్రిసభ్య కమిటీ విచారణ చేసి అప్పటి పీడీగా పనిచేసిన కె.శీనారెడ్డి అక్రమాలు, అవినీతికి పాల్పడినట్లు తేల్చింది. ఆ విచారణ కమిటీ నివేదిక ఇచ్చి రెండు మాసాలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఇంతవరకు చర్యలు కరువయ్యాయి. ఇతర ఉద్యోగులు, సిబ్బందిపై కూడా జిల్లాస్థాయిలో నామమాత్రపు చర్యలు తీసుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఆస్థాయిలో జరిగిన విచారణలోనే బాధ్యులపై చర్యలు సరిలేకపోవడంతో ప్రస్తుతం కూడా డ్వామా సిబ్బంది చాలాచోట్ల యథేచ్ఛగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదులు అధికంగా వస్తుండగా సోషల్ ఆడిట్, ప్రజావేదికలు తీరు అందుకు బలాన్ని ఇస్తున్నాయి.

అధికమైన తాగునీటి ఇక్కట్లు

జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పల్లె, పట్టణం తేడాలేకుండా వందలాది గ్రామాల్లో ప్రత్యేకించి పశ్చిమప్రాంతంలో నీటికోసం ప్రజలు తల్లడిల్లుతున్నారు. ప్రస్తుతం ఎనిమిది మండలాల్లోని 67 గ్రామాల్లో నీటి సరఫరా జరుగుతుండగా అంతకు రెట్టింపు ప్రాంతాలలో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఒంగోలు నగరంలో మూడు రోజులకు ఒకసారి అరకొరగా నీటి సరఫరా చేస్తుండగా పలు పట్టణాలలోనూ అవస్థలు తప్పడం లేదు.

ఒక్కశాతం మించలేదు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యతగా పీఎం సూర్యఘర్ పథకాన్ని తీసుకొచ్చాయి. నియోజకవర్గానికి 10వేల వంతున 80వేల సోలార్ యూనిట్లు ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటి వరకు అందులో ఒక్కశాతం మించి చేయలేదు. దీనిపై ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కల్పించకపోవడం కూడా పథకం ముందుకు సాగకపోవడానికి కారణమైంది. గృహ నిర్మాణాల పరిస్థితి కూడా అలాగే ఉంది. ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక పెండింగ్‌లో ఉన్న 21వేల ఇళ్ల నిర్మాణాలపై దృష్టిపెట్టినా పదిశాతం మించి జరుగుతున్న పరిస్థితి లేదు. ఇక అత్యంత ప్రధానమైన ప్రజావిజ్ఞప్తులను పరిష్కరించేందుకు బాగానే జరుగుతున్నట్లు ఉన్నా ప్రభుత్వ సర్వేలో జిల్లాలో ప్రజాభిప్రాయం ప్రతికూలంగా ఉంది.

అధికార యంత్రాంగంపై తీవ్ర అసంతృప్తి

అధికారుల తీరుపై ప్రజల్లో అసంతృప్తి ఎక్కువగా ఉంది. ఈ అంశాలపై క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రజాప్రతినిధులు డీఆర్సీ సమావేశంలో చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇతర అంశాలను చూస్తే జిల్లాకు తలమానికమైన ఒంగోలు డెయిరీ పునరుద్ధరణ ప్రజల కోరిక కాగా ఆ దిశగా చర్యలు కరువయ్యాయి. సంస్థ ఆస్తులు అన్యాక్రాంతమయ్యే పరిస్థితి ఏర్పడింది. వెలిగొండపై ప్రభుత్వం సీరియస్‌గానే ఉన్నప్పటికీ ఆ స్థాయిలో నిధులు మంజూరు కాక ప్రతికూల పరిస్థితి ఉంది. ట్రిపుల్ ఐటీ, యూనివర్సిటీ నిర్మాణాలు, చదలవాడ పశుక్షేత్రం అభివృద్ధి అంశాలు ఎవరికీ పట్టడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో సాగర్ కాలువలు, ఇతర నీటి వనరులపై చేసిన నిర్లక్ష్యంతో నీటిపారుదల ఇబ్బందిగా మారింది. ఈ అంశాలు అన్నింటిపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. జిల్లాలో వివిధ శాఖల పనితీరు కూడా ఏమాత్రం మెరుగుపడకపోగా అధ్వానంగా మారాయి.

బడి రూపురేఖలు మారే!

(5వ పేజీ తరువాయి)

మాత్రమే బోధిస్తారు. వీటిని స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఇక నుంచి శాటిలైట్ ఫౌండేషనల్ స్కూళ్లుగా వ్యవహరిస్తారు.

ఫౌండేషనల్ స్కూళ్లు: ఈ పాఠశాలలల్లో పూర్వ ప్రాథమిక విద్యతోపాటు 1, 2 తరగతుల విద్యార్థులకు బోధిస్తారు.

బేసిక్ ప్రైమరీ స్కూలు: ఈ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యతోపాటు 1 నుంచి 5 తరగతులకు బోధిస్తారు.

మోడల్ ప్రైమరీ స్కూలు : కూటమి ప్రభుత్వ మానస పుత్రికలుగా మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఆవిర్భవిస్తున్నాయి. వాటికి ఒక ప్రైమరీ స్కూలు హెచ్‌ఎం, స్కూలు అసిస్టెంటు, ఐదు ఎస్‌జీటీ పోస్టులు తరగతికి ఒకటి చొప్పున కేటాయిస్తున్నారు. ఈ పాఠశాలల్లో పూర్వ ప్రాథమికోన్నత విద్యతోపాటు 1 నుంచి 5 తరగతులు బోధిస్తారు.

హైస్కూళ్లు(6-10) : హైస్కూళ్లలో 6 నుంచి 10 తరగతులకు మాత్రమే బోధిస్తారు. గతంలో విలీనం చేసిన 3,4,5 తరగతుల విద్యార్థులను మళ్లీ ప్రాథమిక పాఠశాలలకు పంపుతారు. యుపీ స్కూళ్లను విద్యార్థులు ఎక్కువమంది ఉన్న వాటిని హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేస్తారు. తక్కువ విద్యార్థులు ఉన్న వాటిని ప్రాథమిక పాఠశాలలుగా డౌన్‌గ్రేడ్ చేసి అక్కడి 6,7,8 తరగతుల విద్యార్థులను సమీపంలోని హైస్కూళ్లకు పంపుతారు.

ప్రాథమికోన్నత పాఠశాలలు : ఈ స్కూళ్లలో 1 నుంచి 8 తరగతులు వరకు బోధిస్తారు. అయితే 1 నుంచి 5 తరగతులు, 6,7,8 తరగతులకు విద్యార్థుల సంఖ్య ప్రామాణికంగా సెకండరీ గ్రేడు టీచర్లను కేటాయిస్తున్నారు.

హైస్కూళ్లు (1 నుంచి 10): హైస్కూళ్ల విషయంలో ప్రభుత్వం మనసు మార్చుకుంది. మొదట 3,4,5 తరగతులనే వెనక్కు పంపాలనుకున్న ప్రభుత్వం తాజాగా 1 నుంచి 10 తరగతులు కొనసాగించేందుకు నిర్ణయించింది. ఒకే ఆవరణలో అన్ని తరగతులు ఉంటే అక్కడి ఎలిమెంటరీ విద్యార్థులను కూడా హైస్కూళ్లలో చేర్చుకుంటారు. 1 నుంచి 5 తరగతుల విద్యార్థులు 60 మందికి మించితే ప్రత్యేకంగా ఒక ప్రైమరీ హెచ్‌ఎంను కేటాయించి కొత్త యూడైస్ కోడ్ ఇస్తారు. 60మందికిలోపు ఉంటే దాని బేసిక్ ప్రైమరీ స్కూలుగా అలాగే ఉంచి 1 నుంచి 10 తరగతుల బాధ్యతను హైస్కూలు హెచ్‌ఎం చూస్తారు.

హైస్కూల్ ప్లస్ (ఇంటర్మీడియట్) : హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ తరగతులను ప్రస్తుతానికి నిర్వహిస్తున్నారు. వీటిల్లో మొదట బాలిక జూనియర్ కళాశాలలు కొనసాగుతాయి. ఆతర్వాత ప్రారంభమైన కోఎడ్యుకేషన్ కళాశాలలు విషయంలో ప్రభుత్వ నిర్ణయాన్ని తీసుకోవాల్సి ఉంది.

పొగాకు సమాఖ్య పీఐసీగా జేసీ

(5వ పేజీ తరువాయి)

విమర్శలు వచ్చాయి. విషయం తన దృష్టికి రావడంతో మంత్రి స్వామి సహకార శాఖ జిల్లా అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ డీసీవోగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిని ప్రభుత్వానికి కలెక్టర్ సరెండర్ చేయడంలో ఇది కూడా ఒక ప్రధాన అంశంగా ఉన్నట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారం రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వారు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. సమాఖ్య పీఐసీగా సూరి శ్రీనివాసులును నియమించిన ఉత్తర్వులను రద్దుచేసి, ఆ స్థానంలో జేసీ గోపాల కృష్ణను నియమిస్తూ కమిషనర్ వారం క్రితం ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో మంగళవారం జేసీ ఆ బాధ్యతలను స్వీకరించగా, సమాఖ్య సిబ్బంది ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పంచాయతీరాజ్‌లో సంస్కరణలు

(5వ పేజీ తరువాయి)

వారికి ఉద్యోగోన్నతుల్లో 60శాతం కోటాను ప్రభుత్వం కల్పించింది. మండల, జిల్లా పరిషత్‌లలో పనిచేసే అసిస్టెంట్లు, టైపిస్టులు, ఏవోలకు 34శాతం కేటాయించింది. దీంతో ఉద్యోగోన్నతుల్లో తమకు తక్కువ అవకాశాలు ఉంటాయని పరిషత్ ఉద్యోగులు అంటున్నారు. ఏదిఏమైనా దశాబ్దాల కాలంపాటు నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించడంతో ఆ శాఖ ఉద్యోగుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

హత్య కేసులో 14 రోజుల రిమాండ్

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలోని యనమదల గ్రామంలో శనివారం అర్ధరాత్రి ఇంటిలో నిద్ర పోతున్న భార్య నీలం మంగమ్మను హత్య చేసిన భర్త శ్రీనివాసరావును మంగళవారం పర్చూరు కోర్టులో హాజరుపరచినట్లు ఎస్‌ఐ టీ రత్నకుమారి తెలిపారు. శ్రీనివాసరావుకు 14 రోజుల రిమాండ్‌ను న్యాయాధికారి విధించగా, నెల్లూరు జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

38 కత్తిపోట్లు!

(5వ పేజీ తరువాయి)

ఒంగోలు నగరంతోపాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని రాజకీయ, వ్యాపార వర్గాల వారందరికీ సుపరిచితుడు. జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు దగ్గర బంధువుగా తొలుత ప్రజలకు పరిచయమైన వీరయ్యచౌదరి క్రమంగా రాజకీయ వ్యాపార వర్గాల్లో ఎదుగుతూ వస్తూ ఉమ్మడి జిల్లాలో గుర్తింపు పొందిన నాయకుడిగా ఉన్నారు. ప్రస్తుతం ఎస్‌ఎన్‌పాడు నియోజకవర్గ టీడీపీ ముఖ్యనేతగా బాపట్ల పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. గతంలో 2014-19 మధ్య నాగులుప్పలపాడు ఎంపీపీగా పనిచేసిన వీరయ్యచౌదరి గత పదేళ్లుగా రాజకీయాల్లో మరింత క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. స్వతహాగా మద్యం, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారు. సుదీర్ఘకాలంగా ఈ వ్యాపారంలో కొనసాగుతున్న వీరయ్యచౌదరికి ఆ వ్యాపారాలు ఇతరత్రా వర్గాల వారితో విభేదాలు కూడా ఉండే అవకాశం ఉంది. కాగా ప్రస్తుతం టీడీపీ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ మద్యం వ్యాపారం చేపట్టారు. అలాగే టీడీపీలో చురుగ్గా వ్యవహరిస్తూ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈక్రమంలో వీరయ్య హత్యకు గురికావడం ఉమ్మడి జిల్లాలోని టీడీపీ శ్రేణులను కలవరపాటుకు గురిచేయగా ఊహించని రీతిలో జరిగిన హత్యతో ఒంగోలు ప్రజానీకం ఉలిక్కిపడ్డారు.

సొంత కార్యాలయంలోనే..

స్థానిక పాత బైపాస్ రోడ్డులో చాలాకాలంగా సొంత కార్యాలయాన్ని నిర్వహిస్తున్న వీరయ్య చౌదరి పగలంతా రాజకీయ, వ్యాపార కార్యక్రమాలను చూసుకుని సాయంత్రానికి ఆ కార్యాలయానికి వచ్చి తన వ్యక్తిగత పనులు చూసుకుంటుంటారు. అలాగే మంగళవారం సాయంత్రం కూడా వీరయ్య కార్యాలయంలో తన పనులు చూసుకుంటుండగా గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు కార్యాలయంలోకి చొరబడి కత్తులతో దాడిచేశారు. అందిన సమాచారం మేరకు.. రెండు బైకులపై వచ్చిన నలుగురు వ్యక్తులు రాత్రి 7.30 ప్రాంతంలో కార్యాలయంలోకి ప్రవేశించి ప్రధాన ద్వారానికి గడియపెట్టి రూములో ఉన్న వీరయ్యపై కత్తులతో దాడి చేసి విచక్షణారహితంగా పొడిచారు. గుండెలో, మెడ, గొంతు ప్రాంతంలో దాదాపు 38 కత్తిపోట్లు ఉన్నట్లు చెప్తున్నారు. దాడిలో వీరయ్య అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. అనంతరం దుండగులు అక్కడి నుంచి పారిపోగా కొంతసేపటి తర్వాత పోలీసులకు విషయం తెలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘటన జరిగిన వీరయ్య కార్యాలయం ఎస్పీ కార్యాలయానికి సమీపంలోనే ఉండగా విషయం తెలిసిన వెంటనే ఎస్పీ ఏఆర్.దామోదర్, ఇతర పోలీసు అధికారులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. పోస్టుమార్టం కోసం వీరయ్యచౌదరి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి తక్షణమే దర్యాప్తు చేపట్టారు. ఆరుగురు సీఐలు, 10మంది ఎస్‌ఐలతో దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. కాగా ఘటన



వీరయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న మంత్రులు రవికుమార్, స్వామి

జరిగిన తీరును బట్టి హత్య చేసిన వారు ప్రొఫెషనల్ హంతకులుగా పోలీసులు భావిస్తున్నారు.

ఆర్థిక లావాదేవీలేనా?

మద్యం, రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో వీరయ్య చురుగ్గా ఉండగా ఆ వ్యాపారాలు, అలాగే ఇతర ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఎవరితోనైనా విభేదాలు ఉన్నాయా? అలాంటి వివాదాలే ఈ హత్యకు కారణమై ఉండొచ్చన్న అనుమానంతో ఆ వైపు దర్యాప్తుపై దృష్టిసారించారు. అలాగే బైపాస్‌కు ఇరువైపులా ఉన్న సీసీ కెమెరాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. విషయం తెలిసి వీరయ్య కార్యాలయం దగ్గరకు పెద్దసంఖ్యలో జనం చేరగా వారందరినీ దూరంగా పంపించి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

తరలివచ్చిన నాయకులు

వీరయ్యచౌదరి హత్యకు గురయ్యాడన్న వార్త కొద్దిసేపటికే ఒంగోలు నగరంతోపాటు జిల్లా అంతటా వ్యాపించింది. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించడంతో అక్కడికి ఒంగోలుతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన టీడీపీ నాయకులు, పార్టీశ్రేణులు భారీగా తరలివచ్చారు. మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు బీఎన్ విజయ్‌కుమార్, దామచర్ల జనార్దన్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్‌లతోపాటు అనేకమంది ముఖ్యనాయకులు రిమ్స్ వద్దకు తరలివచ్చారు. వీరయ్య మృతదేహానికి నివాళులర్పించటంతోపాటు హత్య ఘటనను తీవ్రంగా ఖండించారు. రాత్రి పొద్దుపోయే వరకు ఇటు రిమ్స్‌లోనూ, అటు ఘటన జరిగిన వీరయ్య కార్యాలయం వద్ద పెద్దసంఖ్యలో ప్రజానీకం ఉన్నారు. స్వగ్రామమైన అమ్మనబ్రోలుతోపాటు నాగులుప్పలపాడు మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు రిమ్స్‌కు భారీగా తరలివచ్చారు. రాత్రి 9గంటల ప్రాంతంలో ఎస్పీ దామోదర్ రిమ్స్ వద్దకు వచ్చి అక్కడ ఉన్న ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. పోలీసుల సమాచారం ప్రకారం సంఘటన జరిగిన తీరు అనంతరం దర్యాప్తుకు తీసుకుంటున్న చర్యలను వారికి వివరించినట్లు సమాచారం.

వీరయ్య హత్యపై అధిష్ఠానం సీరియస్

హుటాహుటిన హోంమంత్రి ఒంగోలు రాక

వార్త విని గుండెపోటుకు గురైన మాజీ ఎమ్మెల్యే ఈదర

నేడు అమ్మనబ్రోలుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు?

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

టీడీపీ నేత ముప్పవరపు వీరయ్య చౌదరి హత్యపై అటు ముఖ్యమంత్రి, ఇటు పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకున్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎంకు ఈ విషయం తెలిసిన వెంటనే పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఆ తర్వాత ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి గొట్టిపాటి రవికి ఫోన్ చేసి వెంటనే ఒంగోలు వెళ్లాలని ఆదేశించారు. రాత్రి పొద్దుపోయాక కూడా ఈ విషయంపై దృష్టి సారించిన సీఎం... హోం మంత్రిని కూడా ఒంగోలు వెళ్లాలని ఆదేశించారు. ముందు నిర్ణయించుకున్న ప్రకారం బుధవారం ఉదయం ఒంగోలు రావాల్సిన హోంమంత్రి మంగళవారం అర్ధరాత్రికే ఒంగోలు వచ్చారు. సీఎంతోపాటు కుటుంబ వ్యక్తిగత పర్యటనలో ఉన్న లోకేష్ కూడా ఈ సంఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

హుటాహుటిన ఇద్దరు మంత్రులు ఒంగోలుకు

మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒంగోలు వచ్చి పార్టీ నేతలతో సమీక్షించారు. అప్పటికే మృతదేహాన్ని సందర్శించిన మరో మంత్రి స్వామితో కూడా చర్చించారు. అందుబాటులో ఉన్న ఎమ్మెల్యేలు జనార్దన్ ఉగ్ర, మారిటైం బోర్డు చైర్మన్ సత్య, ఇతర అంశాలపై చర్చించారు. కేసు దర్యాప్తును సమీక్షించారు. అలాగే హోంశాఖ మంత్రి అనిత అర్ధరాత్రికి ఒంగోలు చేరారు. బుధవారం ఒంగోలు వస్తున్నట్లు సమాచారం ఇచ్చిన ఆమె సీఎం, లోకేష్ ఆదేశాలతో రాత్రికిరాత్రే ఒంగోలు వచ్చారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా వస్తున్నట్లు సమాచారం. ఆయన బుధవారం ఉదయం 11గంటలకు వీరయ్య స్వగ్రామం అమ్మనబ్రోలుకు చేరుకుని అంతిమయాత్రలో పాల్గొంటారని తెలిసింది. అధికారికంగా కార్యక్రమం ఖరారు కాలేదు.

ఈ హత్య సంచలనం సృష్టించడం.. సీఎంతోపాటు లోకేష్‌లు, ప్రముఖులు స్పందించడంతో పోలీస్ ఉన్నతాధికారులకు ఈవైపు దృష్టి సారించారు. పోలీస్ ఉన్నతాధికారులు ముందు ఎస్పీ దామోదర్‌తో మాట్లాడి సమాచారం తెలుసుకోవడంతోపాటు ఇంతటి దారుణ హత్యకు ఆరితేరిన నేరస్తులే కారణమన్న భావనతో నిఘా విభాగం ఏం చేస్తోంది అని ప్రశ్నించినట్లు తెలిసింది. రెక్కీ నిర్వహించి హత్య చేసినట్లు తెలిసింది. దుండగులు మెట్ల ద్వారా రెండో అంతస్తుఎక్కి అదే మెట్ల ద్వారా దిగి బైక్‌ల మీద పరారయ్యేందుకు రెండు నిమిషాలే పట్టిందంటే ఎంత పకడ్బందీగా వ్యూహం పన్నారో అర్థమవుతోంది. హత్యకు గల కారణాలు ఏమైనా... హంతకులు ముందుగా నగరంలోకి ప్రవేశించి కాపు కాసి హత్య చేసినా పసిగట్టలేకపోవడంపై ఉన్నతాధికారులు కాస్త సీరియస్ అయినట్లు తెలిసింది. ఎస్పీ దామోదర్ కూడా ఈ హత్యను సీరియస్‌గా తీసుకుని ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు.

ఈదర హరిబాబుకు గుండెపోటు

వీరయ్య హత్యకు గురైన విషయం తెలియగానే అతని మేనమామ, జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు గుండెపోటుకు గురయ్యారు. వెంటనే ఆయన్ను ఒంగోలులోని వెంకటరమణ హాస్పిటల్‌కు తరలించి చికిత్స ప్రారంభించారు. గతంలో ఆయన గుండె ఆపరేషన్ చేయించుకున్న హరిబాబుకు తీవ్రంగా ఛాతి నొప్పిరావడంతో టీడీపీ నేతలుఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల్లో ఆయన ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాల్సి ఉందని డాక్టర్లు నిర్ధారించారు. టీడీపీ నేతలు వైద్యశాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు.

కొనుగోళ్లు వేగవంతం.. నోబిడ్లు తగ్గింపు

(5వ పేజీ తరువాయి)

ఇంకా ఇక్కడ మార్కెట్ పుంజుకోలేదన్నారు. దీనివల్ల కొనుగోలు సమయం పెరిగి నష్టపోతున్నామన్నారు. గతేడాదితో పోల్చితే ఈసారి ఉత్పత్తి ఖర్చులు పెరిగిన నేపథ్యంలో ధరలు మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు చెప్పిన పలు అంశాలపై పొగాకు బోర్డు ఆర్‌ఎం లక్ష్మణరావు, ఇతర అధికారులను మంత్రి స్వామి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కర్ణాటకలో ఇటీవలే మార్కెట్ ముగిసిందని, ఇంకా కొంతమంది బయ్యర్లు మార్కెట్‌లోకి రావాల్సి ఉందని వారు తెలిపారు. మంచి గ్రేడ్ బేళ్లకు గరిష్ఠ ధర కిలోకు రూ.280 లభిస్తున్నదని చెప్పారు. కొందరు రైతులు గ్రేడింగ్ సరిగా చేయించకుండా బేళ్లు తీసుకురావడం, అలాగే ప్రస్తుతం వ్యాపారులు కొనుగోలు చేస్తున్న గ్రేడ్‌లకు బదులు లోగ్రేడ్లను తీసుకురావడం వల్ల నోబిడ్లు అధికంగా ఉంటున్నాయని వివరించారు. పొగాకు బోర్డు ఉన్నతాధికారులు ఈ అంశంపై దృష్టిసారించి తగు చర్యలు తీసుకొంటున్నారని తెలిపారు. దీంతో బోర్డు ఈడీ విశ్వశ్రీకి అక్కడి నుంచి మంత్రి ఫోన్ చేశారు. వేలంకేంద్రంలో రైతులు తన దృష్టికి తెచ్చిన అంశాలపై ఆమెతో మాట్లాడారు. రైతు ప్రతినిధులతో సమావేశం ఉందని, రెండు రోజుల్లో కంపెనీల వారితో కూడా సమావేశం ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోనున్నట్లు ఆ సందర్భంగా మంత్రికి ఈడీ వివరించారు.

బయ్యర్లతో మాట్లాడిన మంత్రి, ఎమ్మెల్యే

వేలం కేంద్రంలోని పలు కంపెనీల బయ్యర్లతో మంత్రి స్వామి, ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మాట్లాడారు. రైతులకు అసంతృప్తి లేకుండా ధరలు ఇవ్వాలని సూచించారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడుతూ వేలం వేగవంతం కాకపోవడం, నోబిడ్లు అధికంగా ఉండటం పట్ల రైతులలో అసంతృప్తి, ఆందోళన వ్యక్తమవుతున్నదన్నారు. ఆ విషయాన్ని బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి, తద్వారా కేంద్రం దృష్టికి కూడా రైతు సమస్యలు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గతంలో పొగాకు మార్కెట్ సంక్షోభంలో పడి రైతులు నష్టపోయినప్పుడు టీడీపీ ప్రభుత్వం ఆదుకొన్న విషయం రైతులందరికీ తెలుసన్నారు. అలా అవసరమైతే మళ్లీ కూడా పొగాకు రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ముందుకు వస్తుందన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు రైతుల గురించి పట్టించుకోని వారు ఇప్పుడు వేలం కేంద్రాలకు వచ్చి హడావుడి చేయడం రాజకీయం కోసం తప్ప రైతుల కోసం కాదన్నారు. కాగా అధికంగా ఉత్పత్తి అయిన పంటపై అపరాధ రుసుం లేకుండా గత ఏడాది వలే చేసేందుకు ప్రభుత్వం తరఫున కేంద్రంతో మాట్లాడి రైతులకు ఉపశమనం కలిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బి.బ్రహ్మయ్య, సభ్యుడు ప్రసాదరావు, రైతు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామంపై పోలీసుల డేగ కన్ను

- వేమవరంలో కొత్త వ్యక్తుల కదలికపై ప్రత్యేక నిఘా ఏర్పాటు
- జంట హత్యల కేసు తుది దశకు చేరడంతో అప్రమత్తం
- ఉన్నతాధికారులు ఆదేశాలతో నూతనంగా సీసీ కెమెరాలు

బల్లికురవ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాక్షన్ గ్రామం అయిన వేమవరంపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. ఈ గ్రామంలో గత పదేళ్ల కిందట జంట హత్యలు జరిగాయి. అప్పటి నుంచి గ్రామంలో ప్రత్యేక పోలీసు పికెట్ కొనసాగుతూనే ఉంది. ఇటీవల నూతన ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన వై.నాగరాజు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇటీవల వేమవరం నలువైపులా గ్రామంలోకి వ చ్చే కొత్త వ్యక్తుల కదిలికలపై ప్రత్యేక నిఘా పెట్టేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చే యించారు. పోలీసు స్టేషన్ నుండే వేమవరంలో జరిగే కదలికలను ప్రత్యేక సిబ్బంది పరిశీలన చేసేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

బల్లికురవ మండలం వేమవరం గ్రామంలో గతంలో జంట హత్యలు జరిగియి. తదనంతరం మరో వర్గం వారిపై దాడులు చేసేందుకు యత్నం జరిగింది. అప్పట్లో ఈ గ్రామంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించింది. ఈ గ్రామంలో పదేళ్ల నుంచి పికెట్ నిరంతరం కొనసాగుతుంది. వైసీపీ, టీడీపీ పార్టీల వర్గీయుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంది. వారు ఎక్కడకు వెళ్లాలన్న పోలీసు శాఖ అనుమతి తీసుకోవల్సిందే. జంట హత్యల కేసు విచారణ తుది దశలో ఉండడం సాక్షుల విచారణ కూడా కోర్టులో జరుగుతుంది. ఈ కేసులపై పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఎస్‌ఐ నాగరాజు మురికిపూడి, మల్లాయపాలెం వైపు నుంచి వచ్చే ప్రజల కదలికలు గమనించేలా ఆరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఇతర గ్రామాల వారు వేమవరం మీదుగా వెళితే వారి వివరాలను సేకరిస్తున్నారు. చోరీలు కూడా జరగకుండా ఉండేలా సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగం అని పోలీసులు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజల నుండి హర్షం వ్యక్తం అవుతుంది. ప్రతి రోజు ఎస్‌ఐ నాగరాజు ఈ గ్రామాన్ని సందర్శించి ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఉండేలా కౌన్సెలింగ్ ఇస్తున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ఎస్‌ఐ నాగరాజును వివరణ కోరగా.. ఇకపై మండలంలో అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తామని వేమవరంపై ప్రత్యేక నిఘా దృష్ట్యా చర్యలు చేపట్టామని తెలిపారు.

పేలుడు పదార్థాల కేసులో.. ముగ్గురు అరెస్ట్

- ఐదు టన్నుల సరుకు స్వాధీనం
- తెలంగాణలోని చౌటుప్పల్ కోర్టులో తొలుత హాజరు
- నేడు అద్దంకి కోర్టుకు

మార్టూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : అక్రమ పేలుడు పదార్థాలను నిల్వ ఉంచడం, వాటి కొనుగోలు, అమ్మకాలు చేసిన కేసులో మంగళవారం ముగ్గురిని అరెస్టు చేశారు. ప్రత్యేక పోలీసు బృందాలు మంగళవారం తెలంగాణలో నాగండ్ల ప్రసన్న, బత్తుల సాంబశివరావు, ప్రతాప్ రెడ్డి అనే ముగ్గురిని అదుపులోకి తీసుకోగా అరెస్టు చేసిన వారి సంఖ్య మొత్తం ఐదుగురికి చేరింది. ఇప్పటికే ఈ కేసులో కీలక సూత్రధారి మండలంలోని నాగరాజుపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నేత దాసం హనుమంతురావుతోపాటు, అతని బంధువు దాసం వీరాంజనేయులను మార్టూరు పోలీసులు అరెస్టు చేసి అద్దంకి కోర్టులో హాజరుపరచి దర్శి జైలుకు తరలించారు. అదేవిధంగా ఈ కేసులో కీలకమైన వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలని, హనుమంతరావు దగ్గర కొనుగోలు చేసిన అక్రమ పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకోవాలనే కారణంతో ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు ఆదివారం ప్రత్యేక బృందాలు తెలంగాణ రాష్ట్రానికి వెళ్లారు. ఈ ప్రత్యేక బృందాలు పూర్తిస్థాయిలో విచారణ చేసి సోమవారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లాలో పోచారం మండలం దేశ్‌ముఖ్ గ్రామ పంచాయతీలో ముగ్గురు నిందితులు నాగరాజుపల్లి గ్రామానికి చెందిన నాగండ్ల ప్రసన్నను, మిగిలిన ఇద్దరు బత్తుల సాంబశివరావు, ప్రతాప్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. ప్రతాప్ రెడ్డి కొనుగోలు చేసి భూమిలో దాచి ఉంచిన ఐదు టన్నుల పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం చౌటుప్పల్ పరిధిలో కోర్టులో ముగ్గురు నిందితులను, సరుకును హాజరుపరచారు. అనంతరం ముగ్గురు నిందితులను ట్రాన్సిట్ వారెంట్‌పై మార్టూరు స్టేషన్‌లో నమోదు చేసిన కేసులో బుధవారం అద్దంకికి తీసుకువచ్చి కోర్టులో హాజరుపరచనున్నారు.

సూత్రధారి ప్రతాప్ రెడ్డి

తెలంగాణలో కొండలను పగులగొట్టి నేలను చదును చేసే కాంట్రాక్టర్‌గా ఉన్న ప్రతాప్ రెడ్డి నాగరాజుపల్లి గ్రామంలోని దాసం హనుమంతరావు దగ్గర ప్రేలుడు పదార్థాలను కొనుగోలు చేయడానికి బత్తుల సాంబశివరావు సహకరించారు. అక్రమ పేలుడు పదార్థాలను తక్కువ ధరకు హనుమంతరావు నుంచి ప్రతాప్ రెడ్డి కొనుగోలు చేసే విధంగా బత్తుల సాంబ శివరావు కథ నడిపారు. ఈ మేరకు ఇప్పటికి రెండుసార్లు ఈ విధంగా ప్రతాప్‌రెడ్డి సరుకును కొనుగోలు చేశారు. అందులో భాగంగానే ఈ నెల 18 వతేదీన తెలంగాణ రాష్ట్రం నుంచి కొనుగోలు చేసి నాగరాజుపల్లి గ్రామానికి తీసుకువస్తున్న పేలుడు పదార్థాలలో కొంత భాగాన్ని ప్రతాప్‌రెడ్డి కొనుగోలు చేసే విధంగా సాంబశివరావు సహకరించారు. అదేవిధంగా లారీలో పేలుడు పదార్థాలను రవాణా చేయడం, సరుకును తీసుకువెళ్లడంలో సహకరించిన నాగండ్ల ప్రసన్నను పోలీసులు నిందితునిగా చేర్చారు. ఇదిలావుండగా శనివారం నాగరాజుపల్లిలోని హనుమంతురావు గోడౌన్‌పై పోలీసులు తనిఖీలు చేయడంతో, ఈవిషయం తెలుసుకున్న ప్రతాప్ రెడ్డి అప్రమత్తమై సరుకును భూమిలో దాచి ఉంచారు. అయితే తెలంగాణ వెళ్లిన ప్రత్యేక బృందాలు సరుకుతోపాటు, ముగ్గురు నిందితులను కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ విషయమై సీఐ ఎం.శేషగిరిరావుతో ఆంధ్రజ్యోతి మాట్లాడగా తెలంగాణలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. వారిని బుధవారం అద్దంకి కోర్టులో హాజరుపరచడానికి తెలంగాణ నుంచి మార్టూరు స్టేషన్‌కు తీసుకువస్తున్నాయన్నారు. ఈ కేసులో 6 గురు నిందితులల్లో ఇప్పటికి ఐదుగురిని అరెస్ట్ చేశామని తెలిపారు.

ముమ్మరంగా ఆహార తనిఖీలు

పలు రెస్టారెంట్‌లపై అధికారుల ఆగ్రహం

చీరాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మంగళవారం ఆహార భద్రత అధికారులు గరికపాటి ప్రభాకరరావు, ప్రణీత్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా పలు రెస్టారెంట్‌లు, బిర్యానీ పాయింట్లలో ముమ్మురంగా తనిఖీలు చేశారు. ఈక్రమంలో వంట గదిలో నిల్వ ఉంచిన మాంసాహారం, ఇతర పదార్థాలను గుర్తించారు. కిచెన్ పరిసరాల్లో అపరిశుభ్రంగా ఉండడాన్ని చూసి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ తనిఖీల్లో కొందరు నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు. అం తేకాకుండా మరి కొన్ని రెస్టారెంట్‌లలో శాంపిల్స్‌ను సేకరించారు. పరీక్షలు అనంతరం చర్యలు ఉంటాయని చెప్పారు. నిల్వ పదార్థాలు ప్రజలకు అందిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో దాసరి ఇమ్మానియేల్ తదితర సిబ్బంది ఉన్నారు.

150 మందికి దంత పరీక్షలు

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో మంగళవారం 150 మందికి దంత పరీక్షలు నిర్వహించారు. సిబార్ దంత వైద్యశాలకు చెందిన బీడీఎస్ 4వ సంవత్సరం చదువుతున్న 10 మంది విద్యార్థినులు, పీజీ విద్యార్థులు ముగ్గురు, ప్రొఫెసర్లు దేవకి, రాజశేఖర్ ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. కొంతమందికి పిప్పిపన్నులు, ఇబ్బంది పెడుతున్న పన్నులను తొలగించారు. కార్యక్రమంలో వారికి టీడీపీ నాయకులు గుదే తారకరామారావు, కొరటాల వంశీకృష్ణ సహకరించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

బల్లికురవ. ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అద్దంకి నార్కెట్ పల్లి రాష్ట్రీయ రహదారి కొప్పెరపాడు గ్రామ సెంటర్‌లో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. రెండు మాసాలుగా కొప్పెరపాడులో ఇతర రాష్ట్రం నుంచి వచ్చిన 60 ఏళ్ల వయస్సు ఉండే మహిళ రోడ్డు వెంబడి ఉన్న దుకాణాల వద్ద మతిస్థిమితం లేకుండా తిరుగుతూ ఎవరైనా ఏదైనా ఇస్తే తింటూ ఉంటుంది. అదేవిధంగా రోడ్డుపై తిరుగుతున్న మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు పరిశీలించి వీఆర్వో గురవయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతురాలి వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహం వద్దకు ఎవరూ రాకపోవడంతో పోలీసు స్టేషన్ రైటర్ అంజనేయులు దగ్గరుండి మృతదేహాన్ని మోసుకుపోయి పోస్టుమార్టం కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ

● అమ్మేందుకు ప్రయత్నాలు ● గతంలో ఒక తహసీల్దార్ సస్పెన్షన్

కురిచేడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్లపాడు గ్రామంలో ప్రభుత్వ భూమిని దున్ని అమ్మకాలు చేసేందుకు కొంతమంది దళారులు రంగంలోకి దిగారు. ఇటీవల రెవన్యూ అధికారులందరూ గంగదొనకొండ గ్రామ పరిధిలో బయోగ్యాస్ ప్లాంట్ పనుల్లో ఉండటంతో దళారులు ఇదే అదనుగా భూమిని దున్నారు. దానిని అమ్మే ప్రయత్నాలు సాగించారు. ఈ భూమిని గతంలో అక్రమంగా ఆన్‌లైన్ చేసిన ఓ తహసీల్దార్ సస్పెండ్ కూడా అయ్యారు.

మండలంలో ప్రభుత్వ భూమి పెద్ద మొత్తంలో ఉంది. దానిని ఏదో ఒకరకంగా స్వాధీనం చేసుకునేందుకు దళారులు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో అసైన్డ్ పట్టాలు ఇచ్చిన వారి వద్ద కొంత కొనుగోలు చేసి దాని పక్కనే ఉన్న దానిని ఆక్రమించేందుకు పెద్దలు పావులు కదుపుతున్నారు. కొద్ది రోజులుగా కురిచేడు మండలం గంగదొనకొండ గ్రామ పొలాల్లో రిలయన్స్ సంస్థ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేస్తుండటంతో రెవెన్యూ అధికారులందరూ ఆ విషయంలో బిజీగా ఉన్నారు. ఇదే అదనుగా దళారులు రంగప్రవేశం చేసి పొట్లపాడు పరిధిలో ప్రభుత్వ భూమిన దున్నే ప్రయత్నాలు చేశారు. మొత్తం 50 ఎకరాలకుపైగా దున్నారని దాని విలువ కోటిన్నర రూపాయలకుపైగా ఉంటుందని స్థానికులు అంటున్నారు.

గతంలో పొట్లపాడు గ్రామ పొలాల్లో ఇద్దరి పేర్లతో ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆన్‌లైన్ చేసి పాస్‌పుస్తకాలు ఇచ్చారు. నీలకంఠన్ ప్రభాకరన్ పేరుతో 42.70 ఎకరాలు, చింతా వెంకటేశ్వరరావు పేరుతో 38.69 ఎకరాలు ఆన్‌లైన్ చేశారు. నీలకంఠన్ ప్రభాకరన్‌కు 1బీలో 1199 ఖాతా నంబరుతో ఆన్‌లైన్ చేశారు. ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసినట్లు అక్రమంగా రికార్డుల్లో చూపారు. ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిన వైనంపై అపుడు ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురావడంతో రెవెన్యూ అధికారులు విచారణ చేసి తహసీల్దార్‌ను సస్పెండ్ చేయడమే కాక ఆన్‌లైన్ చేసిన భూములకు సంబంధించి ఆన్‌లైన్ రద్దు చేశారు. ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టారు. ఇపుడు ఆ భూమితో పాటు పక్కనే ఉన్న మరికొంత భూమిని దున్నే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆర్ఐ. వీఆర్వోలు పరిశీలించి ప్రభుత్వ భూమిని దున్నవద్దని, దున్నితే కేసులు పెడతామని హెచ్చరించి వచ్చారు.


అక్రమార్కులు దున్నిన ప్రభుత్వ భూమి


పార్కులో పనులు పరిశీలిస్తున్న కమిషనరు

చురుగ్గా ఎన్టీఆర్ పార్కు అభివృద్ధి పనులు

● పరిశీలించిన మునిసిపల్ అధికారులు

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహించిన 'అక్షరమే ఆయుధం- పరిష్కారమే అజెండా'తో 37వ డివిజన్‌లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏబీఎన్-ఆంధ్రజ్యోతి దృష్టి సారించగా, ప్రసన్న చెన్నకేశవ లే అవుట్ పార్కు అభివృద్ధి కమిటీ ప్రతినిధుల పలు సమస్యలను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు కొద్ది రోజులుగా పనులు జరుగుతుండగా, ఆ పనులను కమిషనరు వెంకటేశ్వరరావు, మునిసిపల్ ఇంజనీర్ చంద్రయ్య స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి వేణితో కలిసి పరిశీలించారు. పార్కులో పిల్లల ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్, సోలార్ లైట్లు, పార్కు ఆవరణం ఎత్తు పెంచడంతోపాటు, నీరు నిల్వ లేకుండా డ్రైన్ పనులు జరుగుతున్నాయి. పనుల నాణ్యతను కమిషనరు పరిశీలించారు. పార్కు అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ గోపాల్, శానిటరీ సూపర్ వైజర్ షేక్ బాబ్జి, పార్కు అభివృద్ధి కమిటీ నాయకులు చెన్నుపాటి వర ప్రసాద్ పాల్గొన్నారు.

డెయిరీ భూములను పరిశీలించిన జేసీ


డెయిరీ భూములను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలక్రిష్ణ

సంతనూతలపాడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేర్నమిట్ట సమీపంలోని ప్రకాశం జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘం భూములను అన్యాక్రాంతం అవుతున్నాయన్న వార్తల నేపథ్యంలో మంగళవారం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా పాల ఉత్పత్తి దారులసంఘం భూములను అత్యవసరంగా సర్వేచేసి, వాటికి హద్దురాళ్లు వేయించాలని తహసీల్దార్ వి.ఆదిలక్ష్మిని ఆదేశించారు. ఈ సందర్భంగా కొంతమంది తమకు పేర్నమిట్ట సర్వేనెంబరు 140లో ఇంటి ఎలివేషన్ నివేశన స్థలాలను రిజిస్టర్ డాక్యుమెంట్ ద్వారా కొనుగోలు చేశామంటూ జాయింట్ కలెక్టర్ గోపాలక్రిష్ణను సంప్రదించారు. వారి డాక్యుమెంట్లను కూడా తీసుకుని పరిశీలించి తగు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్‌డీవో లక్ష్మీప్రసన్న, సర్వేర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

● మంత్రి స్వామి ఆదేశం ● ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష


ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి స్వామి

టంగుటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కొండపి నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం ఆయన సమీక్ష నిర్వహించారు. తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న గ్రామాలు, ప్రత్యామ్నాయ వనరులు, సరఫరాలో ఏర్పడుతున్న ఇబ్బందులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. మోటార్లు పనిచేయని చోట మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వేణుగోపాల్‌రావు, ఏఈలు కిషోర్, వెంకటేశ్వరరావు, మహేంద్రారెడ్డి, పౌలురాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రగ్బీ నేషనల్ క్రీడలకు గిద్దలూరు వాసి ఎంపిక

● అభినందించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ● రూ.25వేల అందజేత


పాండునాయక్‌కు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అస్సాం రాష్ట్రంలోని డిస్పూర్‌లో ఈనెల 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరగనున్న రగ్బీ జాతీయ క్రీడలకు మండలంలోని వెల్లుపల్లె గ్రామానికి చెందిన పాండు రంగనాయక్ అర్హత సాధించారు. ఆయన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అభినందించిన ఎమ్మెల్యే రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో ప్రతిభ కనబరిచి గ్రామానికి, నియోజకవర్గంతో పాటు రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వెల్లుపల్లె గ్రామస్థులు బద్రి గోపాల్‌రెడ్డి, కంకర వెంకటరెడ్డి, కంకర రామశంకర్‌రెడ్డి, సుగాలి వెంకటేశ్వర్లునాయక్, రామయ్య, తిరుపతయ్య, రంగస్వామి పాల్గొన్నారు.

పోలీసు పహారాలో అమ్మనబ్రోలు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ, టీడీపీ నేత ముప్పవరపు వీరయ్య చౌదరి ఒంగోలులోని తన కార్యాలయంలో మంగళవారం రాత్రి 7.30 ప్రాంతంలో దారుణ హత్యకు గురికావడంతో ఆయన స్వగ్రామమైన అమ్మనబ్రోలు గ్రామం ఒక్కసారిగా ఉలికిపాటుకు గురయింది. వీరయ్య చౌదరి హత్య వార్త తెలుసుకొన్న ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు, అభిమానులు వెంటనే ఒంగోలు జీజీహెచ్‌కు పెద్దఎత్తున తరలివెళ్లారు. గ్రామంలోని వ్యాపార దుకాణాలు, చిరు వ్యాపారులు సైతం స్వచ్ఛందంగా తమ దుకాణాలను మూసివేశారు. అమ్మనబ్రోలు గ్రామంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా స్పెషల్ పార్టీ ఆర్ఎస్ఐ శివప్రసాద్, స్థానిక హెడ్ కానిస్టేబుల్ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఒంగోలు నుంచి వచ్చిన ప్రత్యేక పోలీసు బలగాలు, స్థానిక పోలీసులు... ప్రజలు గుంపులుగా బయట తిరగరాదని హెచ్చరికలు జారీ చేశారు. పలు గ్రామాల్లోని అనుమానితులుగా భావిస్తున్న వారిని స్థానిక పోలీసులు విచారిస్తున్నారు.

పొగాకు వేలాన్ని అడ్డుకున్న రైతులు

● గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్


గిట్టుబాటు ధర కల్పించాలని ఆందోళన చేస్తున్న పొగాకు రైతులు

పొదిలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని మంగళవారం రైతులు పొదిలిలో వేలం ప్రక్రియను అడ్డుకున్నారు. పొగాకు ధరలు రోజురోజుకు దిగజారిపోతున్నాయని, నోబిడ్‌లు ఎక్కువగా వస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు దిగ్గోస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యయప్రయాసలకు ఓర్చి పండించిన పంటకు గిట్టుబాటు ధరల కల్పించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బోర్డు అధికారులు సైతం గిట్టుబాటు ధర కల్పించడానికి కృషి చేయడం లేదని ఆరోపించారు. ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పొగాకు పండించి నష్టాలను చవిచూడాల్సి వస్తోందన్నారు. దీనికితోడు వేలకేంద్రానికి తీసుకొచ్చిన పొగాకు బేళ్లను నోబిడ్ వేడయం వల్ల తిరిగి తీసుకెళ్లడం పరిపాటిగా మారిందని ధ్వజమెత్తారు. కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతుల వాగ్వాదంతో వేలం ప్రక్రియ 30 నిమిషాల పాటు నిలిచిపోయింది. ఒక దశలో ఆగ్రహించిన రైతులు పొగాకుబోర్డు అధికారులను చుట్టుముట్టారు. అధికారులు ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు సర్ది చెప్పారు. గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. దీంతో శాంతించిన రైతులు వేలం ప్రక్రియ కొనసాగనిచ్చారు. అయితే రైతులు కూడా ప్రస్తుత వేలానికి నాణ్యమైన పొగాకును తీసుకురావాలని వేలం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్ సూచించారు. వేలంలో ముందుగా నాణ్యత ఉన్న పొగాకును ఉంచితే మంచి ధర వస్తుందన్నారు. నాణ్యత ఉన్న బేళ్లు వేలానికి రాకపోవడంతో ఎక్కువ నోబిడ్‌లు వస్తున్నాయని తెలిపారు. కనుక రైతులు కూడా ఆ విధంగా బోర్డ్ అధికారులకు సహకరించాలని కోరారు.

టీడీపీ వర్గీయులపై వైసీపీ మూక దాడి

● గుండాయిపాలెంలో పికెట్ ● ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ అభివృద్ధిలో భాగంగా రోడ్డు నిర్మాణం చేస్తున్న టీడీపీ వర్గీయులపై వైసీపీ మూక కసి పెంచుకున్నారు. సోమవారం రాత్రి టీడీపీకి చెందిన పెద్దిసింగు సురేష్, ఆయన సోదరుడు వెంకటేశ్వర్లు ఇంటివద్ద మాట్లాడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన వైసీపీ వర్గీయులు అయిలు వెంకటేశ్వర్లు, అయిలు శ్రీను, ఏడుకొండలు, అయిలు రమేష్, వాసు... కర్రలతో దాడి చేశారు. తన స్థలంలో నుంచి రోడ్డు వేయడం ఏమిటంటూ అయిలు శ్రీను ప్రశ్నించి దాడి చేశారు. దీంతో పెద్దిసింగు సురేష్, ఆయన సోదరుడు వెంకటేశ్వర్లు ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకున్నారు. అప్పటికీ ఆగకుండా ఇంటి తలుపును రాళ్లతో పగలకొట్టి లోపలికి ప్రవేశించి ఇద్దరిపై దాడి చేశారు. సురేష్ కంటి పైభాగాన కత్తితో పొడిచారు. తమ స్థలంవైపు వస్తే చంపేస్తామని బెదిరించారు. అనంతరం గాయపడిన పెద్దసింగు సురేష్, వెంకటేశ్వర్లు రిమ్స్‌కు వెళ్లి చికిత్స పొందుతూ అక్కడ ఔట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసిన ఒంగోలు తాలుకా పోలీసులు నిందితులు అయిలు శ్రీను, వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, రమేష్, వాసులను పోలీసులు అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచారు. గుండాయిపాలెంలో సోమవారం రాత్రి జరిగిన ఘర్షణల కారణంగా పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్లు ఒంగోలు తాలుకా సీఐ అజయ్ కుమార్ తెలిపారు.

పోలీసు స్టేషన్ వద్ద వైసీపీ నాయకుల బైటాయింపు

గుండాయిపాలేనికి చెందిన ఐదుగురు వైసీపీ వర్గీయులను అక్రమంగా అరెస్టు చేశారని ఒంగోలు నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి చుండూరి రవి ఆధ్వర్యంలో తాలుకా పోలీసు స్టేషన్ వద్ద బైటాయించి నిరసన తెలిపారు. ఐదుగురిపై కేసు నమోదు చేశామని, అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు సమాధానం ఇవ్వడంతో అక్కడ నుంచి వెనుదిరిగి వెళ్లారు.

మాతాశిశు సంరక్షణలో ఆశ వర్కర్ల పాత్ర కీలకం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంరక్షణ సేవల్లో ఆశ వర్కర్ల పాత్ర ఎంతో కీలకమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి టి.వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం ఒంగోలు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ మీటింగ్ హాల్‌లో మార్కాపురం డివిజన్ ఆశ నోడల్ ఆఫీసర్స్ మీటింగ్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కిల్కారి కాల్ ద్వారా తల్లిబిడ్డల సమాచారం అందించబడుతుందని తెలిపారు.


కంటతడి పెడుతున్న ఈదర హరిబాబు


ఎస్పీతో మాట్లాడుతున్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, జనార్దన్, సత్య

2 నిమిషాల్లో హత్య

● ఎస్పీ కార్యాలయం, తాలూకా స్టేషన్‌కు.. ● కూతవేటు దూరంలో ఘటన

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వీరయ్యచౌదరి (51)ని గుర్తుతెలియని వ్యక్తులు రెండు నిమిషాలలో హత్య చేసినట్లు పోలీసుల సమాచారం. సీసీ కెమెరాల ఫుటేజ్‌లో ఈ విషయం బయటపడింది. రెండు బైక్‌లపై నలుగురు దుండగులు నేరుగా వీరయ్యచౌదరి కార్యాలయం వద్దకు వెళ్లారు. అక్కడ మొదటి అంతస్తులో ఉన్న చార్టెడ్ అకౌంట్స్ కార్యాలయానికి వెళ్లి వీరయ్య చౌదరి కార్యాలయం ఇదేనా? అని అడిగారు. అక్కడ ఉన్నవారు పైన అని చెప్పడంతో రెండో అంతస్తుకు ముగ్గురు వెళ్లారు. కింద ఒక యువకుడు ఉన్నాడు.

అంతా కొద్దిసేపట్లోనే..

ముగ్గురు దుండగులు వీరయ్య చౌదరి దగ్గరకు వెళ్లారు ఆ సమయంలో అక్కడ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న మహిళ ఆఫీసు విషయాలు మాట్లాడుతుంది. ఆ సమయంలో దుండగులు ముగ్గురు ఒక్క ఉదుటున వీరయ్య చౌదరిపై పడి విచక్షణా రహితంగా కత్తులతో పొడిచారు. చివరిలో గొంతులో పొడిచారు. ఆ సమయంలో అకౌంటెంట్‌ను పక్కకు లాగిపడవేశారని తెలిసింది. సీసీఫుటేజీ ప్రకారం రాత్రి 7.33 నిమిషాలకు వెళ్ళిన దుండగులు 7.36కు తిరిగి వచ్చారు. సుమారుగా 25 కత్తిపోట్లకు పైగా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. అంతేకాదు వీరయ్యచౌదరి మృతిచెందాడని గుర్తించిన తర్వాతే అక్కడి నుంచి వెళ్లిపోతూ గొంతులో పొడిచి వెళ్లారని అక్కడ సాక్షులు కథనం. కార్యాలయంలో మహిళతోపాటుగా మరో ఉద్యోగి కూడా ఉన్నారు. దుండగులు హత్య చేసి వెళుతూ కార్యాలయం బయట గడియపెట్టి వెళ్లారు. దుండగులు తెలుగు మాట్లాడుతున్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

వ్యాపార లావాదేవీలే హత్యకు కారణం?

వ్యాపార లావాదేవీలే హత్యకు కారణమనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వీరయ్య చౌదరితో వ్యాపార లావాదేవీలు ఉన్న వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. అంతేకాకుండా ఏదైనా వివాదాలు ఉన్నాయా? అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నారు. అదే క్రమంలో వీరయ్య చౌదరి మద్యం వ్యాపారం చేస్తున్నారు. కొంతమందితో సిండికేట్ అయి సుమారు 30 దుకాణాలు నిర్వహిస్తున్నారు. కాగా హత్య జరిగిన సమాచారం తెలుసుకున్న వెంటనే ఎస్పీ ఏఆర్ దామోదర్ సంఘటనా స్థలానికి చేరుకుని అంతా పరిశీలించారు. సీసీ ఫుటేజీలను చూశారు. కాగా వీరయ్య చౌదరిని హత్య చేసేందుకు వచ్చిన దుండగులలో ఒకరికి చేయి లేదు.


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం




గుమిగూడిన జనం

ముదిగొండకు ముప్పు

బీరంగుంట సమీపాన వాగును ఆక్రమించి రొయ్యల చెరువుల తవ్వకం

వరద దిగువకు వెళ్లేందుకు ఇబ్బందులు

సమీప లోతట్టు పల్లెలు, వరి పొలాలు మునిగే ప్రమాదం

ఒంగోలురూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు మండలం దేవరంపాడు రెవెన్యూ పరిధిలోని బీరంగుంట సమీపాన ముదిగొండవాగు ఆక్రమణ కోరల్లో చిక్కుకుంది. ఆక్రమార్కులు వారం నుంచి రొయ్యల చెరువుల సాగుకు అడ్డగోలుగా తవ్వకాలు చేస్తున్నారు. వాగు సుమారు 300 మీటర్లు వెడల్పు ఉంటుంది. ఆక్రమార్కులు ప్రస్తుతం వాగును కేవలం 30 మీటర్లు మాత్రమే వదిలి మిగిలిన 270 మీటర్ల వెడల్పును ఆక్రమించి రొయ్యలు చెరువులుగా ఎక్స్‌కవేటర్లతో తవ్వి కట్టలు వేస్తున్నారు. ఇలా సుమారు 700 మీటర్ల పొడవున కట్టలు వేశారు. వాగుకు దక్షిణం వైపు మాత్రమే నీటిప్రవాహానికి 30 మీటర్లు కాలువ వదిలారు.

సుమారు 25 ఎకరాలపైనే ఆక్రమణ

ఇప్పటివరకు రొయ్యల చెరువుల తవ్వకాల విస్తీర్ణం 25 ఎకరాలుపైగానే ఉంటుందని పరిసర రైతులు చెబుతున్నారు. ముదిగొండవాగు మూసుకుపోతే త్రోవగుంట దగ్గర నుంచి సముద్రతీరప్రాంత గ్రామమైన పాతపాడు గ్రామం వరకు వరద నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతాయి.

బాధ్యులపై కేసులు పెడతాం

వాసు, తహసీల్దార్

ముదిగొండి వాగులో తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. కేసులు పెడతాం. వాగులలో తవ్వకాలు పూర్తిగా నిషేధం. ముదిగొండలో ప్రవాహం ఉంటుంది. ఈ వాగులో తవ్వకాలు చేపడితే కాలువ పక్కన గల గ్రామాల ప్రజలకు, పంటలు పొలాలకు ఇబ్బంది. వీఆర్వో, మండల సర్వేయర్లను పంపించి పరిశీలించి, అలాంటి వ్యక్తులపై పోలీస్ కేసులు పెడతాం. తవ్వకాలను పూడ్చివేయిస్తాం.



ముదిగొండివాగును చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

ఆక్రమణ వల్ల గ్రామాలకు, పంటలకు ఇబ్బందులు

ప్రస్తుతం ముదిగొండ వాగు ఆక్రమణ వల్ల పరిసర గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. త్రోవగుంట దగ్గర, చేజర్ల దగ్గర గ్రామాల పరిధిలో ముదిగొండ వాగు సమీపంలో రైతులు ఏటా సుమారు 700 ఎకరాలలో వరి పంట సాగు చేస్తుంటారు. దిగువన వాగు ఆక్రమణల వల్ల.. వరదలు వస్తే ఈ వరి పంట పొలాలు ముంపునకు గురవుతాయి. వర్షాకాలంలో వాగు ఉగ్రరూపంతో ప్రవహిస్తూ వరదలు వస్తుంటాయి. గతంలో వాగు ఉధృతికి చేజర్ల, ఉలిచి, పాతపాడు, త్రోవగుంట లోతట్టు ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నాయి. అంతేగాక ముదిగొండవాగు ఉధృతికి మండవవారిపాలెం దగ్గర డ్రీమ్స్ వ్యాలీ, ఎస్సీ కాలనీల్లో ముదిగొండ కట్టదాటి నీటి ప్రవాహం జరిగి ప్రజలు ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నాయి. కొత్తపట్నం మండలంలోని గాదెపాలెం, ఆలూరు, బీరంగుంట గ్రామాలకు కూడా వరద ప్రమాదం పొంచివుంది. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి వాగులో ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు.



వాగును రొయ్యల చెరువుగా మార్చుతూ వేసిన కట్టలు

శోభాయమానంగా శ్రీగిరి ప్రదక్షిణ

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : శ్రవణానక్షత్రం సందర్భంగా శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం శోభాయమానంగా జరిగింది. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు సామూహికంగా గోవిందనామాలు పఠిస్తూ స్వామి ఉత్సవమూర్తిని పల్లకిలో తులసి, పుష్పమాలలతో సుందరంగా అలంకరించి గిరి ప్రదక్షిణ నిర్వహించారు. స్థానిక జయరాం సెంటర్ శ్రీబాపూజీ గోసంరక్షణ సంఘం గోశాల దగ్గర నుంచి ప్రారంభమైన ఈగిరి ప్రదక్షిణ రాజాపానగల్ రోడ్డు, కేశవస్వామిపేట, శర్మ కళాశాల, సీతారాంపురం, గద్దలగుంట, కొణిజేడు బస్టాండు మీదుగా శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం వరకు కొనసాగింది. కార్యక్రమంలో మహేష్ బృందం మంగళవాయిద్యాలు, దేవు వెంకయ్య శంఖనాదం భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు రాధా రమణ గుప్తా, వరిటి కృష్ణారావు, ధనిశెట్టి రాముగుయుడు, గోసంరం వాసు, శెనెగేపల్లి కిషోర్, సురేంద్ర, పి.సురేష్, కనిగెల్లుల పవన్ పాల్గొన్నారు.



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ చెప్పారు. ఒంగోలులోని ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం 4, 17, 24, 25, 26, 27, 28, 37, 38, 43 డివిజన్లలోని కుటుంబ సాధికార సభ్యులతో వేర్వేరుగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ డివిజన్లలో సమస్యలను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్లు సమస్య లేకుండా చూడాలని చెప్పారు. డివిజన్‌లో సమస్యల పరిష్కారం కోసం అన్ని వేళలా అందుబాటులో ఉంటానన్నారు. టీడీపీ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని అందరికీ వివరించాలని చెప్పారు. అలాగే ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువచేయాలన్నారు. డివిజన్లలో ఐక్యతతో సమష్టిగా కలిసి పనిచేసి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని చెప్పారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

సీఎంఆర్ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా

ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తోందని శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ చెప్పారు. మంగళవారం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో 22 మందికి రూ.20.80 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి, పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందిస్తుండగా, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేయించుకునే కీలకమైన శస్త్ర చికిత్సలకు బాధితులకు ప్రభుత్వం తరఫున సీఎంఆర్ఎఫ్ సాయం అందించి, అండగా నిలుస్తోందని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతంతో సాంఘిక సమానత్వం

పల్లామల్లి హైస్కూల్లో విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

చీమకుర్తి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు బలోపేతంతో సాంఘిక సమానత్వం సాకారమవుతోందని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ చెప్పారు. మంగళవారం పల్లామల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఆయన సైకిళ్లు పంపిణీ చేశారు. ఏపీఎండీసీ జాయింట్ వెంచర్ కంపెనీ అయిన ఏపీ గ్రానైట్ మిడ్‌వెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీఎస్ఆర్ నిధులను వెచ్చించి పాఠశాలకు దూరం నుంచి వస్తున్న విద్యార్థినుల సౌకర్యార్థం 45 సైకిళ్లను అందజేశారు. వీటిని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. హైస్కూల్‌కి అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరారు. గ్రామంలోని ఏపీ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండీసీ డైరెక్టర్ నతానియేలు, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంఈవోలు నరసింహారావు, శివాజీ, హెచ్ఎం ఎస్‌వీ రాంబాబు, టీడీపీ నాయకుడు మస్తాన్ ప్రసాద్, గొట్టిపాటి రామారావు, అన్నంనేని రామయ్య, కరిచేటి వెంకటేశ్వర్లు, అంకయ్య, శ్రీనివాసరావు, వేల్పుల శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ హరిబాబు పాల్గొన్నారు.



సైకిళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

పొగాకు మార్కెట్‌ను సజావుగా నడిపించాలి

బోర్డు చైర్మన్, ఈడీలను కోరిన రైతు ప్రతినిధులు

ప్రస్తుత పరిస్థితి ఏకరువు

ఒంగోలు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : పొగాకు మార్కెట్‌లో ప్రస్తుత పరిస్థితి పరిశీలించి సజావుగా మెరుగ్గా సాగేలా చర్యలు తీసుకోవాలని బోర్డ్ చైర్మన్, ఈడీలను పలువురు రైతు ప్రతినిధులు కోరారు. ధరలు తగ్గడం, నోబిడ్‌లు పెరుగుతుండటంపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్ తాజా పరిస్థితిపై రైతులు తోటి మంగళవారం సాయంత్రం గుంటూరులోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో సమావేశాన్ని బోర్డు అధికారులు నిర్వహించారు. దక్షిణాదిలోని 11 పొగాకు వేలం కేంద్రాల నుంచి రైతు ప్రతినిధులు హాజరు కాగా పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్, ఈడీ విశ్వశ్రీ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. జిల్లాకు చెందిన పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బ్రహ్మయ్య సభ్యుడు పోద ప్రసాదరావు, రైతు ప్రతినిధులు పోతుల నరసింహారావు, ఆళ్ల సుబ్బారావు, వల్లభ ప్రసాద్‌లతోపాటు అన్ని వేలం కేంద్రాల నాయకులు హాజరయ్యారు. రైతుల వినతిపై స్పందించి ఈడీ విశ్వశ్రీ రైతులకు ఉపయుక్తంగా ఉండేవిధంగా బోర్డు ప్రయత్నిస్తోందని, రెండు రోజుల్లో వ్యాపారులతో కూడా మీటింగ్ నిర్వహిస్తామని చెప్పారు.

న్యాయం జరిగేలా కృషి

మద్దిపాడు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులకు అన్నివిధాలా న్యాయం జరిగే విధంగా బోర్డు ఉన్నతాధికారులను కలిసి విన్నవిస్తామని బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య చెప్పారు. మంగళవారం వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రం కార్యాలయం దగ్గర విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి నాగార్జున హంగామా చేసినా, అందోళన చేసినా పొగాకు బోర్డు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటేనే జరుగుతుందన్నారు. బోర్డు మెంబరు పోద ప్రసాదరావు మాట్లాడుతూ వేలం కేంద్రంలో పొగాకు బేళ్లు తిరస్కరణ రైతులకు ఇబ్బందికరంగా ఉందని దానిపై దృష్టి సారిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు అబ్బూరి శేషగిరిరావు, రావి ఉమామహేశ్వర రావు, మండవ శ్రీరామమూర్తి, ఎం.గోవిందరాజులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్యను పెంచండి

సంతనూతలపాడు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉపాధిపనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఏపీడీ బీసుబ్బారావు చెప్పారు. సంతనూతలపాడులో మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం దీపబద్ది, సంతనూతలపాడు మండలాల ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

బకాయిలను వెంటనే విడుదల చేయాలి

ఉపాధి కూలీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మద్దులూరు గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడారు.

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ అధ్యాపకులకు అభినందన

ఒంగోలురూరల్ ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు పీవీఆర్ బాలికల పాఠశాలలో మంగళవారం ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను డీఈవో కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఎంఈవో పూర్ణచంద్రరావు, పార్ట్‌టైమ్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయులు కల్యాణి, మాధవాచారి, మధుఅనంద్, మనీషా, శ్రీనివాసరావు, సుశీల, రాణి, ఎస్తేరురాణి, వసుంధరలు పాల్గొన్నారు.

నేడు పది పరీక్షా ఫలితాలు విడుదల

ఒంగోలు విద్య, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : మార్చిలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలు బుధవారం ఉదయం 10 గంటలకు విడుదల చేస్తున్నట్లు పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు ప్రకటించారు. ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాలను కూడా విడుదల చేస్తామన్నారు. విద్యార్థులు తమఫలితాలను ప్రభుత్వ పరీక్షల బోర్డు వెబ్ సైట్, మనమిత్ర వాట్సప్, మీ మొబైల్ యాప్‌ల నుంచి తెలుసుకోవచ్చునని చెప్పారు.

రేపటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలకు ఈనెల 24వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటిస్తూ పాఠశాల విద్యాకమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 11వ తేదీ వరకు పాఠశాలలకు వేసవి సెలవులు, 12న పాఠశాలలు పునఃప్రారంభమవుతాయి. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి నసిపిడితా కార్యక్రమాలకు జూన్ 5వ తేదీన ఉపాధ్యాయులు అందరూ పాఠశాలలకు హాజరుకావాలని ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

క్విజ్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం

ఒంగోలు విద్య ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల సమీపంలోని కొన్ని ప్రాంతాలలో చెత్తను ఏరివేసి మొక్కలు నాటారు. భూమిని పర్యావరణాన్ని కాపాడాలని ప్రతిజ్ఞ చేసి ప్రజలందరికీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్యకళ్యాణ చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ పి.గాయత్రీదేవి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి వాసుబాబు, ఇన్‌స్ట్రక్టర్ రమణయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల రిజిస్ట్రేషన్‌కు వెసులుబాటు కల్పించండి

ఒంగోలు విద్య ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విద్య హక్కు చట్టం 12- 1(సి) ప్రకారం విద్యార్థులను చేర్చుకునేందుకు రిజిస్ట్రేషన్‌లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ రాష్ట్రనాయకులు వివ్రకాశ్‌బాబు మంగళవారం డీఈవో కిరణ్‌కుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. రిజిస్ట్రేషన్‌కు వెసులుబాటు కల్పించటంతోపాటు మూడేళ్లుగా రాష్ట్రప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఈవోను కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గేరా అజయ్‌కుమార్, కె.శివకోటిరెడ్డి, పట్టణ అధ్యక్షులు వీఎస్ లక్ష్మి, శ్రీనివాసరావు, మైకేల్, ఎం రామిరెడ్డి, శ్రీరాములురెడ్డి పాల్గొన్నారు.

పొగాకు రైతులకు న్యాయం చేయాలి

మద్దిపాడు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని మాజీ మంత్రి నాగార్జున కోరారు. మంగళవారం వెల్లంపల్లి పొగాకు బోర్డులో జరుగుతున్న వేలం పాటను ఆయన పరిశీలించారు. ఈ క్రమంలో రైతులతో మాట్లాడారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏ పంట రైతు ఆనందంగా లేరని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పంట మద్దతు ధర కల్పించకుండా తీవ్రఅన్యాయం చేస్తున్నాయన్నారు. 2019లో పొగాకు వ్యాపారులు సిండికేట్ అయి పొగాకును అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తే అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి రైతుల పట్ల సానుభూతితో రూ.200 కోట్లు మంజూరుచేసి, మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకును కొనుగోలు చేయించారని గుర్తు చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లు విడుదల చేసి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు పోలవరపు శ్రీమన్నారాయణ, దుంపా చెంచిరెడ్డి, గోపిరెడ్డి ఓబుల్ రెడ్డి, వాకా కోటిరెడ్డి, గుంటేటి రవి, బెజవాడ శ్రీరామమూర్తి, పల్లకి సత్యనారాయణ రెడ్డి, వల్లంరెడ్డి బాల అంజనేయ రెడ్డి పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర రూ.280

సంతనూతలపాడు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేర్నమిట్ట సమీపంలోని ఒంగోలు-1వ వేలం కేంద్రం పరిధిలో మంగళవారం అమ్మకాలకు గుర్రాలమడుగు క్లస్టర్ నుంచి 728 పొగాకు బేళ్లు వచ్చాయి. వాటిలో 457 బేళ్లు అమ్ముడవ్వగా, 251 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ ఆర్.రవికాంత్ తెలిపారు. గరిష్ఠ ధర కిలో రూ.280 పలకగా, కనిష్ఠ ధర రూ.210 పలికింది. సరాసరి ధర రూ.249.40 వచ్చినట్లు తెలిపారు.

యానాదుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి అబీఐవీ

మంత్రి స్వామి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న యానాది సంఘం నాయకులు

టంగుటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : యానాదుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని తూర్పునాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో ఉన్న ఆయన్ను మంగళవారం యానాది సంఘం జిల్లా ప్రతినిధులు కలిశారు. యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, తమను ప్రిమిటివ్ ట్రైబల్ జాబితాలో చేర్చాలని, జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యమివ్వాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

ఒంగోలు నగరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని మంత్రి స్వామి చెప్పారు. స్త్రీ, శిశుసంక్షేమశాఖ నిర్వహించిన పోషికాహార పక్షోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ఆయన స్థానిక ప్రకాశం భవనం వద్ద ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, మేయర్ గంగాడ సుజాత, ఐసీడీఎస్ పీడీ హేమసుజన పాల్గొన్నారు.

సీహెచ్‌వోల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని మంగళవారం కలెక్టరేట్ వద్ద సీహెచ్‌వోలు(ఎంఎల్‌హెచ్‌పీలు) నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏపీవీవీపీ సంఘ నాయకులు మంగేష్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని, విద్యుత్, అద్దె బకాయిలు చెల్లించాలని, నిర్దిష్టమైన జాబ్ చార్ట్ ప్రకటించడం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవీవీ నాయకులు కోటేశ్వరమ్మ, ఏపీఎంపీసీ రాష్ట్ర నాయకులు మందగిరి రాజేష్, రవికుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వర్గీకరణ రద్దు చేయకుంటే ఉద్యమిస్తాం

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : వర్గీకరణ ఆర్డినెన్స్‌ను దొడ్డిదారిన తీసుకొచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాలలకు తీవ్రంగా అన్యాయం చేశారని మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి ఆశోక్ చెప్పారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ పేరిట మాలలకు అన్యాయం జరుగుతోందని, అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. ఐలవిల వెరాళ్లనంలోమాలలను గ్రామ బహిష్కరణ చేశారని దీనిపై డిప్యూటీ సీఎం మౌనం వహించారని చెప్పారు. మాలల పట్ల పవన్‌కళ్యాణ్ కు ఉన్న వివక్ష అర్థమైందని ఆరోపించారు. సమావేశంలో మాల ఉద్యోగ సంఘం నాయకులు మిట్టసల శాంతారావు, కొప్పుల ఏడుకొండలు, బంటుపల్లి రాజు, పిల్లి మాల్యాద్రి, యరజర్ల రమేష్, మేడికొండ లక్ష్మీనారాయణ, రిటైర్డ్ డీఈవో పి.మధుసూదనరావు, కోటిబాబు, మేడిద రవి ఉన్నారు.

ఏకేయూ డిగ్రీ ఫలితాలు విడుదల

ఒంగోలు విద్య, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయ డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వైస్ చాన్సలర్ డీవీఆర్ మూర్తి మంగళవారం విడుదల చేశారు. విశ్వవిద్యాలయ పరిధిలోని 88 డిగ్రీ కళాశాలల నుంచి 8,114 మంది పరీక్షలకు హాజరు కాగా 3,956 మంది పాస్ై 48.76 శాతం ఉత్తీర్ణత సాధించారు. రిజిస్ట్రార్ హరిబాబు, సీఈ కేవీఎన్ రాజు, ఏసీఈ భరతదేవి, సీడీసీ డీన్ సోమశేఖర్ ఉన్నారు.

అంబేద్కర్ నాటకం పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఒంగోలు కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం అంబేడ్కర్ నాటకం పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ అన్సారియా ఆవిష్కరించారు. కేవీపీఎస్ సామాజిక చైతన్య సాంస్కృతిక ఉత్సవాలు-2025 ఆధునిక రంగస్థలంపై డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జీవితచరిత్ర కూరపాపకం మే 8న కలెక్టరేట్ భవనం ఎదురు అంబేద్కర్ భవనంలో, మే 9న మద్దిపాడు నటరాజ కళాక్షేత్రం పంచాయతీ కార్యాలయంలో జరిగే నాటకాలను జయప్రదం చేయాలని కోరుతూ కేవీపీఎస్ జిల్లా ముద్రించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

వైభవంగా పోలేరమ్మతల్లి తిరునాళ్ల

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఉప్పుగుండూరు గ్రామంలో వెలసిన శ్రీ పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. అనేక ఏళ్ల నుంచి గ్రామంలోని యాదవ సామాజిక వర్గం ఆధ్వర్యంలో ఆనవాయితీగా నిర్వహిస్తున్న పోలేరమ్మతల్లి కొండపాటూరు తిరునాళ్ల సందర్భంగా పోలేరమ్మతల్లి ఆలయాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ కాంతులతో మిరుమిట్లు గొలిపేలా అలంకరించారు. 16 పొట్టేళ్ల ప్రభలను ఏర్పాటు చేసి విద్యుత్‌కాంతులతో అలంకరించారు. మేళతాళాలతో గ్రామ వీధుల్లో తెల్లవార్లు వరకు సాగుతూ గ్రామదేవత కొలుపులు వైభవంగా జరిగాయి.

జేసీ మెడికల్ కోడింగ్ బ్రోచర్‌ను ఆవిష్కరించిన దామచర్ల

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఏర్పాటు చేసిన జేసీ మెడికల్ కోడింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ బ్రోచర్‌ను శాసనసభ్యులు జనార్దన్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ మెడికల్ విద్యార్థుల కోసం కోడింగ్ సెంటర్‌ను ఒంగోలులో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంస్థ చైర్మన్ చిన్న మాట్లాడుతూ నూరుశాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, వీసీ, సీసీఎస్, సర్టిఫికెట్ ట్రైనింగ్ కూడా ఇస్తామని తెలిపారు.

విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని అధిగమించాలి

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని అధిగమించి విజయం సాధించే విధంగా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని డీఈవో ఏ.కిరణ్ కుమార్ చెప్పారు. స్థానిక ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ వారు నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. డైట్ ప్రిన్సిపల్ సామా సుబ్బారావు, సమగ్ర శిక్ష ఏఎంవో ఎం.రమేష్ పాల్గొన్నారు.

అవీ.. ఇవీ..

విద్యుత్తు షాక్‌తో వ్యక్తి మృతి


విద్యుత్ షాకుతో మృతిచెందిన ఏసుదానం

పెద్దదోర్నాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గంటవానిపల్లె గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకొంది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన ఎలకపాటి ఏసుదానం(40) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం ఏసుదానం తన ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో టేబుల్ ఫ్యాన్ స్విచ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగ తగిలి కరంటు షాక్ కొట్టింది. దీంతో స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించే సమయానికే మృతి చెందినట్లు తెలిపారు. దాంతో బంధువులు పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి మార్కాపురం ప్రాంతీయ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

మరో ఘటనలో..

మార్కాపురం రూరల్ : మండలంలోని తిప్పాయపాలెం గ్రామం వద్ద విద్యుత్ షాక్ గురై వ్యక్తి షేక్ నభిహాల్ (24) మృతిచెందిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన మృతుడు షేక్ నభిహాల్ తిప్పాయపాలెం గ్రామ పరిధిలో 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు చేసేందుకు స్తంభం ఎక్కాడు. పనులు చేస్తుండగా, ఆకస్మాత్తుగా విద్యుత్‌షాక్‌తో మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం స్థానిక సర్వజన వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఏఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

మిద్దె పై నుంచి జారిపడి మహిళ మృతి

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మిద్దెపై నుంచి మహిళ జారిపడి మృతిచెందిన ఘటన మండలంలోని కోలభీముని పాడు గ్రామంలో మంగళవారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భైరెడ్డి రమణమ్మ (38) మిద్దె పైకి వెళ్లి బట్టలు ఆరేసుకుంటుండగా ఆకస్మాత్తుగా కళ్లు తిరిగి జారి కిందపడింది. దీంతో ఆమె తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే నరసరావుపేటకు తరలించి ప్రైవేటు వైద్యశాలలో వైద్యం అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు రమణమ్మకు భర్త వెంకటరెడ్డితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఆస్పత్రిపై నుంచి దూకి సాధువు ఆత్మహత్య

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిపై నుంచి దూకి సాధువు ఆత్మహత్య చేసుకున్న ఘటన గిద్దలూరులోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద చోటుచేసుకొంది. అందిన సమాచారం మేరకు బెంగుళూరుకు చెందిన సాయికుమార్ (63) అనే సాదువు గిద్దలూరు ప్రాంతంలో భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నాడు. మూడు రోజుల క్రితం భిక్షాటన చేసుకుంటుండగా ఆటో తగిలి గాయాలయ్యాయి. ఆయన్ను ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. చేరిన రోజు నుంచి తన ఆరోగ్యం బాగాలేదని, ఆత్మహత్య చేసుకుంటానని, తనను దేవుడు పిలుస్తున్నాడు అని తోటి రోగులతో చెప్పేవాడు. చివరకు మంగళవారం గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రిపై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గుండె పోటుతో టీడీపీ కార్యకర్త రాసం సతీష్ (38) మృతి చెందాడు. మంగళవారం తెల్లవారుజామున గుండె పోటు రావడంతో సతీష్ మృతి చెందాడు. మండలం లోని ముండ్లపాడు గ్రామంలో నివాసం ఉంటున్న సతీష్ టీడీపీలో క్రియాశీల కార్యకర్తగా ఉంటూ పార్టీ పటిష్ఠకు కృషి చేశాడు. సతీష్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముండ్లపాడు గ్రామం వెళ్లి సతీష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, ముండ్లపాడు ఉపసర్పంచ్ కడియం శేషగిరి, తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వారికి బోనేని చేయూత


నగదు అందిస్తున్న బోనేని

కొమరోలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా మంచానికే పరితమైన వారికి టీడీపీ మండల అధ్యక్షులు, అమ్మాఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు ఆర్థిక చేయుతనిచ్చారు. మండలంలోని దద్దవాడ పంచాయతీలోని కంకరవానిపల్లి గ్రామానికి చెందిన మట్టిమల్ల సుజాత చాలాకాలంగా పక్షవాతంతో మంచానికే పరిమితమైంది. భర్త కాశయ్యకు ఇటీవల కాలు విరిగింది. దీంతో ఆ కుటుంబం పూటగడవడం కష్టంగా ఉందని గమనించిన అమ్మాఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు ఆ కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ద్వారా ప్రభుత్వం నుంచి సాధ్యమైనంతమేరకు ఆకుటుంబానికి సహాయం అందేలా చూస్తామన్నారు. అమ్మాఫౌండేషన్ గిద్దలూరు నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ, పేద ప్రజలకు, విద్యార్థులకు, నిరాశ్రయులకు చేయుతనిస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పందరబోయిన భూపాల్, మల్లికార్జునరెడ్డి, నారాయణ, బాల వెంకటరెడ్డి, కృష్ణ, కాశీరావు, నరసింహ, బాలసుబ్బయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎంపీపీ కిరణ్ గౌడ్


వై.పాలెంలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఎంపీపీ

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని, ఎర్రగొండపాలెం ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక రెయిన్ బో స్కూల్‌లో చలమరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల స్థాయి ప్రతిభ పరీక్ష పోటీలను నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్టులో 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు 253 మంది విద్యార్థులు పాల్గొన్నా రన్నారు. ఈ పోటీలలో పాల్గొని ఫస్ట్, సెకెండ్ విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎంపీపీ కిరణ్ గౌడ్, పాఠశాల కారస్పాండెంట్ కిషోర్‌గౌడ్‌లు ప్రశంసాపత్రంతో పాటు నగదు బహుమతి అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో ఎక్సైజ్ ప్రొహిబిషన్ కేసులకు సంబంధించి పట్టుబడిన వాహనాలకు 23వ తేది బుధవారం స్థానిక ఎక్సైజ్ పోలీసుస్టేషన్ నందు వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ జయరావ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ వేలంపాట నిర్వహిస్తున్నట్లు, వేలంపాటలో పాల్గొనే వారు 11గంటలకు పాల్గొనాలని తెలిపారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అరుణ్‌నాయక్


మాట్లాడుతున్న ఈడీ అరుణ్‌నాయక్

పొదిలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పోరేషన్ రుణాలను యువత నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పోరేషన్ ఈడీ అరుణ్‌నాయక్ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. 2025-26కు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిందన్నారు. జిల్లాకు 1305 యూనిట్లు మంజూరు చేశారన్నారు. అందకు గాను సుమారుగా రూ.54.66 కోట్లు మంజూరయ్యాయన్నారు. దీనికిగాను రాయితీ రూపంలో రూ.30.29లక్షలు కేటాయించార న్నారు. ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తును ఏప్రిల్ 14 నుంచి ఆన్‌లైన్, మీసేవల ద్వారా యూనిట్లు ఎంచుకొని నమోదు చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారుని వయస్సు 21 నుండి 50 సంవత్సరాలు ఉండాలన్నారు. కార్లు తీసుకునే వారికి తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని సూచించారు. మండలంలో నగరపంచాయతీకి 21, గ్రామీణ ప్రాంతాల్లో 22 యూనిట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈప్రక్రియ మే 13 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఆసక్తికలిగి, అర్హత కలిగిన లబ్ధిదారులు వారు చేయగలిగే యూనిట్లు ఎంచుకొని దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ చేసిన వాటిని వెరిఫైచేసే కమిటీ ఉంటుందన్నారు. అందుకు నగరపంచాయతీలో మేయర్ లేకపోవడంతో మున్సిపనల్ కమిషనర్, వార్డునంబర్లు కలిసి ఎంపిక ప్రక్రియ చేపడతార న్నారు. ఈ విధంగా అన్ని మండలాల్లో జూన్ 13 వరకు నమోదు చేసుకోవాలన్నారు. తరువాత అర్హులను గుర్తించి జాబితాను జిల్లా అధికారులకు పంపడం జరుగుతుందన్నారు. ఆవిధంగా అన్ని మండలాల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితాను కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన యూనిట్లు అన్ని క్షేత్రస్థాయిలో ఎంపీడీవో, బ్యాంక్ అధికారులు గ్రౌండింగ్ చేస్తామన్నారు. లబ్ధిదారులు అందరు యూనిట్లు ఏర్పాటు చేసుకొని ఆదాయాన్ని పెంచుకొని కుటుంబ అవసరాలకు ఉపయోగించుకోవాలన్నారు. కనుక ఎస్సీ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాటుసారా, గంజాయిపై ఉక్కుపాదం మోపాలి

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ


సిబ్బందికి సూచనలిస్తున్న రాహుల్‌దేవ్‌శర్మ

మార్కాపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది నాటుసారా, గంజాయిపై ఉక్కుపాదం మోపాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ అన్నారు. స్థానిక అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో మంగళవారం మార్కాపురం ఎక్సైజ్ సబ్‌డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బదికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా నిర్మూలనకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నవోదయం 2.0ను ప్రారంభించిందన్నారు. నాటుసారా ఒక్క చుక్క కూడా ఏ స్టేషన్ పరిధిలో తయారైనా ఉపేక్షించేది లేదన్నారు. ముఖ్యంగా నల్లమల అటవీ ప్రాంతాన్ని అనుకున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గంజాయి అమ్మకంపై కూడా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. గంజాయి కేసుల్లో పదేపదే అరెస్ట్ అయ్యే వారిపై పీడీ యాక్ట్ కూడా నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఒంగోలు డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ, ఎస్‌టీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, ఒంగోలు ఎక్సైజ్ సూపరిం టెండెంట్ ఎస్‌కె ఖాజామొహద్దీన్, ఒంగోలు, మార్కాపురం ఏఈఎస్‌లు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి రూటులో బస్సుల ఏర్పాటు

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి


బస్సు నడుపుతున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతిరూటులో ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆర్టీసీ డిపోకు కొత్తగా మంజూరైన మూడు ఆర్టీసీ బస్సులను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. బస్సులను కొంత దూరం నడిపారు. 1977లో గిద్దలూరులో ఆర్టీసీ డిపో ఏర్పడిందని, ఎంతో ప్రాముఖ్యతను ఈ డిపో సంతరించుకున్నదన్నారు. ఈ రోజు కొత్తగా 3 బస్సులను ప్రారంభించినట్లు తెలిపారు. ఆర్టీసీ డిపోను అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆర్టీసీ ఉద్యోగులతో, యూనియన్ నాయకులతో, సిబ్బందితో కలిసి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి వారి సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, డిపో మేనేజర్ చంద్రశేఖర్, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, పట్టణ, మండల పార్టీల అధ్యక్షులు సయ్యద్ షానేషావలి, మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు భైలడుగు బాలయ్య, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

డిపో ఆవరణలో మరమ్మతులు

ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి డిపో ఆవరణలో బురదమయంగా ఉండడంపై ఆర్టీసీ కార్మికులు, డిపో మేనేజర్ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన గుంతలను పూడ్చాలని ఆదేశించారు. దీంతో ఆర్‌టీసీ సిబ్బంది షేక్ గఫూర్, కొత్తకోట పోలయ్య 35 ట్రాక్టర్ల మట్టితో గుంతలమయంగా ఉన్న ఆవరణను పూడ్చించారు. దీనికి అయ్యే ఖర్చును కార్మికులు గఫూర్, పోలయ్య వెచ్చించినట్లు తెలిపారు.

దాతల సహకారంతో పాఠశాలల బలోపేతం

ఎంఈవో శ్రీనివాసులు


మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసులు

కంభం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం కీలకమని ఎంఈవో-2 శ్రీనివాసులు తెలిపారు. స్థానిక నాయక్‌వీధి ఉర్దూ పాఠశాలలో మంగళవారం పాఠశాల వార్షికోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలు బాషా, షైజీవన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఫాజిల్, ఎస్‌ఆర్‌ఐ రఫి, కోఆప్షన్ సభ్యులు సలీమ్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రుక్సానా, ఖాశింపీరాలను ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో సమన్వయకర్త చిన్న, పద్మావతిదేవి, సీఆర్‌పీలు మురళీ మోహన్, బాబూరావు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : త్రిపురాంతకం గ్రామంలోని బహ్మంగారికాలనీలో ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం విధులు నిర్వహిస్తూ మంగళవారం రిటైరైన పద్మనాభరెడ్డిని తోటి ఉపాధ్యాయులు, ఎంఈవో ఘనంగా సన్మనించారు. ఉద్యోగ విరమణ చేసిన పద్మనాభరెడ్డిని, విద్యార్థుల తల్లిదండ్రులు సన్మానించారు.

రాచర్ల (గిద్దలూరు) : బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా రాచర్ల ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. బంగారు బాల్యం జిల్లా నోడల్ ఆఫీసర్ వి.గిరిధరశర్మ ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ రాచర్ల మండలంలో బంగారు బాల్యం కార్యక్రమానికి సంబంధించి సర్వే నిర్వహించాలన్నారు. తమకు కేటాయించిన సచివాలయాల పరిధిలో అనాధ పిల్లలు, చైల్డ్‌లేబర్, హెచ్‌ఐవీ ఎఫెక్టెడ్ పిల్లలు, వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు తదితర వివరాలన్నీ సేకరించి నెలాఖరులోగా నివేదికలు తయారు చేయాలన్నారు. రాచర్ల మండలంలో బంగారు బాల్యం ప్రాజెక్టు ట్రైల్‌రన్ కింద ఎంపికైందని, ఈ రిపోర్టుల ఆధారంగా జిల్లా అంతట అమలు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమం లో ఐటీ వింగ్ ప్రతినిధులు నాగార్జున, సిద్దిక్‌బాషా పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, ఎస్సై కోటేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంతకుమారి పాల్గొనగా సచివాలయ మహిళ పోలీసులు, అంగన్‌వాడి టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలకు ఈప్రాజెక్టుపై శిక్షణ ఇచ్చారు.

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు ఆమోదం హర్షణీయం


మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నేతలు

పెద్దదోర్నాల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు ఆమోదం లభించడంతో స్థానిక ఎంఆర్‌పీఎస్ నాయకులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు.ఈ క్రమంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు భూషి, కే దానం,కిరణ్ కిశోర్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ రద్దు చేయకుంటే ఉద్యమిస్తాం

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : వర్గీకరణ ఆర్డినెన్స్‌ను దొడ్డిదారిన తీసుకొచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాలలకు తీవ్రంగా అన్యాయం చేశారని మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్ చెప్పారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ పేరిట మాలలకు అన్యాయం జరుగుతోందని, అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. ఇటీవల పిఠాపురంలోమాలలను గ్రామ బహిష్కరణ చేశారని దీనిపై డిప్యూటీ సీఎం మౌనం వహించారని చెప్పారు. మాలల పట్ల పవన్‌కల్యాణ్‌కు ఉన్న వివక్ష అర్థమైందని ఆరోపించారు. సమావేశంలో మాల ఉద్యోగ సంఘం నాయకులు మిట్నసల శాంతారావు, కొప్పులు ఏడుకొండలు, బంటుపల్లి రాజు, పిల్లి మాల్యాద్రి, యరజర్ల రమేష్, మేడికొండ లక్ష్మీనారాయణ, రిటైర్డ్ డీఈవో పి.మధుసూదనరావు, కోటిబాబు, మేడిద రవి ఉన్నారు.

సాహితి సంబరాలకు పిచ్చయ్యకు ఆహ్వానం

గిద్దలూరుటౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఏలూరు పట్టణంలోని మహాలక్ష్మి గోస్వామి కల్యాణ మండపంలో మే 11, 12 తేదీలలో ప్రపంచ తెలుగు సాహితి సంబరాలు నిర్వహిస్తున్నారు. ఈ సంబరాలకు గిద్దలూరు మండలంలోని పొదలకొండపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు డాక్టర్ మొర్రిపిచ్చయ్యకు ఆహ్వానం వచ్చింది. ఆ మేరకు మొర్రి పిచ్చయ్యకు నిర్వాహకులు ఆహ్వాన పత్రికను పంపించారు.

ఘనంగా హోమాల ఏర్పాటు

గిద్దలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురుజుపల్లె గ్రామంలోని శ్రీగంగాభవాని దేవస్థానంలో ప్రతిష్ఠ కార్యక్రమాల సందర్భంగా మంగళవారం ఘనంగా హోమాలు నిర్వహించారు. అభిషేకాలు నిర్వహించారు. గంగాభవాని సహిత సింహ వాహనానికి గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేశారు.

బోనాల సమర్పణ

గిద్దలూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కెఎస్‌పల్లి గ్రామంలో శ్రీపోలేరమ్మ దేవస్థాన 6వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. చివరి రోజు మంగళవారం అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బాలిరెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నేడు పది పరీక్షా ఫలితాలు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : మార్చిలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలు బుధవారం ఉదయం 10 గంటలకు విడుదల చేస్తున్నట్లు పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు ప్రకటించారు. ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి, ఇంటర్ పరీక్షా ఫలితాలను కూడా విడుదల చేస్తామన్నారు. విద్యార్థులు తమఫలితాలను ప్రభుత్వ పరీక్షల బోర్డు వెబ్ సైట్, మనమిత్ర వాట్సప్, మీ మొబైల్ యాప్‌ల నుంచి తెలుసుకోవచ్చునని చెప్పారు. అదే విధంగా అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలకు ఈనెల 24వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటిస్తూ పాఠశాల విద్యాకమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 11వ తేదీ వరకు పాఠశాలలకు వేసవి సెలవులు, 12న పాఠశాలలు పునః ప్రారంభమవుతాయి.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

ఒంగోలు నగరం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని మంత్రి స్వామి చెప్పారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ఆయన స్థానిక ప్రకాశం భవనం వద్ద ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలక్రిష్ణ, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, మేయర్ గంగాడ సుజాత, ఐసీడీఎస్ పీడీ హేమసుజన పాల్గొన్నారు.

అశ్వవాహనంపై చెన్నకేశవుడు


అశ్వవాహనంపై చెన్నకేశుడు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 22 ఆంధ్రజ్యోతి: బ్రహ్మోత్సవాలలో భాగంగా మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి మంగళవారం శ్రీరంగనాయక అలంకరణలో అశ్వవాహనంపై నాలుగు మాడవీధులలో విహరించారు. ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి అశ్వవాహనంపై ఆసీనులను చేశారు. స్వామిని దర్శించుకుని భక్తులు పూజలు నిర్వహించారు. ఉభయదాతగా జటప్రోలు దక్షిణామూర్తి శర్మ వ్యవహరించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు యక్కలి కాశీవిశ్వనాథం, ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

చెన్నయ్య హుండీ ఆదాయం రూ.7లక్షలు

శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. 25 రోజులకు గాను రూ.7,68,597 స్వామి హుండీ ఆదాయం వచ్చిందని ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాల విజయవంతం చేయడానికి సహకరించిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, సబ్‌కలెక్టర్ వెంకట్రివినాగ్, బ్రహ్మోత్సవాల కమిటీ అన్ని శాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు భక్తులకు ఈవో కృతజ్ఞతలు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఆర్.రమణమ్మ, ఆలయ సిబ్బంది, కమిటీ సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

● ప్రధానోపాధ్యాయులకు డిప్యూటీ డీఈవో శామ్యూల్‌జాన్ సూచన

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ప్రధానోపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని మార్కాపురం ఉపవిద్యాశాఖాధికారి పి.శామ్యూల్ జాన్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో డివిజన్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శామ్యూల్ జాన్ మాట్లాడుతూ.. పాఠశాలలను పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పూర్వ విద్యార్థుల సహకారంతో అభివృద్ధి చేయాలన్నారు. విద్యార్థుల నమోదు ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని గృహాలను సందర్శించి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, వసతులు వివరించి నమోదు పెంచాలన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల నియామకంపై విస్తృత ప్రచారం చేసి నిరుద్యోగులకు మార్గనిర్దేశం చేయాలన్నారు. కార్యక్రమంలో మే నెలలో రిటైర్డ్ కానున్న ఉపవిద్యాశాఖాధికారులు శామ్యూల్‌జాన్, చంద్రమౌళీశ్వర్, ప్రధానోపాధ్యాయులు డి.వరలక్ష్మీ, కె.శాశయ్య, కె.తిరుపతిరెడ్డి, పి.గురుస్వామి, సుబ్రహ్మణ్యంలను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవుల పార్టీ సీపీఐ



మాట్లాడుతున్న అందె నాసరయ్య

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అట్టడుగు వర్గాలు, పేదలు, రైతులు, కష్టజీవులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేస్తున్న పార్టీ సీపీఐ అని నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య అన్నారు. సీపీఐ కోయశాఖ సమావేశం ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాసరయ్య మాట్లాడుతూ, జూలైలో దర్శిలో జరిగే జిల్లా మహాసభ ఆగస్టులో ఒంగోలులో జరిగే రాష్ట్ర మహసభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పెద్దన్న, కాశీం, సిద్ధాంతి పెద్దన్న, వెంకటయ్య, అల్లూరయ్య తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

● ఆర్థికసాయం అందిస్తామని ఎమ్మెల్యే ముత్తుముల హామీ


టీడీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కంభం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబాలెంలో టీడీపీ కార్యకర్త వెలుగొండయ్య విద్యుదాఘాతంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పరామర్శించారు. ఈ నెల 29న వెలుగొండయ్య ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమేరకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సోమవారం మృతిని నివాసం వద్దకు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. వెలుగొండయ్య మృతి పార్టీకి తీరనిలోటని, కుటుంబసభ్యులను పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ తరపున రూ.5లక్షలు, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో మాట్లాడి మరో రూ.5లక్షలు మొత్తం రూ.10లక్షలు వచ్చేలా తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి గోన చెన్నకేశవులు, రామకృష్ణ, పోలురాజు, ఆదినారాయణ, రామచంద్రుడు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదిలి ఏపీవోగా మహాలక్ష్మి



పొదిలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పొదిలి మండల నూతన ఏపీవోగా మహాలక్ష్మీ నియమితులయ్యారు. ఆమె మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఉపాధిహామీ పనిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించిన అధికారులు

తర్లుపాడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జపేటలో పారిశుధ్యంపై పంచాయతీ అధికారులు దృష్టిసారించారు. ప్రధాన వీధుల్లో సైడ్ కాలువలు లేకపోవడంతో మురుగు నీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. ఇటీవలె ఈవోపీఆర్‌డీ సుకుమార్ పర్యటించినప్పుడు ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఈవోఆర్‌డీ గ్రామంలో వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి కాళంగి శ్రీనివాసులను ఆదేశించడంతో మంగళవారం గ్రామంలో గ్రామంలోని ప్రధాన వీధుల్లో మురుగును తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. దీంతో గ్రామప్రజలు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

ముఖాముఖి

పాఠ్యపుస్తకాల్లో సమూల మార్పులు

ఎస్.సాంబశివరావు, ఎంఈవో, దొనకొండ



ప్రశ్న: పాఠ్యపుస్తకాల్లో ఎటువంటి మార్పులు, చేర్పులు చేస్తున్నారు ?

జవాబు: ప్రభుత్వం అందించే పాఠ్య పుస్తకాల్లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు తెలుగు, ఇంగ్లీష్, లెక్కల్ కలిపి ఒకే పుస్తకంగా, వర్క్ పుస్తకం అదనంగా ఉండేలా చర్యలు చేపట్టబోతున్నారు.

ప్ర: పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు ఎప్పుడు అందజేస్తారు ?

జ: ఈనెలాఖరుకు మండలానికి చేరే అవకాశం ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేసవి సెలవుల్లో అన్నీ ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు సరఫరా చేస్తారు. పాఠశాలలు పునఃప్రారంభం రోజే విద్యార్థులకు అందజేస్తారు.

ప్ర: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఎంతమంది విద్యార్థులు ఉన్నారు?

జ: మండలంలోని 70 ప్రభుత్వ పాఠశాలల్లో 5528 మంది విద్యార్థులు ఉన్నారు.

ప్ర: విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచేందుకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు ?

జ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పేలా ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి ప్రజలను చైతన్యపరుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పేందుకు తల్లిదండ్రులు సానుకూలంగా ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ముండ్లమూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వైస్ఎంపీపీ వేముల పద్మ జానకిరామయ్య అన్నారు. మంగళవారం జరిగిన ఉమా మహేశ్వర అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ అంకితభావం ఉండాలన్నారు. ఇటీవల రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి హెచ్ఎం బి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, ఎస్ఎంసీ చైర్మన్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభచాటిన విద్యార్థినులకు నగదు బహుమతులు

పామూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీలో ఇంటర్మీడియట్ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులు బహుమతులు అందజేశారు. ఎంపీసీలో టి.శ్రీదేవి 960మార్కులు, డి. హేమశ్రీ 952 మార్కులు సాధించారు. మానవతా సంస్థ చైర్మన్ కె.రామిరెడ్డి, అధ్యక్షుడు ఎం.ముసలయ్య రూ.4 వేలు, రూ.3వేలు అందచేశారు. స్థానిక కేజీబీవీలో మంగళ వారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కటకం సజన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో బైండోవర్

పీసీపల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఘర్షణ కేసులో ఇరువర్గాలను బైండోవర్ చేసిన పోలీసులు మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. ఎస్ఐ కోటయ్య తెలిపిన వివరాల మేరకు.. పీసీపల్లి గ్రామానికి చెందిన కొణిదన రాజారావు, ఎరుకలయ్య స్థలం విషయంలో ఇటీవల ఘర్షణ పడ్డారు. ఇరువర్గాల పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసులు నమోదుచేశారు. బైండోవర్ చేసిన ఇరువర్గాలకు చెందిన కుటుంబ సభ్యులను మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ ధర్మతేజ ఎదుట హాజరుపరిచారు.

కుట్టు శిక్షణ పరిశీలన

దర్శి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలో మహిళలకు ఏర్పాటుచేసిన కుట్టు శిక్షణ తరగతులను బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వర్లు మంగళవారం పరిశీలించారు. మండలంలో రెండు శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఒక కేంద్రంలో దర్శి నగర పంచాయతీలోని మహిళలకు, రెండో కేంద్రంలో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా ఏర్పాట్లుచేశారు. ఈసందర్భంగా బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వర్లు మాట్లడుతూ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత మహిళలకు కుట్టుమిషన్లు ఉచితంగా అందజేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.కృష్ణమూర్తి, నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి చేయాలి

దర్శి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి మండల కమిటీలు, అనుబంధ సంఘ కమిటీలను త్వరలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసంపూర్తిగా సచివాలయాల భవనాలు

- లక్షలు ఖర్చుచేసి లక్షణంగా వదిలేశారు
- మంజూరు చేసినవి 14, పూర్తయినవి 7



అసంపూర్తిగా పెద్దన్నపాలెం సచివాలయ భవనం

దొనకొండ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామ సచివాలయాల భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసింది. ఒక్కో సచివాలయ భవన నిర్మాణానికి రూ.43 లక్షలతో రెండు అంతస్తుల భవనం నిర్మించేలా ప్రణాళిక సిద్ధంచేసి అట్టహాసంగా శంకుస్థాపనలు చేశారు. దొనకొండ మండలంలో 14 గ్రామ సచివాలయాల భవనాల నిర్మాణాలకు చర్యలు చేట్టారు. పనులు చేపట్టేందుకు ఒప్పందం చేసుకున్న వైసీపీ నాయకులు దొనకొండ సచివాలయం-1, సచివాలయం-2, చందవరం, రుద్రసముద్రం, ఆరవల్లిపాడు, పోలేపల్లి, మంగినపూడి గ్రామాల్లో భవనాల నిర్మాణాలు పూర్తిచేసి అప్పగించారు. ఆయా భవనాల్లో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. పెద్దన్నపాలెం, కొచ్చెర్లకోట ఇండ్లచెరువు, రామాపురం, వద్దిపాడు గంగదేవిపల్లి, మల్లంపేట గ్రామాల్లోని సచివాలయాల భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వంలో బిల్లులు చెల్లింపులు జరగకపోవడంతో అర్ధంతరంగా పనులు నిలిపివేశారు. అసంపూర్తిగా ఉన్న భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. నిర్మాణం సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవటంతో దొనకొండ సచివాలయం-2 భవనం అప్పుడే నెర్రలిచ్చింది. లక్షలాది రూపాయలు ఖర్చుచేసి నిర్మించి కొద్దిపాటి పనులతో అసంపూర్తిగా ఉన్న భవనాలు శిథిలావస్థకు చేరకముందే టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడేలా వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



దొనకొండ-2 సచివాలయంలో కుంగిన ఫ్లోరింగ్

బిల్లుల కోసం ఎదురుచూపులు

- దర్శిలో రూ.2 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్
- ఇబ్బందులు పడుతున్న నిర్వాహకులు
- గత ప్రభుత్వ నిర్వాకంతో అవస్థలు

దర్శి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): దర్శి నగర పంచాయతీలో చేసిన పనులకు ఎంతోకాలంగా బిల్లులు రాక నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు రూ.2 కోట్లకుపైగా చేసిన పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అసంబద్ధ నిర్ణయంతో నగర పంచాయతీలో నిధులు ఉన్నా ఇచ్చేందుకు వీలులేకుండా పోయింది. సుమారు ఏడాదిన్నరగా చేసిన పనులకు బిల్లులు విడుదల కాక నిర్వాహకులు అల్లాడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నగర పంచాయతీ, మున్సిపాలిటీల్లో నిధుల డ్రా చేసే వీలులేకుండా ఫీజింగ్ విధించటంతో ఈ దుస్థితి నెలకొంది. దీంతో ప్రస్తుతం పనులు చేసేందుకు నిర్వాహకులు ముందుకు రావటం లేదు.

దర్శి నగర పంచాయతీలో రూ.5 కోట్లకు పైగా నిధులు ఉన్నాయి. గత ప్రభుత్వం విధించిన ఫీజింగ్‌తో ఆ నిధులు వాడుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాగైనా బిల్లులు వస్తాయనే ధీమాతో ఇటీవల కాలంలో అనేకమంది పనులు చేశారు. బిల్లుల మంజూరుకు పనులుచేసిన నిర్వాహకులు ఎదురుచూస్తున్నారు.

ఈ విషయంపై దర్శి నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావును వివరణ కోరగా.. చేసిన పనులకు రూ.2 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం విధించిన ఫీజింగ్‌తో బి ల్లులు చెల్లించే వీలులేకుండా పోయిందని చెప్పారు. ఈ విషయంపై ప్రస్తుత ప్రభుత్వం త్వరలో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. నగర పంచాయతీ, మున్సిపాలిటీల్లో నిధులను అక్కడ అభివృద్ధి పనులకు వాడుకునేందుకు త్వరలో జీవో విడుదల చేసే అవకాశం ఉందన్నారు. ఆ ఉత్తర్వులు అందిన వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లిస్తామన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న నగర పంచాయతీ చైర్మన్ పిచ్చయ్య, కమిషనర్ మహేశ్వరరావు, తదితరులు

దర్శి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. 20వ వార్డు పరిధిలో ఉన్న చింతలపాలెంలో ఇప్పటివరకు సింగల్ ఫేస్ విద్యుత్ సరఫరా కల్పిస్తున్నారు. నగర పంచాయతీలో అనుసంధానమైన ఆ వార్డుకు కూడా త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు వీలుగా స్తంభాలు, లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆ పనులను వారు పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ అంకబాబు, కౌన్సిలర్ కనకం శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు నక్క రంగారావు తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ హద్దురాళ్ళ గుర్తింపు కోసం సర్వే



హద్దు రాళ్ళను గుర్తిస్తున్న అటవీ శాఖాధికారులు

కురిచేడు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పడమర నాయుడుపాలెం రిజర్వ్ ఫారెస్టు పరిధిలో హద్దు రాళ్ళ గుర్తింపు కోసం అటవీ శాఖాధికారులు రెవెన్యూ శాఖాధికారులతో కలసి సర్వే చేశారు. మొత్తం మూడు బృందాలు ఏర్పడి కురిచేడు, దొనకొండ మండలాలల్లో సర్వే చేశారు. ఇప్పటివరకు ఇరు శాఖల మధ్య ఉమ్మడి సర్వే కోసం చాలా సార్లు ప్రయత్నాలు జరిగినా ఫలితం లేదు. కురిచేడు మండలం గంగదొనకొండ భూముల్లో రిలయన్స్ సంస్థ బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేస్తుండటంతో అక్కడ ఇరు శాఖల మధ్య సరిహద్దు విషయమై పెద్ద వివాదమే నడచింది. అక్కడ పనులు కూడా ఆగాయి. దీంతో ప్రభుత్వ పెద్దలు రంగంలోకి దిగి వివాదాన్ని సరిచేయమని చెప్పడంతో ఇరు శాఖల అధికారులు ఉమ్మడి సర్వే చేపట్టారు. మంగళవారం నుంచి ఇరు శాఖల అధికారులు కలసి మూడు బృందాలుగా ఏర్పడి సర్వే చేపట్టారు. కార్యక్రమంలో అటవీ శాఖాధికారులు, రెవెన్యూ శాఖకు చెందిన సర్వేయర్లు పాల్గొన్నారు.

కాలువల షట్టర్లు మాయం

- పోలీసుల అదుపులో నిందితులు

కనిగిరి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వెలుగొండ కాలువకే మాయగాళ్లు ఎసరు పెట్టారు. హనుమంతునిపాడు పరిధిలోని నందనవనం, పెదవెంగళాయపల్లి కాలువకు వచ్చే డీటీ అఫ్‌టెక్ సీయాజ్ (హెడ్ రెగ్యులేటర్ షట్టర్లు)ను దొంగలు మాయం చేస్తున్నారు. గత ఆరు నెలలుగా తరచూ జరుగుతుందని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఆరోపిస్తున్నారు. వెలుగొండ ప్రాజెక్టు పరిధిలోని తూర్పు కెనాల్ కాలువలో చాలాచోట్ల హెడ్ రెగ్యులేటర్ షట్టర్లు అమర్చారు. ఈ పనులు 2012 ప్రాంతంలో జరిగాయి. తూర్పు కెనాల్ కాలువకు నీరు రాలేదు. దీంతో కాలువలో అక్కడక్కడ 13 ఏళ్ల క్రితం అమర్చిన హెడ్ రెగ్యులేటర్ షట్టర్లు తుప్పుపట్టాయి. వీటిపై కొందరి కన్ను పడింది. కొంతమంది ఓ ముఠాను ఒంగోలు, గుంటూరు ప్రాంతాల నుంచి రప్పించి కాలువకు ఉన్న షట్టర్లను ఒక్కొక్కటిగా మాయం చేస్తూ వచ్చారు. కొండ ప్రాంతాల్లో ఉండటంతో షట్టర్లు రవాణా చేసే లారీల్లో ఏమేమి తరలిస్తున్నారో అర్థం కాలేదు. ఎక్కడైన తనిఖీల్లో పాత ఇనుప సామాను తోలుకెళ్తున్నాం అని రవాణా చేసే వాహన దారులు చెప్పి తప్పించుకునేవారు. ఈ మధ్యకాలంలో హనుమంతునిపాడు మండలంలోని వెలుగొండ తూర్పు కెనాల్ కాలువ ప్రవహించే కొండ దిగువ ప్రాంతాల్లో కొత్తవ్యక్తులు తిరుగుతుండటాన్ని ఆయా గ్రామాల ప్రజలు గుర్తించారు. దీంతో గత రెండు రోజుల నుంచి పోలీసులు నిఘా పెట్టారు.

సోమవారం నందనవనం గ్రామ పంచాయతీ పరిధిలోని అగ్రహారం గ్రామం నుంచి మినీ లారీలో కెనాల్ కాలువ షట్టర్లను రవాణా చేస్తుండగా పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రవాణా చేస్తున్న వాహనడ్రైవర్‌తో పాటు మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరిని ఎస్పీ ఎదుట హాజరు పరుచగా లోతుగా విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ విచారణలో అసలు సూత్రదారులెవరో పోలీసులు తేల్చాల్సి ఉంది.



హనుమంతునిపాడు స్టేషన్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం

తాళ్లూరులో డ్రోన్ కెమెరా పరిశీలన



తాళ్లూరులో డ్రోన్ కెమెరాను పరిశీలిస్తున్న పోలీసులు

తాళ్లూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న అసాంఘిక, చట్ట వ్యతిరేఖ కార్యాకలాపాలను పసిగట్టి నిరోధించేందుకు పోలీసులు నూతనంగా ప్రవేశపెట్టిన డ్రోన్ కెమెరాను మంగళవారం తాళ్లూరులో ప్రయోగాత్మకంగా పరిశీలించారు. ఏఎస్సై మోహన్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు తాళ్లూరులో బస్టాండ్ సెంటర్‌లో డ్రోన్ కెమెరాతో గ్రామ వీధులన్నింటిని పరిశీలించారు.

ఈ డ్రోన్ కెమెరాను పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేయటంవల్ల ఏప్రాంతంలో జరుగుతున్న ఘటనలను పసిగట్టి తగుచర్యలు చేపట్టేందుకు ఈడ్రోన్ కెమెరా సహాయకారిగా ఉపయోగపడుతుందని ఏఎస్సై తెలిపారు. కార్యక్రమంలో ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నారాయణ స్వామి కల్యాణం

ముండ్లమూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుకంభంపాడులో వేంచేసి ఉన్న శ్రీ నారాయణ స్వామి 30వ కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది ఏప్రిల్‌లో స్వామి వారికి గ్రామస్థులు కల్యాణం నిర్వహిస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నారాయణ స్వామి నామస్మరణతో ఆలయం పోటెత్తింది. కంభంపాడు, నూజెండ్లపల్లి, శంకరాపురం, భట్లపల్లి, సుంకరవారిపాలెంతో పాటు విజయవాడ, గుంటూరు, ఒంగోలు, వినుకొండ, దర్శి అద్దంకి, ముండ్లమూరు, తాళ్ళూరు మండలాలకు చెందిన భక్తులు స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు అంకమ్మ, పోలేరమ్మ విగ్రహాల ప్రతిష్ఠ

ముండ్లమూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కెల్లంపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామ దేవత అంకమ్మ తల్లి, మారెళ్ళలో పోలేరమ్మ, గంగమ్మ తల్లి ఆలయాల ప్రతిష్ఠ బుధవారం జరగనుంది. గత మూడు రోజుల నుంచి రెండు గ్రామాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాలకు చెందిన బంధువులు ఇప్పటికే రెండు గ్రామాలకు చేరుకోవటంతో పండుగ వాతావరణం నెలకొంది.

దొనకొండలో.. దొనకొండ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీపట్టాభి రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు బుధవారం నుంచి ఈనెల 25వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

భూతాపంతో ప్రమాదం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

కనిగిరి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భూతాపం భవిష్యత్తు తరాలకు ప్రమాదం తెచ్చి పెడుతుందని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. స్థానిక వైష్ణవి కళాశాలలో మంగళవారం జరిగిన ప్రపంచ ధరిత్రి దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవుడు తన జీవన శైలిలో కొన్ని మార్పులు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. జల వనరులను కలుషితం చేయటం, ఎక్కడికక్కడ చెత్త పారవేయటం వంటివి కూడా భూమి స్వభావాన్ని ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. మనం తీసుకునే ఆహారం, తాగునీరు వంటి ప్రధాన అవసరాలన్నీ భూమి సమకూరుస్తుందన్నారు. వాతావరణ మార్పు, కాలుష్య నివారణ, అడవులు పెంపకం, జీవవైవిద్యంపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి భూమిని, పర్యావరణాన్ని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, గుడ్‌హెల్ప్ రమేష్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ రికార్డులు సృష్టించినవారిపై చర్యలేవీ!

తాళ్లూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగువారిపాలెం పంచాయతీ బొద్దికూరపాడు సర్వే నంబర్ 489లోని 683.23లో వైసీపీకి చెందిన ఆరుగురు వ్యక్తులు 60 ఎకరాలకు నకిలీ రికార్డులు సృష్టించారు. దీనిపై తహసీల్దార్ జిల్లా అధికారులకు నివేధించి ఐదు నెలలు కావస్తున్నా ఎటువంటి చర్యలు లేవు. తప్పుడు రికార్డులు సృష్టించిన సిబ్బందిపై, తప్పుడు పత్రాలు పొందిన వైసీపీ నేతలపై చర్యలు లేకపోవటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ హయాంలో కొండకు టెండర్ వేసి, నకిలిరికార్డులు సృష్టించిన విషయాన్ని గత డిసెంబరు 19న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా యంత్రాంగం వివరణ కోరగా తహసీల్దార్ కె.సంజీవరావు వీఆర్వో నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులకు నివేదించారు. సదరు రికార్డులు తప్పని నిర్ధారించి తగు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. కార్యాలయంలోని ఉద్యోగి రికార్డులను తప్పుగా దిద్దినా చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధి పనులను వేగవంతం చేయాలి

ముండ్లమూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 21 పంచాయతీల్లో ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఏపీవో పి.వెంకటరావు అన్నారు. మంగళవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో జరిగిన ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పనులు చేయాలన్నారు. ప్రతిరోజు మండలంలో ఐదు వేల మంది పనికి వచ్చేవిధంగా చూడాలన్నారు. జాబ్ కార్డు ఉన్నవారే పనికి వెళ్ళే విధంగా చూడాలన్నారు. అక్రమాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ప్రతి కూలీకి రూ.300 వేతనం వచ్చే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈసీ శివరామకృష్ణ ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

పామూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని హెచ్ఎం షేక్ మహబూబ్‌బాషా అన్నారు. మండలంలోని నర్రమారెళ్ల ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం గుడ్డ సంచులు వాడాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి బడిఈడు పిల్లలను గుర్తించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు టి.రమేష్, ఎన్.నీరజ, కె.సుజాత, బి.కోటేశ్వరరావు, ఇ.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

కురిచేడు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కురిచేడు పంచాయతీ పరిధిలో ఈ నెల 16న జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ అసన్ తెలిపిన వివరాల ప్రకారం.. పొదిలి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న మానికాల ఏడుకొండలుకు దర్శికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం ఉంది. గత కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. ఈక్రమంలో ఆమెపై అనుమానం పెంచుకున్న ఏడుకొండలు ఈనెల 16న ఆమెను నమ్మకంగా దర్శి నుంచి కురిచేడుకు తీసుకొచ్చారు. పొలాల్లోకి తీసుకెళ్లి పెద్ద బండరాయితో ఆమె తలపై మోది హత్య చేశాడు. అతను కూడా తన వెంట తెచ్చుకున్న పురుగు మందు కొద్దీగా తాగాడు. వాంతులు, విరోచనాలు కావడంతో కురిచేడుకు వచ్చి 108 అంబులెన్స్‌లో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని చికిత్స చేయించుకున్నాడు. పోలీసులు హత్యా స్థలాన్ని పరిశీలించి మహిళ మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న ఏడుకొండలును మంళవారం మధ్యాహ్నం దర్శి మండలం వెంకటాచలంపల్లి అడ్డరోడ్డు వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండు విధించినట్లు ఎస్ఐ శివ తెలిపారు. హత్య కేసును వెంటనే ఛేదించిన కురిచేడు ఎస్ఐ శివ, కానిస్టేబుళ్ళను త్రిపురాంతకం సీఐ అసన్ అభినందించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

కురిచేడు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందుకునే లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో సతీష్ బాబు అధ్యక్షతన ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న వారితో సమావేశం ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన అర్జున్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

టీడీపీ పటిష్టతకు కృషిచేయాలి

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతం కోసం కష్టించి పనిచేసే వారికే పార్టీ పదవులు లభిస్తాయని ఆపార్టీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య అన్నారు. సీఎస్‌పురం గ్రామ కమిటీ ఎన్నిక కోసం మంగళవారం నాయకులతో సమావేశం నిర్వహించారు. వెంగయ్య మాట్లాడుతూ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీని అంటిపెట్టుకొన్న వారికే అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. అనంతరం పలువురు ఆశావాదుల నుంచి పేర్లు తీసుకున్నారు. సమావేశంలో ఎస్‌సీ మాలకొండయ్య, సర్పంచ్ శ్రీరాం పద్మావతి, ఉపసర్పంచ్ పాములపాటి నరసయ్య, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, బొబ్బూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

కురిచేడు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని హెచ్ఎం రహంతుల్లా అన్నారు. మంగళవారం కురిచేడులోని ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల వారికోత్సవం ఆయన అధ్యక్షతన జరిగింది. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమతం నాగిరెడ్డి, ఎలిసెట్టి శ్రీనివాసరావు, మేరువ పెద్దిరెడ్డి, రమణారావు, దాదా సాహెబ్, సుభాని, తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీల దొంగలు అరెస్టు

ముండ్లమూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్లల్లో ఇటీవల సెల్ టవర్‌లో బ్యాటరీల దొంగతనానికి పాల్పడిన నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కె.కమలాకర్ తెలిపారు. సోమవారం ముండ్లమూరు-అద్దంకి రోడ్డులోని వేంపాడు జంక్షన్ వద్ద వారిని అదుపులోకి తీసుకొని విచారించగా బ్యాటరీల దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. నిందితులు ఖాశీం, షేక్ జాన్‌వలి, షేక్ జయాలుద్దీన్, కాటూరి జాలయ్యను అరెస్టుచేసి రూ.4.40 లక్షలు విలువ కల్గిన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపర్చినట్టు చెప్పారు. నిందితులను చాకచక్యంగా పట్టుకోవటంలో కీలకపాత్ర వహించిన ఎస్ఐ కమలాకర్, ఏఎస్ఐ వెంకటేశ్వరెడ్డి, రైటర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది మహేష్, ప్రేమానిధులను ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు. దర్శి డీఎస్పీ బి. లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో, సీఐ వై.రామారావు ఆధ్వర్యంలో బ్యాటరీ దొంగలను పట్టుకున్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు

ముండ్లమూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ కె.కమలాకర్ అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని మారెళ్ళ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వేసవిలో రాత్రిపూట ఆరుబయట ప్రజలు నిద్రిస్తుంటారన్నారు. వీరు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్తవ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బకు ఇద్దరు మృతి

ముండ్లమూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం వడదెబ్బకు ఇద్దరు మృతిచెందారు. తమ్మలూరు గ్రామానికి చెందిన నిత్తింటి సౌభాగ్యమ్మ(80), చొప్పరపు అంజయ్య(75) వడదెబ్బకు గురై మృతి చెందారు.

సెమిస్టర్ ఫలితాల్లో ఎంఎస్ఎం విద్యార్థుల హవా

కనిగిరి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఏకేయూ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో ఎంఎస్ఎం విద్యార్థులు ప్రతిభను చాటారు. మంగళవారం విడుదలైన పరీక్ష ఫలితాల్లో బీఎస్సీ జువాలజీలో దోగుపర్తి నాగూర్‌బీ 348 మార్కులు, బీఎస్సీ కంప్యూటర్స్‌లో మాదాల తరుణి 343 మార్కులు, బీఎస్‌సీ బోటనీలో తమ్మిశెట్టి సుస్మిత 317 మార్కులు సాధించారు. బీకాం కంప్యూటర్స్‌లో రవిజ్యోతి 309 మార్కులు, బీఏ పాలిటిక్స్‌లో చిలకా ప్రణవి 323 మార్కులు, గొల్ల వెంకటస్వరూప 323 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు, డైరెక్టర్ ఏలూరి నరేంద్ర, ప్రిన్సిపాల్ వీఆర్వీ రెడ్డి అభినందించారు.

ఉష్ణోగ్రత (అంచనా)

23-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	41	26
తెనాలి	39	27
నరసరావుపేట	41	23
బాపట్ల	37	27
రెంటచింతల	42	23

మున్సిపాల్టీల్లో నిర్మాణాలను ప్రోత్సహించాలని.. ప్లాన్లకు అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా.. నిర్మాణ దారులకు ప్లాన్ అప్రూవల్ కష్టాలను తప్పించాలని.. ప్రభుత్వం నిబంధనలను సరళతరం చేసింది. అయితే ఈ నిర్ణయం నిర్మాణదారులకు మేలు చేసేదిగా ఉన్నా తమకు కష్టాలు తెచ్చి పెడుతుందని లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్లు(ఎల్‌టీపీ) వాపోతున్నారు. ప్లాన్లలో అతిక్రమణ జరిగితే ఎల్‌టీపీలను బాధ్యులు చేస్తూ సరికొత్తగా నిబంధనలు విధించడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త విధానం వల్ల పట్టణంలో ప్రతి బిల్డింగ్ నిర్మాణానికి నిబంధనలు పాటించాలి. తప్పు జరిగిందా యాజమాని, ప్లానర్‌పై ఇద్దరిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. ఈ పరిస్థితుల్లో ప్లాన్ అప్‌లోడు చేసి కష్టాలు తెచ్చుకోవడం ఎందుకనే భావనలో ఎల్‌టీపీలు ఉన్నారు. దీంతో గత నెలన్నరుగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపాల్టీలో ఎల్‌టీపీల నుంచి ప్లాన్లు అప్‌లోడు కావడంలేదు. దీంతో నిర్మాణదారులు శంకుస్థాపనలు చేసుకుని ప్లాన్ల ఆమోదం కోసం ఎదురు చూస్తున్నారు. మున్సి పాల్టీల్లో ఇళ్లు, బహుళ అంతస్తుల భవనాల ప్లాన్ల విషయంలో ప్రభుత్వం ఒకవిధంగా ఆలోచిస్తే అది మొదటికే నష్టం చేకూర్చిందన్న భావన అటు నిర్మాణ దారుల్లో.. ఇటు లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్లలోనూ వ్యక్తమవుతోంది.

ప్లానిస్తే.. ప్లాట్లే





- లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్లలో ఆందోళన
- మున్సిపాల్టీల్లో కొత్త నిబంధనలపై వ్యతిరేకత
- అతిక్రమణలపై కేసులతో ఎల్‌టీపీలు వెనుకంజ
- పట్టణాల్లో నెలన్నరగా దాఖలు కానీ ఇంటి ప్లాన్లు
- ప్లాన్లు ఆమోదం కాక స్తంభించిన కొత్త నిర్మాణాలు

ఎల్‌టీపీలదే బాధ్యత..

ఎల్‌టీపీ అంటే.. ప్లాన్ గీయడం. అప్రూవల్ చేయించడంతో పని పూర్తి కాదు. నిర్మాణానికి సంబంధించి ఫౌండేషన్ నుంచి వివిధ స్థాయిల్లో ఫొటోలు తీసి సర్వర్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్లాన్‌తో పాటు దాఖలు చేసిన అన్ని ధ్రువపత్రాలు సక్రమమని ఎటువంటి తేడాలు లేవని నిర్ధారిస్తూ సంతకం చేసి అప్‌లోడ్ చేయాలి. ఇంత రిస్క్ చేసి ప్లాన్లు రూపొందించి ఇబ్బందులు ఎందు ర్కోలేమన్న వాదనను ఎల్‌టీపీలు వినిపిస్తున్నారు. అన్నీ పరిశీలించి ప్లాన్ తయారు చేయడం కష్టతర మంటున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

- గత 45 రోజులుగా నరసరావుపేట మున్సిపాల్టీలో ఇంటి ప్లాన్ కోసం ఒక్క దరఖాస్తు మా త్రమే దాఖలైంది.
- గత నెలన్నరుగా మున్సిపల్ పట్టణాల్లో లైసెన్స్‌డ్ సర్వేయర్ల నుంచి ఇళ్ల ప్లాన్ల దరఖాస్తులు అప్‌లోడు కావడంలేదు.

.. మున్సిపల్ పట్టణాల్లో ఇళ్ల నిర్మాణాలకు ఎవరూ ముందుకు రావడంలేదా. ప్లాన్లకు ఆమోదం లభించిక పెండింగ్‌లో ఉంటున్నాయా. నిర్మాణ సామాగ్రి ధరలు పెరిగి ఎవరూ ఇళ్లు కట్టుకునేందుకు ముందుకు రావడంలేదా... అంటే కాదు. అసలు ప్లాన్లు గీసేందుకు లైసెన్స్‌డ్ సర్వేయర్లు ధైర్యం చేయడంలేదు. ఒక వేళ గీసినా ఆ ప్లాన్లను వారు అప్‌లోడు చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాల్టీల్లో ఇంటి ప్లాన్ల ఆమో దానికి సంబంధించి తీసుకొచ్చిన సరికొత్త నిబంధనలే దీనికంతటికీ కారణమని తెలుస్తోంది. పట్టణాల్లో ఇళ్ల నిర్మాణ ప్లాన్ల అనుమతులకు ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్ ద్వారా ప్లాన్లను మంజూరు చేస్తోంది. ఇది భవన నిర్మాణదారులకు ఎంతో మేలు చేస్తుందని ప్రభుత్వం భావించింది. అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పని ఉండదని ప్రకటించింది. ప్రభుత్వ ఆశయం ఉన్నతంగా ఉన్నా.. కొత్త నిబంధనల మేర ప్లాన్ దాఖలు చేసేందుకు ఎల్‌టీ పీలు ససేమిరా అంటున్నారు. దీంతో మున్సిపాల్టీల్లో కొత్త నిర్మాణాలు స్తంభించిపోయాయి. గతంలో టౌన్ ప్లానింగ్ (మిగతా 8వ పేజీలో)



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన, జేసీ

30 వేల ఎంటీల ధాన్యం సేకరణ

- అదనపు లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతుల నుంచి 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ధాన్యం కొనుగోళ్లపై మంగళవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖాధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌తో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్, లేట్‌ఖరీఫ్, రబీ సీజన్లతో కలిపి లక్షా 80వేల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడులు వచ్చాయన్నారు. ప్రస్తుతం జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందన్నారు. ఈ అదనపు లక్ష్యాలను అధిగమించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే బాపట్ల నియోజకవర్గంలో 47వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఇంకా రైతుల వద్ద 47 వేల మెట్రిక్ టన్నులు నిల్వ ఉందన్నారు. రైతు సేవా కేంద్రాలకు ముందుగా ధాన్యం తెచ్చిన రైతులు నుంచి 10వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని చెప్పారు. రాబోయే సీజన్‌లో బీపీటీ 5204 రకం పంటలు సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ నియోజకవర్గంలో 50 వేల మెట్రిక్ ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. రాబోయే సీజన్‌లో డిమాండ్ మేరకు వరి సాగు చేయాలని రైతులను కోరారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, మార్కెటింగ్‌శాఖాధికారి రమేష్ పాల్గొన్నారు.

రైల్వేకు బ్లాక్‌స్పాట్ల భయం

- గుంటూరు డివిజన్‌లో 290 చోట్ల ట్రాక్ అతిక్రమణ
- బ్యారికేడింగ్ లేకపోవడంతో ట్రాక్‌పైకి పశువులు, మనుషులు
- 110 కిలోమీటర్ల వేగంతోనే రైళ్ల రాకపోకలకు సేఫ్టీ కమిషనర్ అనుమతి



ట్రాక్ పక్కన పశువులను తోలుకెళుతున్న కాపరి

గుంటూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రైల్వే ట్రాక్‌పైకి పశువులు, మనుషులు ఇష్టం వచ్చినట్లు వచ్చేస్తున్నారు. డివిజన్ మొత్తం మీద 290 చోట్ల ట్రాక్ అతిక్రమణలు జరుగుతున్నట్లు రైల్వే మెకానికల్ విభాగం గుర్తించింది. రైల్వేట్రాక్‌ల అతిక్రమణల కారణంగా రైళ్ల భద్రతకు ముప్పు వాటిల్లుతున్నది. పశువులను 110 కిలోమీటర్ల వేగంతో వెళుతున్న రైలు ఢీకొంటే లోకో(ఇంజిన్) దెబ్బతింటున్నది. అంతేకాకుండా పైలట్లు అత్యవసర బ్రేకులు వేస్తుండటంతో రైలు పట్టాలు తప్పే పరిస్థితులు ఉత్పన్నమౌతున్నాయి. ఈ నేపథ్యంలో రైల్వే రక్షక దళం, జీఆర్‌పీ అధికారులకు హాట్‌స్పాట్ల సమాచారం ఇచ్చి అక్కడి ప్రజలతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి పశువులను రైల్వేట్రాక్‌లకు సమీపంలోకి తీసుకు రానీయకుండా కొంతమేరకు నియంత్రిస్తున్నారు. కొన్ని చోట్ల మాత్రం గుంతలు తవ్విస్తున్నారు. అయితే రైల్వేట్రాక్‌ల అతిక్రమణను నిరోధించడానికి ఇది శాశ్వత పరిష్కారం కాదు. క్రాష్ బ్యారియర్స్‌ని నిర్మిస్తేనే పశువులు అతిక్రమించకుండా నిరోధించే అవకాశం ఉంటుంది. గుంటూరు డివిజన్‌లో ఉన్న సెక్షన్లన్నింటిలో 110 కిలోమీటర్ల వేగంతోనే రైళ్లు నడపడానికి కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ అనుమతి ఉన్నది. దీంతో క్రాష్ బ్యారియర్స్ ఏర్పాటు చేయలేని పరిస్థితి. ఈ కారణంగా వీటిలో కొన్ని చోట్ల అతిక్రమణలను నివారించేందుకు ట్రెంచ్ కొట్టించడం (పొడవాటి గుంత తవ్వించడం) చేయిస్తున్నది. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఏ ఒక్క సెక్షన్‌లోనూ 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడిచేందుకు అనుమతి లేకపోవడంతో పలు సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. ఈ నిబంధన ఉంటేనే రైల్వే శాఖ ఆయా సెక్షన్లలో రైల్వేట్రాక్ అతిక్రమణ జరగకుండా బ్యారికేడింగ్ పనులకు అనుమతిస్తుంది.

డబ్లింగ్ తర్వాతే 130 కిమీ వేగం..

రేపల్లె - తెనాలి, కృష్ణాకెనాల్ - గుంటూరు, నంద్యాల - గుంటూరు, పగిడిపల్లి - గుంటూరు, న్యూపిడుగురాళ్ల - శావల్యాపురం సెక్షన్లు గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఉన్నాయి. వీటిల్లో డబుల్ లేన్(రెండు వరసల రైలు మార్గం) ఉన్న సెక్షన్లు కృష్ణాకెనాల్ - గుంటూరు, తెనాలి - గుంటూరు, గుంటూరు - దిగువమెట్ట మాత్రమే. మిగతా సెక్షన్లన్నీ సింగిల్ లేన్‌వే. గుంటూరు - పగిడిపల్లి డబ్లింగ్ పనులు ఇటీవలే మొదలయ్యాయి. అన్ని సెక్షన్లు డబ్లింగ్ పూర్తి అయితే తప్ప 130 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడిపేందుకు సీఆర్ఎస్ అనుమతి ఇవ్వదు. అప్పటివరకు ప్రస్తుతం అనుమతి ఉన్న వేగంతోనే రైళ్లు నడుపుకోవాల్సిన పరిస్థితి. ఈ కారణంగా రైలుమార్గాలకు బ్యారికేడింగ్ చేసే అవకాశం లేకపోవడంతో పశువులు, మనుషుల అతిక్రమణలు పెద్ద సంఖ్యలో జరుగుతున్నాయి.

ఏఐ-పవర్డ్ థర్మల్, స్టాండర్డ్ కెమెరాలు అవసరం

గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో నంద్యాల - గుంటూరు సెక్షన్‌లో నల్లమల అటవీ ప్రాంతం ఉన్నది. అక్కడ తరచుగా రైళ్లు ఢీకొని వన్య ప్రాణులు మృతి చెందుతున్నాయి. తమిళనాడు రాష్ట్రంలోని పాలక్కాడ్ - కోయంబత్తూరు రూట్‌లో ఏనుగులు తరచుగా ట్రాక్‌లు దాటుతూ ప్రమాదానికి గురౌతున్నాయి. దీనిని నివారించేందుకు అక్కడి రైల్వే అధికారులు పలుచోట్ల కృత్రిమ మేథ - పవర్డ్ థర్మల్, స్టాండర్డ్ కెమె రాలను అమర్చారు. దీని వలన జంతువులు రైల్వే ట్రాక్‌ను దాటేందుకు వచ్చినప్పుడు ముందు గానే కంట్రోలర్లకు తెలిసిపోతుంది. దాంతో రైళ్ల వేగాన్ని తగ్గించి జంతువులు ఎలాంటి ఇ బ్బంది లేకుండా దాటేలా చేస్తున్నారు. అలాంటి విధానా న్నే ఇక్కడ అమలు చేయాలన్న డిమాండ్ ఉన్నది.

భార్య మృతిని తట్టుకోలేక భర్త కూడా..

- గంటల వ్యవధిలో దంపతుల హఠాన్మరణం
- భార్య అంత్యక్రియల ఏర్పాటు సమయంలో భర్త మృతి


పర్చూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గంటల వ్యవధిలో దంపతుల హఠాన్మరణం తో పర్చూరులో విషాదం చోటుచేసుకుంది. కుంటుంబసభ్యులను, బంధువులను దుఃఖ సాగరంలో ముంచిన ఈ ఘటన వివరాలు.. పర్చూరుకు చెందిన ఆకుల వెంకట్రామయ్య(80), నాగేంద్రమ్మ (75) దంపతులు. పర్చూరులోని కుమారుడి వద్ద నాగేంద్రమ్మ ఉంటున్నది. అయితే ఆమె ఆకస్మికంగా సోమవారం రాత్రి మృతి చెందింది. కాగా వెంకట్రామయ్య అనారోగ్యం కారణంగా చినగంజాం మండలం సంతరావూరులో కుమార్తె వద్ద ఉంటున్నారు. నాగేంద్ర మ్మ మృతి సమాచారం తెలిసిన వెంకట్రా మయ్య మంగళవారం ఉదయం వస్తుండగా మృతి చెందారు. భార్య మరణాన్ని జీర్ణించుకోలేక భర్త మృతి చెందడం కుటుంబ సభ్యులను వేదనకు గురిచేసింది. నాగేంద్రమ్మ అంత్యక్రియల అనంతరం ఆమె చితి ఆరక ముందే ఆ పక్కనే భర్త దహన సంస్కా రాన్ని పూర్తి చేశారు.



వెంకట్రామయ్య, నాగేంద్రమ్మ (ఫైల్)

ఆధ్యాత్మిక కేంద్రంగా.. శింగరకొండ

- రిజర్వాయర్‌గా మారనున్న భవనాసి చెరువు
- మరింత అభివృద్ధి చేస్తే పర్యాటకుల ఆదరణ
- మంత్రి గొట్టిపాటి చొరవ తీసుకోవాలని వినతులు



శింగరకొండ, భవనాసి చెరువు వ్యూ

అద్దంకి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్యమైన దేవాలయాలలో శింగరకొండ ఒకటిగా గుర్తింపు ఉంది. సమీప ప్రాంతాల ప్రజలతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సంఖ్య కూడా పెరిగింది. సుమారు రూ.7 కోట్లతో శింగరకొండలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణం చివరి దశకు చేరింది. దాతల సహకారంతో నాలుగు వైపులా రాజగోపురాల పునః నిర్మాణానికి కూడా ప్రణాళికలు జరుగుతున్నాయి. లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో కూడా పలు అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో రెండు దేవాలయాల రూపురేఖలు మారిపోతున్నాయి. అదే సమయంలో మంత్రి రవికుమార్ చొరవతో భవనాసి చెరువును రిజర్వాయర్‌గా మార్చే పనులు జరుగుతున్నాయి. రిజర్వాయర్‌గా మారిన తర్వాత పూర్తి స్థాయిలో నీరు నిల్వ ఉండే అవకాశం ఉంది. ఆక్రమణలు తొలగిస్తే చెరువు సుమారు వెయ్యి ఎకరాల విస్తీర్ణం ఉంటుంది. పెద్ద రిజర్వాయర్ పక్కనే పేరుగాంచిన దేవాలయాలు ఉన్నాయి. దీంతో శింగరకొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శింగరకొండ, భవనాసి రిజర్వాయర్లను అభివృద్ధి చేస్తే పర్యాటక ప్రాధాన్యం సంతరించుకుంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. భవనాసి రిజర్వాయర్‌లో బోట్ షికారు, స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటుతో పాటు పెద్ద పార్కును ఏర్పాటు చేయాలంటున్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించి శింగరకొండ, భవనాసి చెరువులను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సిద్ధమవుతున్న ప్రధాన వేదిక



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్

ప్రధాని మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

తుళ్లూరు, (వెలగపూడి) ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో వివిధ అభివృద్ధి పనులకు భారత ప్రధాని నరేంద్రమోదీ మే 2న శంకుస్థాపన చేయనున్నారు. అందుకు వెలగపూడి రాష్ట్ర సచివాలయం దగ్గరిలో పడమరవైపు 200 ఎకరాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఏర్పాట్లను పరిశీలించారు. హెలీప్యాడ్ నిర్మాణం, రోడ్డు మార్గాలు, ప్రధాన వేదిక, పబ్లిక్, వీవీఐపీ, వీఐపీ గ్యాలరీలు వద్ద ఏర్పాట్లను కలెక్టర్ సందర్శించారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేశారు. ప్రధాని సభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు నిర్దేశిత సమయంలో పూర్తి అయ్యేలా పనులను వేగవంతంగా చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భార్గవ్ తేజ, సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ ఎం.నవీన్ కుమార్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, అడిషనల్ ఎస్పీ సుప్రజా, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, అర్అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాస మూర్తి, సీఆర్డీఏ, రెవెన్యూ మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

డొంక కదులుతోంది

- మార్టూరు పేలుడు పదార్థాల కేసులో దర్యాప్తు ముమ్మరం
- ఇప్పటికే ఇద్దరి అరెస్టు.. తెలంగాణ పోలీసుల అదుపులో మరో ముగ్గురు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మార్టూరు పేలుడు పదార్థాల కేసులో డొంక కదులుతోంది. వైసీపీ నేత సహా మరో ఐదుగురిని నిందితులుగా చేర్చిన పోలీసులు మూడు రోజుల క్రితమే నాగరాజుపల్లి వైసీపీ నేత దాసం హనుమంతురావుతో పాటు దాసం వీరాంజనేయులను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఎటువంటి పత్రాలు లేకుండా పేలుడు పదార్థాలను నిల్వ ఉంచడమే కాకుండా వాటి విక్రయాల విషయంలో అవకతవకలు జరిగినట్లు పోలీసు విచారణలో వెల్లడైన సంగతి తెలిసిందే. మార్టూరు మండలం నాగరాజుపల్లికి చెందిన నాగండ్ల ప్రసన్న, వినుకొండకు చెందిన వైసీపీ నేత ప్రతాప్‌రెడ్డి, శావల్యాపురానికి చెందిన బత్తుల సాంబశివరావులను ఈ కేసులో పోలీసులు నిందితులుగా చేర్చారు. ఈ క్రమంలో వీరిని తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా పోచారం మండలం దేశముఖి గ్రామంలో మార్టూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

20 అడుగుల గోతిలో..

మార్టూరులో పోలీసుల తనిఖీలో ఈ నెల 18న తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లాలో 180 కార్టూన్ల ఎక్స్‌ప్లోజివ్స్ అమ్మినట్లు గుర్తించారు. దీంతో రెండు బృందాలను ఎస్పీ తుషార్‌డూడీ మూడు రోజుల క్రితమే యాదాద్రి జిల్లాకు పంపించారు. అక్కడ విచారణ చేపట్టిన పోలీసులు నిందితుల లొకేషన్‌ను యాదాద్రి జిల్లా పోచారం మండలం దేశముఖి గ్రామంలో కనుగొన్నారు. వారి వద్ద ఉన్న పేలుడు పదార్థాలను దాదాపు 20 అడుగుల గొయ్యి తీసి దాచినట్లు గుర్తించిన పోలీసులు ఎక్స్‌కవేటర్ సాయంతో 8 గంటలు శ్రమించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనం తరం నిందితులను అదుపులోకి తీసుకుని చౌటుప్పల్ కోర్టులో హాజరుపరిచారు. బుధ వారం వీరిని అద్దంకి కోర్టుకు తీసుకు రానున్నారు

గ్రానైట్ వ్యాపారం ముసుగులో..

గ్రానైట్ వ్యాపారం ముసుగులో అనుమతి లేకుండా పేలుడు పదార్థాలు విక్రయించడంతో పాటు వాటిని ఏ అవసరాల కోసం కొనుగోలు చేశారన్నదే ఇప్పుడు పోలీసుల దర్యాప్తులో కీలకం కానుంది. పేలుడు పదార్థాల నగదు లావాదేవీల విషయంలో కీలకంగా ఉండే మరో వైసీపీ నేత పాత్రను పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి వాణిశ్రీ

దేశవాళీ విత్తనాలతో సాగుకు అనుకూలం

చీరాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : దేశవాళీ విత్తనాలకు ప్రాధాన్యత కల్పించడం వలన సాగు సులువుగా ఉంటుందని జిల్లా ప్రకృతి వ్యవసాయం అధికారి వాణిశ్రీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వెలుగు కార్యాలయంలో ఏవో సుమతి, ఏపీఎం మధుసూదనరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రైతును ప్రకృతి వ్యవసాయం వైపు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వీపీఏలు, రైతులు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు..

వేటపాలెంలో..

మట్టి నమూనా సేకరించే పరిసరాల్లో ముందుగా చెత్తను తొలగించాలని, ఆగర్‌ను సుమారు 15 సెం.మీ. లోతులో ఉంచాలని వ్యవసాయాధికారి కాశీ విశ్వనాథ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని అక్కయ్యపాలెంలో మట్టి నమూనాలను సేకరించారు. అందుకు సంబంధించి వ్యవసాయ సిబ్బందికి, రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు స్వాతి, శివనాగబాబు, రైతులు పాల్గొన్నారు.

గోవాడకు ఇంజనీరింగ్ విద్యార్థి మృతదేహం



వెంకటేష్ (ఫైల్)

అద్దంకి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఈత సరదాతో ప్రాణాలు కోల్పోయిన ఇంజనీరింగ్ విద్యార్థి మాదాల వెంకటేష్ (20) మృతదేహం మంగళవారం ఉదయం స్వగ్రామం అద్దంకి మండలం గోవాడకు చేరింది. తమిళనాడు రాష్ట్రంలోని తిరుచ్చి సమీపంలో ధనలక్ష్మి శ్రీనివాసన్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ 2వ సంవత్సరం చదువుతూ ఆదివారం సమీపంలోని బావిలో ఈతకు దిగిన మాదాల వెంకటేష్, స్నేహితుడు లక్ష్మీఅరవింద్ మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. కుటుంబసభ్యులు తమిళనాడుకు వెళ్లి వెంకటేష్ మృతదేహాన్ని మంగళవారం గోవాడకు తీసుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

బడి రూపురేఖలు మారే!

- మొత్తం ఎనిమిది రకాల పాఠశాలలు
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయి. ప్రస్తుతం ఉన్న ఆరు రకాల పాఠశాలలు స్థానంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎనిమిది రకాలు అమలులోకి రానున్నాయి. కేంద్రప్రభుత్వం తెచ్చిన నూతన విద్యావిధానం ఎన్‌ఈపీకి అనుగుణంగా గత ప్రభుత్వం ఎనిమిది రకాల పాఠశాలలను తెస్తూ జీఓ 117ను అమల్లోకి తెచ్చింది. అయితే ఆ జీవోను ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల హామీని నిలబెట్టుకుంటూ 117 జీఓను రద్దుచేసింది. ప్రత్యామ్నాయంగా ఐదు రకాలను ప్రతిపాదిస్తూ జనవరిలో ఉత్తర్వులు జారీచేసింది. అప్పటి నుంచి ఇప్పటివరకు వచ్చిన వివిధ మార్పుల్లో తాజాగా ఎనిమిది రకాల బడులు వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి రానున్నాయి. కూటమి ప్రభుత్వం తొలుత ప్రకటించిన ఐదు రకాల పాఠశాలలకు అదనంగా ప్రాథమికోన్నత పాఠశాలలు, 1 నుంచి 10వ తరగతి వరకు హైస్కూళ్లు, హైస్కూల్ ప్లస్ (ఇంటర్మీడియట్) పాఠశాలలు కూడా వచ్చే ఏడాది నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ ఎనిమిది రకాల పాఠశాలలకు 2025-26 విద్యా సంవత్సరానికి విద్యార్థులు అడ్మిషన్ల డ్రైవ్ కూడా ప్రారంభమైంది.

ప్రభుత్వం అమల్లోకి తెస్తున్న పాఠశాలల

రూపురేఖలు ఇలా ఉండనున్నాయి

1. శాటిలైట్ ఫౌండేషనల్ స్కూల్: ఈ పాఠశాలల్లో కేవలం పూర్వ ప్రాథమిక విద్యను మాత్రమే బోధిస్తారు. ఈ పాఠశాలలు మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. అంగన్వాడీ కేంద్రాలను ఇక నుంచి శాటిలైట్ ఫౌండేషనల్ స్కూళ్లుగా వ్యవహరిస్తారు.

2. ఫౌండేషనల్ స్కూళ్లు: ఈ పాఠశాలలల్లో పూర్వ ప్రాథమిక విద్యతోపాటు 1, 2 తరగతుల విద్యార్థులకు బోధిస్తారు.

3. బేసిక్ ప్రైమరీ స్కూలు: ఈ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యతోపాటు 1 నుంచి 5 తరగతులకు బోధిస్తారు.

4. మోడల్ ప్రైమరీ స్కూలు : కూటమి ప్రభుత్వ మానస పుత్రికలుగా మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఆవిర్భవిస్తున్నాయి. వాటికి ఒక ప్రైమరీ స్కూలు హెచ్‌ఎం, స్కూలు అసిస్టెంటు, ఐదు ఎస్‌జీటీ పోస్టులు తరగతికి ఒకటి చొప్పున కేటాయిస్తున్నారు. ఈ పాఠశాలల్లో పూర్వ ప్రాథమికోన్నత విద్యతోపాటు 1 నుంచి 5 తరగతులు బోధిస్తారు.

5. హైస్కూళ్లు(6-10): హైస్కూళ్లలో 6 నుంచి 10 తరగతులకు మాత్రమే బోధిస్తారు. గతంలో విలీనం చేసిన 3, 4, 5 తరగతుల విద్యార్థులను మళ్లీ వెనక్కు ప్రాథమిక పాఠశాలలకు పంపుతారు. యుపీ స్కూళ్లను విద్యార్థులు ఎక్కువమంది ఉన్న వాటిని హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేస్తారు. తక్కువ విద్యార్థులు ఉన్న వాటిని ప్రాథమిక పాఠశాలలుగా డౌన్‌గ్రేడ్ చేసి అక్కడి 6, 7, 8 తరగతుల విద్యార్థులను సమీపంలోని హైస్కూళ్లకు పంపుతారు.

6. ప్రాథమికోన్నత పాఠశాలలు: ఈ పాఠశాలల్లో 1 నుంచి 8 తరగతులు వరకు బోధిస్తారు. అయితే 1 నుంచి 5 తరగతులు, 6, 7, 8 తరగతులకు విద్యార్థుల సంఖ్య ప్రామాణికంగా సెకండరీ గ్రేడు టీచర్లను కేటాయిస్తున్నారు.

7. హైస్కూళ్లు (1 నుంచి 10): హైస్కూళ్ల విషయంలో ప్రభుత్వం మనసు మార్చుకుంది. మొదట 3, 4, 5 తరగతులనే వెనక్కు పంపాలనుకున్న ప్రభుత్వం తాజాగా 1 నుంచి 10 తరగతులు కొనసాగించేందుకు నిర్ణయించింది. ఒకే ఆవరణలో అన్ని తరగతులు ఉంటే అక్కడి ఎలిమెంటరీ విద్యార్థులను కూడా హైస్కూళ్లలో చేర్చుకుంటారు. 1 నుంచి 5 తరగతుల విద్యార్థులు 60 మందికి మించితే ప్రత్యేకంగా ఒక ప్రైమరీ హెచ్‌ఎంను కేటాయించి పాఠశాల నిర్వహణ బాధ్యతను కొత్త యూడైస్ కోడ్ ఇస్తారు. 60మందికిలోపు ఉంటే దాని బేసిక్ ప్రైమరీ స్కూలుగా ఉంచి 1 - 10 తరగతుల బాధ్యతను హెచ్‌ఎం చూస్తారు.

8. హైస్కూల్ ప్లస్ (ఇంటర్మీడియట్): హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ తరగతులను ప్రస్తుతానికి నిర్వహిస్తున్నారు. మొదట బాలిక జూనియర్ కళాశాలలు కొనసాగుతాయి. ఆ తర్వాత ప్రారంభమైన కోఎడ్యుకేషన్ కళాశాలలు విషయంలో ప్రభుత్వ నిర్ణయాన్ని తీసుకోవాల్సి ఉంది.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 3048 పాఠశాలలు

పాఠశాల పేరు	పాఠశాలల సంఖ్య
బేసిక్ ప్రైమరీ స్కూళ్లు (బీపీఎస్)	1,394
మోడల్ ప్రైమరీ స్కూళ్లు (ఎంపీఎస్)	670
ఫౌండేషన్ స్కూళ్లు	353
అప్పర్ ప్రైమరీ స్కూళ్లు	85
బీపీఎస్‌లుగా డైన్ గ్రేడైన యూపీలు	38
యూపీఎస్‌లుగా డౌన్‌గ్రేడైన యూపీలు	44
హైస్కూళ్లు(6 నుంచి 10 తరగతులు)	318
హైస్కూళ్లు బీపీఎస్(1 నుంచి 10తరగతులు)	47
హైస్కూళ్లు ప్లస్ ఎంపీఎస్ (1 నుంచి 10)	15
యూపీహెచ్ ఎస్‌లుగా అప్‌గ్రేడ్ ప్లస్ బీపీఎస్	6
యూపీలు హెచ్‌ఎస్‌లుగా అప్‌గ్రేడ్ ప్లస్ ఎంపీఎస్	76
శాటిలైట్ స్కూళ్లు	2
మొత్తం	3,048

పేలుడు పదార్థాల కేసులో.. ముగ్గురు అరెస్ట్

- ఐదు టన్నుల సరుకు స్వాధీనం
- తెలంగాణలోని చౌటుప్పల్ కోర్టులో తొలుత హాజరు
- నేడు అద్దంకి కోర్టుకు

మార్టూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : అక్రమ పేలుడు పదార్థాలను నిల్వ ఉంచడం, వాటి కొనుగోలు, అమ్మకాలు చేసిన కేసులో మంగళవారం ముగ్గురిని అరెస్టు చేశారు. ప్రత్యేక పోలీసు బృందాలు మంగళవారం తెలంగాణలో నాగండ్ల ప్రసన్న, బత్తుల సాంబశివరావు, ప్రతాప్ రెడ్డి అనే ముగ్గురిని అదుపులోకి తీసుకోగా అరెస్టు చేసిన వారి సంఖ్య మొత్తం ఐదుగురికి చేరింది. ఇప్పటికే ఈ కేసులో కీలక సూత్రధారి మండలంలోని నాగరాజుపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నేత దాసం హనుమంతురావుతోపాటు, అతని బంధువు దాసం వీరాంజనేయులను మార్టూరు పోలీసులు అరెస్టు చేసి అద్దంకి కోర్టులో హాజరుపరచి దర్శి జైలుకు తరలించారు. అదేవిధంగా ఈ కేసులో కీలకమైన వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలని, హనుమంతరావు దగ్గర కొనుగోలు చేసిన అక్రమ పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకోవాలనే కారణంతో ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు ఆదివారం ప్రత్యేక బృందాలు తెలంగాణ రాష్ట్రానికి వెళ్లారు. ఈ ప్రత్యేక బృందాలు పూర్తిస్థాయిలో విచారణ చేసి సోమవారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లాలో పోచారం మండలం దేశ్‌ముఖ్ గ్రామ పంచాయతీలో ముగ్గురు నిందితులు నాగరాజుపల్లి గ్రామానికి చెందిన నాగండ్ల ప్రసన్నను, మిగిలిన ఇద్దరు బత్తుల సాంబశివరావు, ప్రతాప్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. ప్రతాప్ రెడ్డి కొనుగోలు చేసి భూమిలో దాచి ఉంచిన ఐదు టన్నుల పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం చౌటుప్పల్ పరిధిలో కోర్టులో ముగ్గురు నిందితులను, సరుకును హాజరుపరచారు. అనంతరం ముగ్గురు నిందితులను ట్రాన్సిట్ వారెంట్‌పై మార్టూరు స్టేషన్‌లో నమోదు చేసిన కేసులో బుధవారం అద్దంకికి తీసుకువచ్చి కోర్టులో హాజరుపరచనున్నారు.

సూత్రధారి ప్రతాప్ రెడ్డి

తెలంగాణలో కొండలను పగులగొట్టి నేలను చదును చేసే కాంట్రాక్టర్‌గా ఉన్న ప్రతాప్ రెడ్డి నాగరాజుపల్లి గ్రామంలోని దాసం హనుమంతరావు దగ్గర పేలుడు పదార్థాలను కొనుగోలు చేయడానికి బత్తుల సాంబశివరావు సహకరించారు. అక్రమ పేలుడు పదార్థాలను తక్కువ ధరకు హనుమంతరావు నుంచి ప్రతాప్ రెడ్డి కొనుగోలు చేసే విధంగా బత్తుల సాంబ శివరావు కథ నడిపారు. ఈ మేరకు ఇప్పటికి రెండుసార్లు ఈ విధంగా ప్రతాప్‌రెడ్డి సరుకును కొనుగోలు చేశారు. అందులో భాగంగానే ఈ నెల 18 వతేదీన తెలంగాణ రాష్ట్రం నుంచి కొనుగోలు చేసి నాగరాజుపల్లి గ్రామానికి తీసుకువస్తున్న పేలుడు పదార్థాలలో కొంత భాగాన్ని ప్రతాప్‌రెడ్డి కొనుగోలు చేసే విధంగా సాంబశివరావు సహకరించారు. అదేవిధంగా లారీలో పేలుడు పదార్థాలను రవాణా చేయడం, సరుకును తీసుకువెళ్లడంలో సహకరించిన నాగండ్ల ప్రసన్నను పోలీసులు నిందితునిగా చేర్చారు. ఇదిలావుండగా శనివారం నాగరాజుపల్లిలోని హనుమంతురావు గోడౌన్‌పై పోలీసులు తనిఖీలు చేయడంతో, ఈవిషయం తెలుసుకున్న ప్రతాప్ రెడ్డి అప్రమత్తమై సరుకును భూమిలో దాచి ఉంచారు. అయితే తెలంగాణ వెళ్లిన ప్రత్యేక బృందాలు సరుకుతోపాటు, ముగ్గురు నిందితులను కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ విషయమై సీఐ ఎం.శేషగిరిరావుతో ఆంధ్రజ్యోతి మాట్లాడగా తెలంగాణలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. వారిని బుధవారం అద్దంకి కోర్టులో హాజరుపరచడానికి తెలంగాణ నుంచి మార్టూరు స్టేషన్‌కు తీసుకువస్తున్నాయన్నారు. ఈ కేసులో 6 గురు నిందితులల్లో ఇప్పటికి ఐదుగురిని అరెస్ట్ చేశామని తెలిపారు.

ఎత్తిపోతల పథకాల పరిశీలన



పెదగంజాంలో ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న సత్యనారాయణ

చినగంజాం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగంజాం, నీలాయపాలెం ప్రాంతాల్లోని ఎత్తిపోతల పథకాలను రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ రిటైర్డ్ డీఈ ఎంవై సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు నీలాయపాలెం ప్రాంతంలోని శ్రీ వెంకటేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ సొసైటీ, పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని బుచ్చిగుంట గ్రామ సమీపంలోని ఆదిఆంధ్ర టేనేంటివ్ కోఆపరేటివ్ సొసైటీ ఎత్తిపోతల పథకాలను పరిశీలించినట్లు సత్యనారాయణ తెలిపారు. ఎత్తిపోతల నిర్వహణ ఎలా ఉంది, విద్యుత్ మోటార్ల పరిస్థితి, ఆయకట్టు ఎంత, మరమ్మతులు, కాలువల పరిస్థితి తదితర విషయాలను ఆయన రైతులు, నిర్వహణ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన మోటార్ల మరమ్మతులు, కావలసిన పైపులు తదితర వాటికి సంబంధించిన అంచనాలు తయారు చేసి ఎమ్మెల్యే ఏలూరికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పథకాలను పునరుద్ధరించి ప్రభుత్వ నిధులతో చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఎత్తిపోతల పథకాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకుల ద్వారా రైతులకు వడ్డీలేని రుణాలను అందజేసి ఎత్తిపోతల పథకాల నిర్వహణను వారికే అప్పగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నీలాయపాలెం గ్రామ సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి, తూమాటి ఆదినారాయణ, మాచవరపు రాజేష్, ఎం.సుబ్బారావు, కే.పున్నయ్య, రైతులు పాల్గొన్నారు.

మండలానికి మూడు ఉన్నత, 12 ఆదర్శ పాఠశాలలు

పంగులూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రానున్న విద్యా సంవత్సరంలో మండలంలో నూతనంగా మూడు ఉన్నత పాఠశాలలు, 12 ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 117 జీవోను నిలిపివేసి దాని స్థానంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానంలో పాఠశాలల రూపు రేఖలు మారనున్నాయి. మండలంలోని రేణంగివరం, కొండమూరు, కోటపాడు గ్రామాలలోని ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయగా, పంగులూరులో రెండు, అలవలపాడులో రెండు, రామకూరు, కొండమంజులూరు, ముప్పవరం, రేణంగివరం, కొండమూరు, కోటపాడు, కల్లంవారిపాలెం, బూదవాడలో ఒక్కొక్కటి వంతున ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నారు. ఆదర్శ పాఠశాలల్లో ఒక్కో తరగతికి ఒక ఉపాధ్యాయుడుని నియమించనున్నారు. వీటితో పాటు ఆయా గ్రామాలలోని విద్యార్థుల సంఖ్యను అనుసరించి పది చోట్ల ఫౌండేషన్ పాఠశాలలు, 14 చోట్ల బేసిక్ పాఠశాలలు ఏర్పాటుకానున్నాయి. బేసిక్ పాఠశాలల్లో ఐదు తనగతులు కొనసాగనుండగా అందులో ఇద్దరు ఉపాధ్యాయుల నియామకం ఉంటుంది. ఫౌండేషన్ పాఠవాలల్లో ఒకటి, రెండు తరగతులు మాత్రమే నిర్వహంచనుండగా విద్యార్థుల సంఖ్యను అనుసరించి ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులను ఏర్పాటు చేయడం జరుగుతుందని విద్యాశాఖాధికారులు తెలిపారు. నూజెళ్లపల్లి, కొప్పెరపాడు గ్రామాలలోని ప్రాథమికోన్నత పాఠశాలలు యథావిధిగా కొనసాగుతాయని విద్యాధికారులు కె.నాగభూషణం, వీరాంజనేయులు తెలిపారు. మండలంలో 8 జిల్లా పరిషత్ ఉన్నత, రెండు ప్రాథమికోన్నత పాఠశాలలు, 12 ఆదర్శ పాఠశాలలు, 14 బేసిక్ స్కూల్స్, 10 ఫౌండేషన్ పాఠశాలలు కొనసాగనున్నాయి. వీటితో పాటు ముప్పవరంలో ఎయిడెడ్ ఉన్నత పాఠశాల, రామకూరులో ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలు కొనసాగనున్నాయని ఎంఈవో తెలిపారు.



శింగరకొండ వద్ద కొండ అంచు వరకు ఉన్న తారు రోడ్డు, ఏర్పాటు చేయని సైడ్ డ్రైన్

వానొస్తే శింగరకొండలో భయం..భయం..!

- కొండపై నుంచి రోడ్డుపైకి జారుతున్న మట్టి, చిన్న రాళ్లు
- రోడ్డు వెంబడి ఏర్పాటు చేయని డ్రైన్

అద్దంకి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వానొస్తే శింగరకొండకు వచ్చే భక్తులు భయపడే పరిస్థితి నెలకొంది. నామ్‌రోడ్డు నుంచి శింగరకొండ గుడి వరకు భవనాసి చెరువు అంచున ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డుకు కొండ అంచున సైడ్ డ్రైన్ నిర్మాణం చేయలేదు. దీంతో చిన్నపాటి వర్షం పడ్డా కొండపై నుంచి వర్షపు నీటితో పాటు మట్టి, చిన్నచిన్న రాళ్లు వచ్చి రోడ్డుపై చేరుతున్నాయి. వర్షంలో వచ్చే వాహనచోదకులు రాళ్ల గుర్తించక ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. అదే సమయంలో తరచూ రోడ్డు కూడా దెబ్బతింటుంది. కొండపై నుంచి వచ్చే మట్టి, చిన్న చిన్న రాళ్ల రోడ్డు పైకి చేరకుండా నామ్ రోడ్డుకు సమీపంలోని భవనాసి చెరువు తూముల వద్ద నుంచి కొండ పొడవునా శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ముందు వరకు, అక్కడ నుంచి అన్నదాన సత్రాల పొడవునా లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఆర్చి, 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం వరకు ఆర్ అండ్ బీ రోడ్డు వెంబడి సైడ్ డ్రైన్ నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

వైభవంగా నారాయణ స్వామి కల్యాణం

ముండ్లమూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పు కంభంపాడులో వేంచేసి ఉన్న శ్రీ నారాయణస్వామి 30వ కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది ఏప్రిల్‌లో స్వామి వారికి గ్రామస్థులు కల్యాణం నిర్వహిస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నారాయణ స్వామి నామస్మరణతో ఆలయం మార్మోగింది. కంభంపాడు, నూజెండ్లపల్లి, శంకరాపురం, భట్లపల్లి, సుంకరవారిపాలెంతో పాటు విజయవాడ, గుంటూరు, ఒంగోలు, వినుకొండ, దర్శి, అద్దంకి, ముండ్లమూరు, తాళ్ళూరు మండలాలకు చెందిన భక్తులు స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అజెండాలో ఆరే!

- పరిమిత అంశాలతో నేడు డీఆర్సీ సమావేశం
- ఉపాధి అక్రమార్కులపై నామమాత్రపు చర్యలు
- కదలని సూర్యఘర్ పథకం
- పశ్చిమాన దాహం కేకలు
- వినతుల పరిష్కారంపై ప్రజల పెదవి విరుపు
- గృహ నిర్మాణం అంతంతమాత్రమే
- క్షేత్రస్థాయి పరిస్థితులు చర్చిస్తేనే ఫలితం

ఈసారి రెండవసారి ఐదున్నర నెలల తర్వాత ఏర్పాటు చేసిన ఎంతో కీలకమైన డీఆర్సీ సమావేశం అజెండా పరిమితంగానే ఉంది. ప్రస్తుత పరిస్థితులలో ప్రధానమైనవిగా అలాగే ప్రభుత్వం ప్రాధాన్యంగా భావిస్తున్న ఆరు కీలక అంశాలపై చర్చించాలని ఇన్‌చార్జ్ మంత్రి నిర్ణయించారు. అందులో ఉపాధి హామీ పథకం, తాగునీటి సరఫరా, గృహ నిర్మాణం, విద్య, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రధానాంశంగా తీసుకొన్న ప్రజా విజ్ఞప్తుల పరిష్కారం (పీజీఆర్ఎస్) ఉన్నాయి.

ఒంగోలు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో అత్యంత కీలకం అయిన జిల్లా సమీక్షా మండలి (డీఆర్సీ) సమావేశం బుధవారం జరగనుంది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రకాశం భవన్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జరిగే ఈ సమావేశంలో జిల్లాలో కీలక ప్రజాప్రతినిధులు అయిన ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. ఆ మేరకు వారందరికీ ఇన్‌చార్జ్ మంత్రి ఆనం ఆదేశాలతో అధికారులు ఆహ్వానం పంపారు. అలాగే కార్పొరేషన్ చైర్మన్ల విషయంలో తర్జనభర్జన పడినప్పటికి చివరకు వారికి కూడా సమావేశపు సమాచారాన్ని పంపినట్లు సమాచారం. కాగా ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడ్డాక డీఆర్సీ జరగడం ఇది రెండవసారి. ఇన్‌చార్జ్ మంత్రుల నియామకం గత అక్టోబరులో జరగ్గా తొలి సమావేశాన్ని నవంబరు 4న నిర్వహించారు. మళ్లీ మూడు నెలలకే తదుపరి సమావేశాన్ని నిర్వహించాలని అనుకున్న రకరకాల కారణాలతో జాప్యం జరిగి చివరకు ఐదున్నర నెలల అనంతరం బుధవారం జరుగనుంది. ఆయా అంశాల పరిస్థితి పరిశీలిస్తే జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులు ప్రస్తుతం వేగం పుంజుకుంటున్నాయి. రోజువారీ లక్షా 20వేల మంది కూలీలు పనులకు వస్తుండగా పంచ ప్రాధాన్యాలుగా గుర్తించిన వర్కులు చేపడుతున్నారు. అయితే మూడు నెలలుగా పనులు చేసిన కూలీలకు రూ.25కోట్లకుపైగా వేతనాలతోపాటు మెటీరియల్ కోటా కింద చేసిన పనులకు సంబంధించి సుమారు రూ.132 కోట్లు పెండింగ్ బిల్లులు ఉండటం ఇబ్బందికరంగా మారింది.

విచారణపై చర్యలు ఏవీ?

మరోవైపు గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో ఉపాధి హామీ పథకంలో అడ్డగోలుగా అవినీతి జరిగిందన్న ఫిర్యాదుతో కలెక్టర్ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే త్రిసభ్య కమిటీ విచారణ చేసి అప్పటి పీడీగా పనిచేసిన కె.శీనారెడ్డి అక్రమాలు, అవినీతికి పాల్పడినట్లు తేల్చింది. ఆ విచారణ కమిటీ నివేదిక ఇచ్చి రెండు మాసాలు గడుస్తున్న ప్రభుత్వం నుంచి ఇంతవరకు చర్యలు లేకపోగా ఇతర ఉద్యోగులు, సిబ్బందిపై కూడా జిల్లాస్థాయిలో నామమాత్రపు చర్యలు తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ స్థాయిలో జరిగిన విచారణలోనే బాధ్యులపై చర్యలు సరిలేకపోవడంతో ప్రస్తుతం కూడా డ్వామా సిబ్బంది చాలా చోట్ల యథేచ్ఛగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదులు అధికంగా వస్తుండగా సోషల్ ఆడిట్, ప్రజావేదికలు తీరు అందుకు బలాన్ని ఇస్తున్నాయి.

అధికమైన తాగునీటి ఇక్కట్లు

మరోవైపు జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పల్లె, పట్టణం తేడా లేకుండా వందలాది గ్రామాల్లో ప్రత్యేకించి పశ్చిమప్రాంతంలో నీటికోసం ప్రజలు తల్లడిల్లుతున్నారు. ప్రస్తుతం ఎనిమిది మండలాల్లోని 67 గ్రామాల్లో నీటి సరఫరా జరుగుతుండగా అంతకు రెట్టింపు ప్రాంతాలలో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఒంగోలు నగరంలో మూడు రోజులకు ఒకసారి అరకొరగా నీటి సరఫరా జరుగుతుండగా పలు పట్టణాలలోను అవస్థలు తప్పడం లేదు.

ఒక్కశాతం మించలేదు

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యతగా పీఎం సూర్యఘర్ పథకాన్ని తీసుకొచ్చాయి. నియోజకవర్గానికి 10వేల వంతున 80వేల సోలార్ యూనిట్లు ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటి వరకు అందులో ఒక్కశాతం మించి చేయలేదు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంపై స్పష్టత రావడంతోపాటు ప్రజల్లో అవగాహన కల్పన లోటుతో పథకం ముందుకు సాగడం లేదు. గృహ నిర్మాణ పరిస్థితి అలాగే ఉంది. ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక పెండింగ్‌లో ఉన్న 21వేల ఇళ్ల నిర్మాణాలపై దృష్టిపెట్టినా పదిశాతం మించి జరుగుతున్న పరిస్థితి లేదు. ఇక అత్యంత ప్రధానమైన ప్రజావిజ్ఞప్తుల పరిష్కారం చూసేందుకు బాగానే జరుగుతున్నట్లు ఉన్నా ప్రభుత్వ సర్వేలో జిల్లాపై నెగిటివ్‌గా ప్రజాభిప్రాయం ఉంది.

యంత్రాంగంపై తీవ్ర అసంతృప్తి

అధికారుల తీరుపై ప్రజల్లో అసంతృప్తి ఎక్కువగా ఉంది. ఈ అంశాలపై క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రజాప్రతినిధులు డీఆర్సీ సమావేశంలో చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాగా ఇతర అంశాలు చూస్తే జిల్లాకు తలమానికమైన ఒంగోలు డెయిరీ పునరుద్ధరణ ప్రజల కోరిక కాగా ఆ దిశగా చర్యలు కనిపించకపోగా ఆయా ఆస్తులు అన్యాక్రాంతమయ్యే పరిస్థితి ఏర్పడింది. వెలిగొండపై ప్రభుత్వం సీరియస్‌గానే ఉన్న ఆ స్థాయిలో నిధులు మంజూరు కాక ప్రతికూల పరిస్థితి ఉంది. ట్రిపుల్ ఐటీ, యూనివర్సిటీ నిర్మాణాలు, చదలవాడ పశుక్షేత్రం అభివృద్ధి అంశాలు ఎవరికీ పట్టడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో సాగర్ కాలువలు, ఇతర నీటి వనరులపై చేసిన నిర్లక్ష్యంతో నీటిపారుదల ఇబ్బందిగా మారింది. ఈ అంశాలు అన్నింటిపైనా దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. జిల్లాలో వివిధ శాఖల పనితీరు కూడా ఏమాత్రం మెరుగుపడక పోగా అధ్వానంగా మారాయి.

ప్లానిస్తే.. పాట్లే

(5వ పేజీ తరువాయి)

అధికారులు ప్లాన్ ఇచ్చేవారు. కొత్త నిబంధనల ప్రాకారం ఎల్‌టీపీ ప్లాన్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే సదరు అధికారులతో పని లేకుండా ప్లాన్ మంజూరు అవుతుంది. ప్లాన్‌ను ఆన్‌లైన్‌లో దాఖలకు లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్స్(ఎల్‌టీపీ)లకు ప్రభుత్వం పూర్తి అధికారాలు ఇచ్చింది. ఇంతవరకు బాగున్నా వారు అప్‌లోడు చేసిన ప్లాన్‌ను అతిక్రమించి భవనాన్ని నిర్మిస్తే అందుకు ఎల్‌టీపీలను బాధ్యులను చేసింది. నిర్మాణదారుడు ప్లాన్‌ను ఉల్లంఘించి భవనం నిర్మిస్తే తమ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు కేసులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఎల్‌టీపీల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొత్తగా భవన నిర్మాణాలకు ప్లాన్లను దాఖలు చేసేందుకు ఎల్‌టీపీలు ముందుకు రావడంలేదు. ప్రభుత్వం నిబంధనలు సడలిస్తే తప్పితే ఇప్పట్లో మున్సిపాల్టీల్లో ప్లాన్ల కోసం దరఖాసులు చేసే పరిస్థితులు లేవనే చెప్పాలి.

సరళం.. కఠినం

నిర్మాణ రంగంలో ప్లాన్ల మంజూరు నిబంధనలను మున్సిపల్ శాఖ సరళతరం చేసింది. ప్లాన్ కోసం పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల చుట్టూ నిర్మాణదారులు తిరగకుండా ఉండేలా వెసులుబాటు కల్పించింది. ఆన్‌లైన్‌లో ప్లాన్ నమోదు చేసి మున్సిపాల్టీకి ఫీజు చెల్లిస్తే అప్రూవల్ వస్తుంది. ఆపై నిర్మాణదారుడు వెంటనే ప్లాన్ ప్రకారం పనులు ప్రారంభించవచ్చు. అయితే ఏ కొద్ది పాటి అతిక్రమణ జరిగినా ఎల్‌టీపీలపై వేటు పడుతుంది. ఆరు నెలల పాటు వారిని బ్లాక్ లిస్టులో పెడతారు. పదేపదే ఇటువంటివి పునరావృతమైతే వారి లైసెన్స్ రద్దు చేస్తారు. ఈ నేపథ్యంలో ఎల్‌టీపీలు కొత్త ప్లాన్ల దరఖాస్తు చేయడాన్ని పూర్తిగా నిలిపివేశారు. తమపైనే వేటు పడే నిబంధనలను వారు వ్యతిరేకిస్తున్నారు. గతంలో ప్లాన్ ప్రకారం నిర్మాణం చేపట్టినా పది శాతం వరకు అతిక్రమించుకునే వెసులుబాటు కల్పించారు. తదుపరి రోజుల్లో మున్సిపాల్టీకి జరిమానా చెల్లించి క్రమబద్ధీకరించుకునే వారు. కొత్త నిబంధనలో ఆ వెసులుబాటు లేదు. నిబంధనలు అతిక్రమిస్తే భవన యాజమానులపై కాకుండా ఆన్‌లైన్‌లో ప్లాన్లు నమోదు చేసే తమపై చర్యలు ఉండటాన్ని ఎల్‌టీపీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జీ ప్లస్-5కు గతంలో టౌన్ ప్లానింగ్ ఆర్డీ పరిశీలించి ఆమోదం తెలిపేవారు. ఏమైనా అభ్యంతరాలుంటే మార్పులు చేసి ప్లాన్ ఇచ్చేవారు. ఇప్పుడది ఉండదు. అంతా ఎల్‌టీపీలదే బాధ్యత. స్థలానికి సంబంధించి ఎవరైనా కేసులున్నట్లు ఫిర్యాదు చేస్తే సంబంధిత యజమానిపై, ప్లానర్‌పై కేసులు నమోదు చేస్తారు. పట్టణంలో 300 చదరపు మీటర్లలో భవన నిర్మాణం గతంలో చేసుకుంటే కొంత సడలింపు ఉండేది. మార్టిగేజ్ ఉండటంతో చిన్న చిన్న తేడాలు ఉన్నా పెద్దగా పట్టించుకునేవారుకాదు. ఇప్పుడా పరిస్థితి లేదు. కొత్త నిబంధనలు ప్రకారం నిబంధనలు అతిక్రమించారని గుర్తిస్తే వారిపై కేసులు నమోదు చేస్తారు. ఈ నిబంధనలకు సడలింపులు చేయకపోతే ప్లాన్ గీసే పరిస్థితి లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

27న ఏలూరి క్యాంప్ కార్యాలయంలో

ఉచిత కంటి వైద్యశిబిరం

మార్టూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఈ నెల 27 న ఆదివారం ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్యాంపు కార్యాలయం వారు మంగళవారం ప్రకటనలో తెలిపారు. కంటి వైద్య శిబిరానికి వచ్చే వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, అవసరమైన వారికి ఆపరేషన్లు చేసేందుకు నిర్ణయిస్తారన్నారు. ఈ అవకాశాన్ని మార్టూరు ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ట్రైనీ డీఎస్పీ అభిషేక్

ఈపూరుపాలెం(చీరాల), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కక్ష దారులకు స్టేషన్ పరిధిలోని చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని ట్రైనీ డీఎస్పీ అభిషేక్ అన్నారు. మంగళవారం ఈపూరుపాలెం స్టేషన్ వద్ద చలివేంద్రం ప్రారంభించారు. అలాగే ప్రజలకు వాహన దారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి చర్చలు జరపాలి

చీరాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో నాయకులు మోహన్‌కుమార ధర్మ, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, శ్రీకృష్ణ, మేడా వెంకటరావు చర్చా వేదిక నిర్వహించారు.

ఫ్యాక్షన్ గ్రామంపై పోలీసు డేగ కన్ను

- వేమవరంలో నలువైపులా కొత్త వ్యక్తుల కదలికపై ప్రత్యేక నిఘా ఏర్పాటు
- ఆరు సీసీ కెమెరాల ఏర్పాటు
- జంట హత్యల కేసు తుది దశకు చేరడంతో అప్రమత్తం
- ఉన్నతాధికారులు ఆదేశాలతో గ్రామంలో నూతనంగా సీసీ కెమెరాలు



వేమవరంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ నాగరాజు

బల్లికురవ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాక్షన్ గ్రామం అయిన వేమవరంపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. ఈ గ్రామంలో గత పదేళ్ల కిందట జంట హత్యలు జరిగాయి. అప్పటి నుంచి గ్రామంలో ప్రత్యేక పోలీసు పికెట్ కొనసాగుతూనే ఉంది. ఇటీవల నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన వై.నాగరాజు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇటీవల వేమవరం నలువైపులా గ్రామంలోకి వచ్చే కొత్త వ్యక్తుల కదిలికలపై ప్రత్యేక నిఘా పెట్టేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. పోలీసు స్టేషన్ నుండే వేమవరంలో జరిగే కదలికలను ప్రత్యేక సిబ్బంది పరిశీలన చేసేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.



వేమవరంలో మల్లాయపాలెం వైపు వచ్చే దారిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

బల్లికురవ మండలం వేమవరం గ్రామంలో గతంలో జంట హత్యలు జరిగియి. తదనంతరం మరో వర్గం వారిపై దాడులు చేసేందుకు యత్నం జరిగింది. అప్పట్లో ఈ గ్రామంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించింది. ఈ గ్రామంలో పదేళ్ల నుంచి పికెట్ నిరంతరం కొనసాగుతుంది. వైసీపీ, టీడీపీ పార్టీల వర్గీయుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంది. వారు ఎక్కడకు వెళ్లాలన్న పోలీసు శాఖ అనుమతి తీసుకోవల్సిందే. జంట హత్యల కేసు విచారణ తుది దశలో ఉండడం సాక్షుల విచారణ కూడా కోర్టులో జరుగుతుంది. ఈ కేసులపై పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఎస్ఐ నాగరాజు మురికిపూడి, మల్లాయపాలెం వైపు నుంచి వచ్చే ప్రజల కదలికలు గమనించేలా ఆరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఇతర గ్రామాల వారు వేమవరం మీదుగా వెళితే వారి వివరాలను సేకరిస్తున్నారు. చోరీలు కూడా జరగకుండా ఉండేలా సీసీ కెమెరాలు ఎంతో ఉపయెగం అని పోలీసులు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజల నుండి హర్షం వ్యక్తం అవుతుంది. ప్రతి రోజు ఎస్ఐ నాగరాజు ఈ గ్రామాన్ని సందర్శించి ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఉండేలా కౌన్సెలింగ్ ఇస్తున్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ఎస్ఐ నాగరాజును వివరణ కోరగా.. ఇకపై మండలంలో అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తామని వేమవరంపై ప్రత్యేక నిఘా దృష్ట్యా చర్యలు చేపట్టామని తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి మనోజ్ ప్రజ్యత్, పాల్గొన్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

వైద్య సేవలపై అవగాహన ఉండాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య సేవలపై సిబ్బంది అందరూ తప్పని సరిగా అవగాహన కలిగి ఉండి ప్రజలకు మెరుగైన సేవలందించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ మనోజ్ ప్రజ్యత్ సూచించారు. మంగళవారం అద్దంకిలోని గీతామందిర్‌లో వైద్య ఆరోగ్యశాఖ అద్దంకి క్లస్టర్ పరిధిలోని మోదేపల్లి, కొరిశపాడు, పాసంగులపాడు, మేదరమెట్ల, కాకానిపాలెం, గాజులపాలెం, కోలోటెడ్ అద్దంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పని చేస్తున్న ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌సీఎస్, సూపర్‌వైజర్లకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నిర్వహణ, అందించాల్సిన సేవలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా ఆసుపత్రుల డాక్టర్లు శ్రీహర్ష, బాలరాజు, హరికృష్ణ, జయసింహ, అనీష్, అక్షిత పాల్గొన్నారు.

వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థినులతో సిబ్బంది

నాగులపాలెం (పర్చూరు), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వృత్తి విద్యలో శిక్షణ పొందించిన వారికి ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని ప్రిన్సిపాల్ పి.విశ్వరాణి అన్నారు. మంగళవారం పర్చూరు మండల పరిధిలోని నాగులపాలెం అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో వృత్తి విద్యలో శిక్షణ పొందిన విద్యార్థినులకు జిల్లా ఒకేషనల్ కోఆర్డినేటర్ సత్యనారాయణ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులకు గుండ్లకమ్మ నీరు

ట్రాక్టర్‌లతో పంప్ చేస్తున్న రాచపూడి, ప్రాసంగులపాడు గ్రామస్థులు

మేదరమెట్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వేసవి వస్తే ఆ గ్రామాలల్లో చుక్క నీరు ఉండదు. నీటి కోసం వేకువ జామునే బావుల వద్ద బారులు తీరాల్సివస్తుంది. ఇళ్లల్లో వాడుకోవడానికి, పసువుకలకు కూడా పక్క గ్రామాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తుంది. అక్కడ అంత తీరిక లేకుండా పొలం పనులు చేసుకుని రైతులు, కూలీలు మండలంలోని రాచపూడి ప్రసంగులపాడు గ్రామాల్లో చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. ప్రతి సంవత్సరం వేసవిలో గుండ్లకమ్మ రిజర్వాయర్ ఎడమ కాలువ నుంచి చెరువులకు నీటిని ఎత్తి పోస్తారు. గత రెండేళ్లుగా రిజర్వాయర్‌కు గేట్లు లేకపోవడం వలన రిజర్వాయర్‌లో నీరు లేదు. ఈ రెండు గ్రామాల ప్రజలు నీటి కోసం ఇబ్బంది పడ్డారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాకా గేట్లు బిగించడంతో రిజర్వాయర్‌లో నీరు నిండుగా ఉంది. దీంతో చెరువులు నింపుకోవడానికి ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. గత నాలుగు రోజులుగా రాచపూడి, ప్రాసంగులపాడు గ్రామస్థులు ఎడమ కాలువపై ట్రాక్టర్ ఇంజన్‌ల ద్వారా నీటిని చేరువుల్లోకి మళ్లిస్తున్నారు. రాచపూడి చెరువు కాలువ పక్కనే ఉండడంతో తేలికగా నీటిని ఎత్తి పోయడం జరిగింది. ప్రాసంగులపాడు చెరువు కాలువకు దూరంగా ఉండడంతో రెండు విడతలుగా ఎత్తి పోయాల్సి వచ్చింది. మొత్తం మీద రెండు చెరువులు మంగళవారం నిండాయి. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధికారులు రోజూ చెరువులను నింపడాన్ని పరిశీలించారు. చెరువులు నిండడంపై గ్రామస్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.



ప్రాసంగులపాడు చెరువుకు నీటిని పంప్ చేస్తున్న ట్రాక్టర్లు

గురుకులాల అభివృద్ధికి నిరంతరం కృషి

ఎమ్మెల్యే కొండయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాలల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. మంగళవారం మండల పరిధిలోని సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో చేసిన అభివృద్ధి నిర్మాణాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పాఠశాలల్లో చిన్నారులకు అందాల్సిన వసతులు, పరికరాలపై నిత్యం దృష్టి ఉంటుందని చెప్పారు. అలాగే విద్యార్థులు గురువుల నుంచి చక్కనైన విద్యాభ్యాసం పొందాలని చెప్పారు. అంతకుముందు వేటపాలెం ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. వేసవి కాలం ప్రయాణికులకు ఇది దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆప్కో ఛైర్మన్ సజ్జా హేమలత, ఏఎంసీ ఛైర్మన్ కొతవరపు జనార్ధనరావు, తహసీల్దార్ పార్వతి, పొగడదండ రవికుమార్, నాసిక వీరభద్రయ్య, పల్లప్రోలు శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరి, బాలకృష్ణ, నాగు టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ మోహనరావు

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

పర్చూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ ఎన్.మోహనరావు అన్నారు. మంగళవారం మండల సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం అధికంగా ఉండడం వల్ల భూమి నిస్సారంగా మారుతుందని, ఆ ఎరువుల వాడకాన్ని రైతులు తగ్గించాలన్నారు. సేంద్రియ ఎరువుల ద్వారా తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయం చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏవో రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో విచారణ

మార్టూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం చిత్తూరు నుంచి వచ్చిన ఇద్దరు ప్రత్యేక అధికారులు అరుణ్‌కుమార్, ఫణిభూషణ్ విచారణ చేశారు. ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిపై చిన్న పిల్లల వైద్య నిపుణులుగా పనిచేస్తున్న విశ్రాంత ఉద్యోగి వెంకట అప్పారెడ్డి నడవడికపై పలువురు వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది నెల కిందట డీఎస్‌హెచ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అంతేగాకుండా ఇటీవల ఆస్పత్రిలో చోటుచేసుకున్న పలు ఘటనపై విచారణ చేసేందుకు ఇద్దరు అధికారులు వచ్చారు. వారు ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టరు వెంకట అప్పారెడ్డిని మిగిలిన వైద్యులను, సిబ్బందిని విచారించారు.అందుకు సంబందించి నివేదికను తయారు చేసి ఉన్నత అధికారులకు పంపిస్తామని ఇద్దరు అధికారులు తెలిపారు.




ఉపాధ్యాయినులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కాలుష్య కోరల్లో భూగోళం

ఘనంగా ఎర్త్ డే

చీరాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : భూ భౌగోళం కాలుష్య కోరల్లో చిక్కుకుందని, పర్యావరణ పరిరక్షణతోనే దానిని కాపాడుకోగలమని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. మంగళవారం నియోజకవర్గం పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఎర్త్ డే (ధరిత్రి దినోత్సవం) కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భూగోళం కాలుష్యం, పరిరక్షణలో మానవుడి పాత్ర అనే అంశాలపై డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద పాఠశాలలో విద్యాబోధన చేసిన నీలిమ, నిర్మల, కల్పన, సంతోషం, రాజేశ్వరి ఉపాధ్యాయినులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శేఖరరావు, బుద్ధి మోహన్‌రావు, పరమేశ్వరి, వేణుగోపాలరావు, భవానీ, నారాయణ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు. మంగళవారం పట్టణంలోని కేజీఎం హైస్కూల్లో ఒంగోలు కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. భూమిని కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సైన్స్ కోఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి పేర్కొన్నారు. కాలుష్యం కారణంగా ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నట్లు ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జీవమున్న ఏకైక గ్రహం భూమి అని. మానవుని అవసరాలను తీర్చేందుకే సహజ వనరులున్నట్లు చెప్పారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రరెడ్డి, గోవర్ధనమ్మ శారద, విద్యార్థినీలు పాల్గొన్నారు.

మండల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అంకమ్మరెడ్డి

చినగంజాం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి) : మండల సర్వతోముఖాభివృద్ధికి సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, స్వయం సహాయక గ్రూపులలో ఉన్న వారికి రుణాలు కూడా మంజూరు చేస్తామని ఏపీఎం జీ పెదసుబ్బారావు తెలిపారు. కడవకుదురు గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని సిబ్బంది సక్రమముగా విధులు నిర్వహించడం లేదని, పలు కేంద్రాల్లో చిన్నారులు కూడా ఉండడం లేదని, మీరు తనిఖీ చేయటానికి వస్తున్నారంటే పిల్లలను తీసుకొని వచ్చి కూర్చోబెడుతున్నారని, మీరు వారిపై ఏమి చర్యలు తీసుకుంటున్నారని గ్రామ సర్పంచ్ గొల్లమూరి శివకుమారి ఇంకొల్లు ప్రాజెక్ట్ సీడీపీవో ఝాన్సీని ప్రశ్నించారు. విధులు సక్రమంగా నిర్వహించని వారికి మెమోలు జారీ చేసామని సీడీపీవో తెలిపారు. కేంద్రాల్లోని కార్యకర్తలు, ఆయాలు సరిగా విధులు నిర్వహిస్తున్నారా లేదా తనిఖీ చేసి సక్రమంగా పనిచేసేలాచూసే బాధ్యత సూపర్‌వైజర్‌లపై ఉందని ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి అన్నారు. వేసవికాలంలో తాగునీటికి ఇబ్బందులు లేకుం డా ఉండేందుకు కొమ్మమూరు కాలువకు 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఏఈఈ ఎ.శ్రీధర్ తెలిపారు. మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపుకోవాలని గ్రామ కార్యదర్శులకు సూచించా రు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావు, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు డి.దాసు, జి.రాజశేఖర్, పి.బసవరాణి, ఏపీవో లక్ష్మీదేవి, ఎంఈవో-2 కోటేశ్వరరావు, మండల ఉపాధ్యక్షురాలు టి.ప్రసన్నలక్ష్మి, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



రెస్టారెంట్‌లో శాంపిల్స్ సేకరిస్తున్న ఆహార తనిఖీ అధికారులు

ముమ్మరంగా ఆహార తనిఖీలు

పలు రెస్టారెంట్‌లపై అధికారుల ఆగ్రహం

చీరాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మంగళవారం ఆహార భద్రత అధికారులు గరికపాటి ప్రభాకరరావు, ప్రణీత్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా పలు రెస్టారెంట్‌లు, బిర్యానీ పాయింట్‌లలో ముమ్మరంగా తనిఖీలు చేశారు. ఈక్రమంలో వంట గదిలో నిల్వ ఉంచిన మాంసాహారం, ఇతర పదార్థాలను గుర్తించారు. కిచెన్ పరిసరాల్లో అపరిశుభ్రంగా ఉండడాన్ని చూసి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ తనిఖీల్లో కొందరు నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు. అంతేకాకుండా మరి కొన్ని రెస్టారెంట్‌లలో శాంపిల్స్‌ను సేకరించారు. పరీక్షలు అనంతరం చర్యలు ఉంటాయని చెప్పారు. నిల్వ పదార్థాలు ప్రజలకు అందిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో దాసరి ఇమ్మానియేల్ తదితర సిబ్బంది ఉన్నారు.

హత్య కేసులో 14 రోజుల రిమాండ్

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలోని యనమదల గ్రామంలో శనివారం అర్ధరాత్రి ఇంటిలో నిద్రపోతున్న భార్య నీలం మంగమ్మను హత్య చేసిన భర్త శ్రీనివాసరావును మంగళవారం పర్చూరు కోర్టులో హాజరుపరచినట్లు ఎస్ఐ టీ రత్నకుమారి తెలిపారు. శ్రీనివాసరావుకు 14 రోజుల రిమాండ్‌ను న్యాయాధికారి విధించగా, నెల్లూరు జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

బల్లికురవ. ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అద్దంకి నార్కెట్ పల్లి రాష్ట్రీయ రహదారి కొప్పెరపాడు గ్రామ సెంటర్‌లో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. రెండు మాసాలుగా కొప్పెరపాడులో ఇతర రాష్ట్రం నుంచి వచ్చిన 60 ఏళ్ల వయస్సు ఉండే మహిళ రోడ్డు వెంబడి ఉన్న దుకాణాల వద్ద మతిస్థిమితం లేకుండా తిరుగుతూ ఎవరైనా ఏదైనా ఇస్తే తింటూ ఉంటుంది. అదేవిధంగా రోడ్డుపై తిరుగుతున్న మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు పరిశీలించి వీఆర్వో గురవయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతురాలి వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహం వద్దకు ఎవరూ రాకపోవడంతో పోలీసు స్టేషన్ రైటర్ ఆంజనేయులు దగ్గరుండి మృతదేహాన్ని మోసుకుపోయి పోస్టుమార్టం కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

150 మందికి దంత పరీక్షలు

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో మంగళవారం 150 మందికి దంత పరీక్షలు నిర్వహించారు. సిబార్ దంత వైద్యశాలకు చెందిన బీడీఎస్ 4వ సంవత్సరం చదువుతున్న 10 మంది విద్యార్థినులు, పీజీ విద్యార్థులు ముగ్గురు, ప్రొఫెసర్లు దేవకి, రాజశేఖర్ ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. కొంతమందికి పిప్పిపన్నులు, ఇబ్బంది పెడుతున్న పన్నులను తొలగించారు. కార్యక్రమంలో వారికి టీడీపీ నాయకులు గుదే తారకరామారావు, కొరటాల వంశీకృష్ణ సహకరించారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



కడవకుదురు గ్రామంలో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చినగంజాం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుర్రా రామారావు అన్నారు. మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన ప్రవేశాలలో భాగంగా బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి, ప్రభుత్వ బడి అమ్మ వంటిది అని నినాదాలు చేస్తూ మంగళవారం గ్రామంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని శివాలయం సెంటర్‌లో మానవహారం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందించే తల్లికి వందనం, డొక్కా మాణిక్యమ్మ మధ్యాహ్న భోజన పథకం, యూనిఫాం, చిక్కి, గుడ్డు, షూస్ తదితర పథకాల గురించి ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తను పరామర్శించిన మేరుగ


అద్దంకి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండలం సోమవరప్పాడులో జరిగిన ఘర్షణలో గాయపడి అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న గోపిరాజును మంగళవారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగు నాగార్జున పరామర్శించారు. వైసీపీ నేతలు నరసింహారెడ్డి, జ్యోతి హనుమంతరావు, రాధాకృష్ణమూర్తి, దేవినేని కృష్ణ ఉన్నారు.

పాఠశాలల్లో ఎకో క్లబ్‌ను రిజిస్ట్రేషన్ చేయాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి పాఠశాలలో ఎ కో క్లబ్‌ను రిజిస్ట్రేషన్ చేయాలని చీరాల డిప్యూటీ ఈవో డీ గంగాధరరరావు అన్నారు. మంగళవారం ధరిత్రి దినోత్సవం సందర్భంగా మండలంలోని తిమ్మాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల, పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయనతోపాటు ఎంఈవో 2 బూధాటి సుధాకరరావు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పాఠశాలలో మొక్కలు నాటారు. ఎకో క్లబ్‌ను ఏర్పాటు చేసిన మొక్కల శాస్త్రీయ పేర్లు ఇతర వివరాలతో క్యూ ఆర్ కోడ్‌ను తయారు చేసి ప్రదర్శించారు. రెండ్రోజులపాటు ఈ కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని గంగాధరరావు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం పెంట్యాల గంగాధర్, సీఆర్పీ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం తిమ్మాయపాలెం హైస్కూల్‌లో వృత్తి విద్యా శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు డిప్యూటీ ఈవో చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు.



మొక్కలు నాటుతున్న డిప్యూటీ ఈవో గంగాధరరావు, ఎంఈవో సుధాకరరావు, ఉపాధ్యాయులు



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	38.8	27.6
కావలి	37	27
ఆత్మకూరు	40	27
ఉదయగిరి	40	26
కందుకూరు	37	27

ఆయన మాట అసభ్యకరం..
వైఖరి బెదిరించడం!
పశుసంవర్ధక శాఖలో ఓ ఉన్నతాధికారి తీరిది

పశుసంవర్ధక శాఖలో ఉన్నతాధికారిగా ఆయనకు ఈమధ్యనే పదోన్నతి లభించింది. ఆయనకున్న అనుభవం దృష్ట్యా ఆ శాఖ ద్వారా పాడిరైతులకు ఎంతో న్యాయం చేయగలరని అధికారులు, సిబ్బంది భావించారు. అయితే అంతా రివర్స్ అయ్యింది. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే ఆ అధికారి తీరులో మార్పు వచ్చింది. కిందిస్థాయి సిబ్బందిని దురుసుగా మాట్లాడటం పరిపాటిగా మారింది. చివరకు ఆ శాఖ మంత్రినే హేళనగా మాట్లాడటంతో ఆయన ఆగ్రహానికి గురై చర్యలకు సిఫారసు చేయడంతో ఆ అధికారి వ్యవహారం జిల్లావ్యాప్తంగా చర్చకు దారితీసింది.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పశుసంవర్థక శాఖలో ఓ కీలక అధికారి తీరుతో కిందిస్థాయి అధికారులు, సిబ్బంది మనోవేదనకు గురవుతున్నారు. గట్టిగా అరుస్తూ తిట్టడం ఆయన ప్రత్యేకతగా చెప్పుకుంటుంటారు. ఆయనకు తెలియకుండా ఏదైనా సమాచారం బయటకు పొక్కిందంటే ఇక కార్యాలయ సిబ్బంది మొత్తాన్ని పిలిపించి మరీ బెదిరించి భయపెడతారు. మాకు పోయేదేమీ లేదంటూ మరింత వాడకూడని భాషను వినియోగిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. గేదెలతో పోలుస్తూ హేళనగా మాట్లాడుతుంటారని సిబ్బంది వాపోతున్నారు.

● ఒకరి పని.. ఇద్దరికి కేటాయింపా!?

జిల్లా కార్యాలయంలో ఆయన తరువాత అంతటి అధికారాలు కలిగిన నోడల్ అధికారి సీటు ఒకటి ఉంటుంది. ఆ అధికారి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆ నోడల్ అధికారి సీటుకు గట్టి పోటీ వచ్చింది. ఇద్దరు మంత్రుల నుంచి సిఫారసు పత్రాలు కూడా తీసుకొచ్చారు. అంతటి ప్రాధాన్యం ఉన్న ఆ సీటు సేవలు గతంలో ఒక్కరే అందించేవారు. ప్రభుత్వ పథకాలు రైతులకు సక్రమంగా అందుతున్నాయా!? లేదా!? మందులు, పశువులకు సంబంధించి టీఎంఆర్, సమీకృత దాణా వంటివి కేటాయింపులు సక్రమంగా చేయడం, అవసరమైన మేర ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపడం ఆ నోడల్ అధికారి ముఖ్య విధులు. అయితే ఆ సేవలను ఇద్దరికి కేటాయించడం ఆ శాఖలో పెద్ద చర్చకు దారి తీసింది. అదికూడా జిల్లా కార్యాలయంలో పనిచేసే అధికారితో కాకుండా మరో డివిజన్ అధికారికి ఇవ్వడంపై విమర్శలు వస్తున్నాయి. పరిపాలన అవసరాల దృష్ట్యా ఇద్దరిని పెట్టుకోవడంలో ఇబ్బంది లేదని అయితే మరో డివిజన్ అధికారికి కేటాయించడమే ఇక్కడ చర్చకు దారితీసింది.



● మంత్రినే హేళన చేసిన వైనం

ఓ మహిళా ఉద్యోగిని జిల్లాలోని ఓ మండలంలో నాన్‌లోకల్ కింద సచివాలయంలో విధులు నిర్వహిస్తోంది. అయితే డిప్యుటేషన్‌పై తన సొంత జిల్లాకు పంపాలని కోరుతూ ఆ శాఖ మంత్రి నుంచి సిఫారసు లేఖ కూడా తెచ్చుకుంది. డివిజనల్ స్థాయిలోనూ ఆమెకు అవసరమైన పత్రాలన్నీ సిద్ధమై జిల్లాస్థాయి అధికారి కార్యాలయానికి చేరుకున్నాయి. వీటిని పరిశీలించిన ఆయన ఆమెను కార్యాలయానికి పిలిపించి, తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగక మంత్రి ఆహార్యాన్ని హేళన చేయడంపై ఆమె రికార్డు చేసినట్లు తెలిసింది. ఈ రికార్డ్ వాయిస్ సదరు మంత్రికి చేరడంతో ఆయన ఆగ్రహానికి గురికావాల్సి వచ్చిందని సమాచారం. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఈ విషయంపై చర్చ నడుస్తోంది. సదరు ఉన్నతాధికారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కూ ఆదేశాలు అందాయని సమాచారం.

● క్షేత్రస్థాయి పర్యటనకు వెళితే..

ఆ అధికారి క్షేత్రస్థాయి పర్యటనకు వస్తున్నారంటే ఆయా మండలాల అధికారుల జేబుకు చిల్లుపడాల్సిందే. రేపు మీ మండలంలో క్షేత్రస్థాయిలో పరిశీలన ఉంటుంది.. మీ పనితీరుపై చర్చ ఉంటుందంటూ ప్రత్యేక మెనూ గురించి ప్రత్యేకంగా చెప్పిస్తారని, అదిలేనిదే ఆయనకు ముద్ద దిగదు అంటుంటారు. ఆయన వెళ్లే ప్రదేశాన్ని బట్టి అక్కడ మాత్రమే అందుబాటులో ఉండే ప్రత్యేక మాంసాహార భోజనం చేయించాల్సిందేనని చెబుతున్నారు. అంతేకాదండోయ్... సదరు అధికారి కారుకు ట్యాంకు నిండా డీజిల్ నింపి ఇంకేదో సమర్పించుకుని అక్కడి నుంచి వీడ్కోలు పలుకుతారనే ఆరోపణలు ఉన్నాయి.



ఉమ్మడి జిల్లాలో న్యాయాధికారుల బదిలీ

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న పలువురు న్యాయాధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న ఎస్ లావణ్యను విశాఖపట్నం జిల్లా మాడుగుల జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేసింది. అమె స్థానంలో ఎవరినీ నియమించలేదు. మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న బీ అఖిలను ప్రకాశం జిల్లా అద్దంకి అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌గా బదిలీ చేశారు. అమె స్థానంలో కర్నూలు జిల్లా కోయిలకుంట్లలో జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న అబ్దుల్ రహమాన్ షేక్‌ను నియమించారు. నాల్గవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న టీ భాస్కర్‌ను కర్నూలు జిల్లా అళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. అయన స్థానంలో ప్రకాశం జిల్లా చీరాల మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి నిషాద్ నాజ్ షేక్‌ను నియమించారు. నెల్లూరు 5వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న గండికోట దేవికను విజయవాడ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. నెల్లూరు ఎక్సైజ్ మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న టీ సుయోధన్‌ను కడప జిల్లా రాయజోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. గూడూరు కోర్టు మేజిస్ట్రేట్ పీ లోకనాధంను అనంతపురం జిల్లా కదిరి కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. కోట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ భరత్ కమల్‌ను కడప జిల్లా లక్కిరెడ్డిపల్లి జూనియర్ సివిల్ జడ్జిగా, కోవూరు ప్రిన్సిపల్ జూనియ ర్ సివిల్ జడ్జి జీ కాత్యాయనిని ప్రకాశం జిల్లా చీరల మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. సూళ్లూరుపేట కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ అనిల్ కుమార్‌ను కర్నూలు ఎక్సైజ్ కోర్టు మేజి స్ట్రేట్‌గా బదిలీ చేశారు. వెంకటగిరి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి వో అనూషను కృష్ణా జిల్లా నూజివీడు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో చిత్తూరు జిల్లా నగరి మేజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న ఎస్ విష్ణు వర్మను నియమించారు. నాయుడుపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి పీ సంయుక్తను సూళ్లూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. అమె స్థానంలో అనంతపురం జిల్లా కదిరి జ్యుడీషియల్ మేజి స్ట్రేట్ పీ మీనాక్షి సుందరిని నియమిం చారు. సూళ్లూరుపేట అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్ అనూషను కర్నూలు మొబైల్ కోర్టు న్యాయాధికారిగా బదిలీ చేశారు.

పారిశ్రామిక పార్కుల్లో ఖాళీ స్థలాలపై ఏపీఐఐసీ దృష్టి
ఇప్పటికే భూమి తీసుకున్నవారికి నోటీసులు
పరిశ్రమలు నెలకొల్పాలంటూ అవగాహన, ఒత్తిడి

పరిశ్రమ పెడతారా..
భూమిని తిరిగిచ్చేస్తారా!?

నెల్లూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రా మికీకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ప్రతి సెంటు భూమిని సద్వినియోగం చేసుకుని పరిశ్రమలు నెలకొల్పేలా ఎప్పటికప్పుడు కీలక ఉత్తర్వులు జారీ చేస్తోంది. ఈ క్రమంలోనే గతంలో పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చి భూములు తీసుకున్న ఔత్సాహి కులను కదిలిస్తోంది. భూములు పొందాక కూడా ఎందుకు పరిశ్రమ నెలకొల్ప లేదంటూ వారిపై ఒత్తిడి తెస్తోంది. జిల్లాలో ఇప్పటివరకూ జరిపిన భూ కేటాయింపులు.. ప్రస్తుతం ఆ భూమి స్థితి.. పరిశ్రమలు ఎందుకు నెలకొల్ప లేదు? వంటి వివరాలను ఏపీఐఐసీ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఇండస్ట్రీయల్ పార్కుల్లోని డేటా కూడా క్రోడీకరిం చారు. జిల్లాలో 250 ఎకరాలకు సంబంధించి 30 మంది యజమానులకు నోటీసులు వెళ్లగా 20 మందికి పంపిన నోటీసులు వెనక్కు వచ్చాయి. దీంతో వీరికి కేటాయించిన భూములను రద్దు చేసేందుకు అధికారులు చర్యలు మొదలుపెట్టారు. ఇక నోటీసులు అందుకున్న వారి నుంచి సమాధానం వచ్చాక తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఎకరంలోపు భూమి తీసుకుంటే నిబంధనల ప్రకారం రెండేళ్లలోపు పరిశ్రమ స్థాపించాల్సి ఉంటుంది. ఆ పైన భూమిని తీసుకుంటే స్థాపనకు మూడేళ్ల వరకూ గడువు ఉంటుంది. ఇప్పుడు నోటీసులు అందుకున్న వారిలో మెజారిటీ మంది 2018, 2019లో భూములు పొందిన వారే ఉన్నారు.

● ఒప్పించేందుకు ప్రయత్నాలు

పారిశ్రామిక అభివృద్ధికి జిల్లాలో విస్తృత అవకాశాలున్నాయి. ఓ వైపు కృష్ణపట్నం, మరోవైపు రామాయపట్నం పోర్టుల మధ్య పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఉంది. గతంలో ఎంఎస్ఎంఈ యూనిట్లు స్థాపించేందుకు ఔత్సాహికులు ముందుకొచ్చేవారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో పారిశ్రామిక పాలసీను మార్చడంతో పరిస్థితిలో మార్పొచ్చింది. 2019 వరకూ అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఇండస్ట్రీయల్ పార్కుల్లో భూమిని సగం ధర సబ్సిడీతో సేల్ డీడ్ రూపంలో కేటాయించేవారు. ఇలా సేల్‌డీడ్ ఇవ్వడం ద్వారా బ్యాంకులో రుణం తెచ్చుకోవడం సులభమయ్యేది. కానీ వైసీపీ ప్రభుత్వం ఈ విధానాన్ని మార్చి లీజు డీడ్ తీసుకొచ్చింది. అంటే ఒక పారిశ్రామిక వేత్త రూ.కోట్లు ఖర్చు చేసి పరిశ్రమల నెలకొల్పినా ఆ భూమి మాత్రం తన పేరు మీద ఉండదు. ఈ కారణంగా ఇండస్ట్రీ యల్ పార్కుల్లో ప్లాట్లు తీసుకునేందుకు ఔత్సాహికులు ముందుకు రాలేదు. ఇది గమనించిన వైసీపీ గతేడాది ఎన్నికల ముందు మళ్లీ పాలసీని మార్చి సేల్‌డీడ్ విధానాన్ని పునరుద్ధరించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు చర్యలు మొదలుపెట్టింది. నిర్ణీత గడువులోపు పరిశ్రమలు నెలకొల్పాలని వారికి అవగాహన కల్పించి వీలైనంత వరకూ ఆ భూమిలో ఏదో ఒక పరిశ్రమ నెలకొల్పేలా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. కాకుటూరు వద్ద ఉన్న ఇండస్ట్రీయల్ పార్కులో కూడా చాలా ప్లాట్లు ఖాళీగా ఉండడంతో అక్కడా పరిశ్రమలు స్థాపించాలని, లేకపోతే ఎవరికైనా లీజుకు ఇవ్వాలని ఆ ప్లాట్ల యజమానులపై అధికారులు ఒత్తిడి తెస్తున్నారు.



ఆత్మకూరు : నారంపేట ఇండస్ట్రీయల్ పార్కు

ముత్తుకూరులో ఇండస్ట్రీయల్ పార్క్

ముత్తుకూరు మండలంలో రెండు ఇండస్ట్రీయల్ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణపట్నంలో 87.56 ఎకరాలు, నేలటూరులో 220.81 ఎకరాల ప్రభుత్వ భూమిని ఏపీఐఐసీకి ఉచితం కేటాయించేలా తీర్మానించారు. ఈ రెండు చోట్లా పార్కులు అభివృద్ధి చేసి సేల్ డీడ్ విధానంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం పలకనున్నారు. అలానే ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకై ఇప్పటికే అధికారులు భూములను గుర్తించారు. ఈ భూములను ఏపీఐఐసీకి అప్పగించడమే మిగిలి ఉంది. కాగా ఖాళీ ప్లాట్ల యజమానులకు నోటీసుల అంశంపై ఏపీఐఐసీ జడ్ఎం శివకుమార్‌ను వివరణ కోరగా భూములు తీసుకున్న తర్వాత నిర్ణీత గడువులోపు పరిశ్రమలు స్థాపించని వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి వారికి అవగాహన కల్పించి పరిశ్రమలు ఏర్పాటయ్యేలా చూస్తున్నామని చెప్పారు. అయినా పరిశ్రమలు స్థాపించకపోతే భూకేటాయింపులు రద్దు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

జిల్లావ్యాప్తంగా స్లాట్ బుకింగ్
26 నుంచి అమలులోకి..
రిజిస్ట్రేషన్ సేవలు ఇక సులభతరం

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : దస్తావేజుల రిజిస్ట్రేషన్ సేవలు మరింత సులభతరం కానున్నాయి. రవాణా శాఖలో లైసెన్సుల జారీకి మాత్రమే అందుబాటులో వున్న స్లాట్ బుకింగ్ విధానాన్ని రిజిస్ట్రేషన్ శాఖలోనూ ప్రవేశపెట్టింది. జిల్లాలో తొలుత నెల్లూరులోని ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పైలట్ ప్రాజెక్టు కింద ఈ నెల 4న ఈ విధానం అమలులోకి వచ్చింది. ఇప్పటివరకు 556 దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరగ్గా, రూ.6.09 కోట్ల ఆదాయం ఆ శాఖకు సమకూరింది. ఇక్కడ విజయవంతం కావడంతో స్లాట్ బుకింగ్ విధానాన్ని ఈ నెల 26 నుంచి జిల్లావ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయడానికి అధికారులు నిర్ణయించారు. ఈ విధానం అమలులో ఉండే కార్యాలయాల్లో దస్తావేజులను నేరుగా తీసుకొని వెళితే రిజిస్ట్రేషన్లు చేయరు. స్లాట్ బుకింగ్ పద్ధతిలో మాత్రమే చేస్తారు.

ప్రభుత్వ బడులకు
ముస్తాబు

రూ.29.79 కోట్ల నిధుల కేటాయింపు ● సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పనతో కొత్త విద్యాసంవత్సరానికి ముస్తాబు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యాన్యువల్ వర్క్‌ప్లాన్ బడ్జెట్ 2024-25 పేరుతో రూ.29.79 కోట్లు కేటాయించిందని సమగ్రశిక్ష ఏపీసీ డి.వెంకటసుబ్బయ్య తెలిపారు. నగరంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాలల్లో 19 తరగతి గదుల నిర్మాణానికి ఒక్కో గదికి రూ.5.22లక్షల చొప్పున రూ.99.18 లక్షలు విడుదల అయినట్లు తెలిపారు. జూన్ 12వతేదీ నాటికి పనులు పూర్తి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అలాగే 23 పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణానికి ఒక్కో దానికి రూ.9,37,500 చొప్పున మొత్తం రూ.2.15 కోట్లు విడుదలయ్యాయన్నారు. ఒక ఎంపీపీ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.95 లక్షలు మంజూరయ్యాయన్నారు. మేజర్ రిపేర్స్ కింద కొండాపురంలోని సాయిపేట ఎంపీపీఎస్ (హెచ్‌డబ్ల్యూ) పాఠశాలకు రూ.6లక్షలు, వడ్డిపాళెం పాఠశాలకు రూ.6లక్షలు మంజూరు చేశారన్నారు. అలాగే విద్యుత్ పునరుద్ధణకు పంచేడు ఎంపీపీఎస్ మెయిన్ పాఠశాలకు రూ.1.5లక్షలు, పల్లిపాడు పాఠశాలకు రూ.1.5లక్షలు విడుదలయ్యాయన్నారు. అలాగే 10 కేజీబీవీల్లో ఇంటర్ విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా భవనాలు నిర్మిస్తామన్నారు. ఒక్కో కేజీబీవీలో 6 తరగతి గదులు, 10 మరుగుదొడ్లు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.2.55 కోట్లు కేటాయించిందన్నారు. ఈ పనులన్నీ వారం రోజుల్లో ప్రారంభమై వేగవంతంగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వేసవి సెలవులు పూర్తయ్యే నాటికి మనబడి-మనభవిష్యత్‌కు సంబంధించి పెండింగ్‌లో పనులన్నీ కూడా పూర్తి చేసి పాఠశాలలను సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. అలాగే కేజీబీవీల్లో నిర్మాణ పనులను ప్రభుత్వం రద్దు చేసి సమగ్రశిక్షకే అప్పగించినట్లు తెలిపారు. త్వరలో ఈ పనులను కూడా వేగవంతంగా పూర్తి చేస్తామని ఏపీసీ తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు గడువు పెంపు

నెల్లూరు(విద్య) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించడగాని, రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ చేసుకోవడానికి ఈ నెల 25వతేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆర్ఐఓ ఎ.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నంలోగా సంబంధిత కళాశాలల్లో ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	100
స్కిన్ చికెన్	184
స్కిన్‌లెస్	204
కోడిగుడ్ల ధర (100): 420	

సీనియర్ సివిల్ న్యాయాధికారికి వీడ్కోలు

కావలిటౌన్, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి) : స్థానిక కోర్టులో సీనియర్ సివిల్ న్యాయాధికారిగా విధులు నిర్వహిస్తున్న శోభ కందుకూరుకు బదిలీ అవడంతో మంగళవారం న్యాయవాదులు ఆమెకు వీడ్కోలు సత్కారమందించారు. మాజీ ఏజీపీ పోట్టూరు శ్రీనివాసులు మరికొంతమంది న్యాయవాదులు న్యాయాధికారి చాంబర్‌లో ఆమెకు మొక్కలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాఘవరావు, కోమలి, పవన్, జోసఫ్, అలేఖ్య, మసుధ సిబ్బంది విజయ్‌కుమార్, ప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభకు మొక్క అందిస్తున్న మాజీ ఏజీపీ శ్రీనివాసులు

న్యూస్ బాక్స్

157 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 485 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. 11 కంపెనీ ప్రతినిధులు 328బేళ్లను కొనుగోలు చేశారు. నోబిడ్-137, ఆర్ఆర్-1, సీఆర్-13, జంపింగ్ లాట్స్-6 కారణాలతో 157బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.220, సగటు ధర రూ.253.81గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

● మర్రిపాడు : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి రైతులు 663 బేళ్లను తీసుకొనిరాగా, 15 కంపెనీల ప్రతినిధులు 463బేళ్లను కొనుగోలు చేశారు. 200 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ.280కాగా, కనిష్ఠ ధర రూ.220గా పలికినట్లు వేలం నిర్వహణాధికారి జీ. రాజశేఖర్ తెలిపారు.

నీటి ట్యాంకు శుభ్రం

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి): వెంగళాపురంలో మంగళవారం అధికారులు మంచినీటి ట్యాంకును శుభ్రంగా కడిగించి, బ్లీచింగ్ వేయించారు. టీడీపీ నాయకుడు లోమడ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జే స్రవంతి, ఏఎన్ఎం షేక్ ముబీనాభాను పర్యవేక్షించారు.

భూమిని రక్షించుకోవడం మన బాధ్యత

బిట్రగుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భూమి, నీరు, గాలిని రక్షించుకోవడం మన బాధ్యతని కావలి లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి అన్నారు. బోగోలు మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఆవరణంలో మంగళవారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా ఆయన మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై చైతన్యం రావాలి



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న మాస్టర్ ట్రైనర్ శరత్

దగదర్తి (బిట్రగుంట), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రైతుల్లో ప్రకృతి వ్యవసాయంపై చైతన్యం రావాలని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ శరత్ అన్నారు. దగదర్తి మండలం చవటపుత్తేడులో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామ సభలో సర్పంచు పీ. కళ్యాణి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల వాతావరణ, భూ కాలుష్యాలను నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌డీలు శాంతి, వేణు, చెంచయ్య, మల్లేశ్వరి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి ర్యాలీని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న మైనార్టీ నేతలు

బిట్రగుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా బోగోలులో గురువారం నిర్వహించనున్న శాంతియుత ర్యాలీని జయప్రదం చేయాలని జేఏసీ నేతలు షేక్.నూరుద్దీన్, ఎస్కే . జహీర్ పిలుపునిచ్చారు. బోగోలులో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా బోగోలు కూడలి నుంచి ఇబ్రహీంపేటలోని జామియా మసీదు వరకు శాంతియుత ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ర్యాలీని జయప్రదం చేసేందుకు లౌకికవాదులు, వామపక్ష పార్టీలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు సిరాజ్, మహబూబ్‌బాషా, షేక్.గౌస్‌బాషా, అహ్మద్‌బాషా, జాఫర్, సయ్యద్ కలీమ్, హబ్బు తదితరులు పాల్గొన్నారు.

28న మెగా జాబ్‌మేళా

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): ఈనెల 28న స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ షేక్ రియాజుద్దీన్ తెలిపారు. మంగళవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జాబ్‌మేళా బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులందరికీ ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14 ప్రముఖ కంపెనీలు ఈ మేళాకు హాజరవుతున్నందున యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగి 19 నుంచి 30 ఏళ్ల లోపు వయసు కలిగిన యువతీ యువకులంతా ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు.

వంతెన గోడల్లో వృక్షాలు

● పగుళ్లిస్తున్న నిర్మాణాలు
● పట్టించుకోని అధికారులు



ఆర్వోబీ వంతెన గోడలో నుంచి మొలిచిన చెట్టు



వంతెన పైభాగాన కనిపిస్తున్న చెట్లు

కావలి, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో గోడల్లో మొలిచిన చిన్నచిన్న మొక్కలు పెరిగి పెద్ద వృక్షాలై గోడలు దెబ్బతింటున్నాయి. దీంతో ఎంతో కాలం పటిష్ఠంగా ఉండాల్సిన ఆ నిర్మాణాలు అనతికాలంలోనే కాలం చెల్లుతున్నాయి. కావలి-ఉదయగిరి రోడ్డులో ఉన్న ఆర్వోబీ వంతెన కోసం నిర్మించిన కాంక్రీట్ గోడలో చిన్నచిన్న మొక్కలు మొలిచాయి. వాటిని ఆదిలోనే తుంచి వేయాల్సింది పోయి అవి పెరిగి పెద్దవై వృక్షాలు లాగా కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. వంతెనకు అప్రోచ్‌రోడ్లకు రెండు వైపులా కాంక్రీట్ గోడలలో నుంచి చెట్లు పెరుగుతున్నాయి, వీటివల్ల గోడలు దెబ్బతినటమే కాక అప్రోచ్ రోడ్లలో రాకపోకలు సాగించే ప్రజలకు గోడలలో ఉన్న చెట్లవల్ల ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి గోడలు దెబ్బతినకుండా వాటిల్లో ఉన్న చెట్లను తొలగించి ప్రభుత్వ ఆస్తులకు రక్షణ కల్పించాలి.

ఆక్రమణలను పట్టించుకోరా!?

● ఆర్‌అండ్‌బీ రోడ్డుపై మురుగునీరు వదులుతున్నా చర్యలు తీసుకోరా..

లింగసముద్రం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతినిత్యం రద్దీగా ఉండే లింగసముద్రంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లను ఆక్రమించినా అధికారులు పట్టించుకోరా.. ? అలాగే రోడ్లపై మురుగు నీటిని వదులుతున్నా చర్యలు తీసుకోరా..? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యలపై గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు అధికారులకు మొరపెట్టుకుంటున్నా అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదు. లింగసముద్రంలోని గొల్లపాలెం నుంచి కల్యాణ మండపం వరకు రోడ్డు మార్జిన్లను ఆక్రమించి, మట్టి ఎత్తుగా పోశారు.దీంతో రోడ్డు 12 అడుగులు మాత్రమే ఉంది.దీంతో వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు నిలిపివేస్తున్నారు. దీంతో ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్లు ఆక్రమించి సిమెంటు రోడ్డుకు ఇరువైపులా వేసిన మట్టి

ముగిసిన పౌష్టికాహార పక్షోత్సవాలు



వలేటివారిపాలెం : పౌష్టికాహారంపై ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ కార్యకర్తలు



కొండాపురం : బాలింతలకు పౌష్టికాహారం అందచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు మమత, శ్రీదేవి, వరమ్మ తదితరులు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో మండలంలోని శాఖవరంలో జరుగుతున్న పౌష్టికాహార పక్షోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత ప్లకార్డులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యకర్తలు మమత, రంగమ్మ, పద్మ, టీచరు శ్రీనివాసులు తదితరలు పాల్గొన్నారు.

కొండాపురం, (ఆంధ్రజ్యోతి): పోషణ్ పక్వాడలో భాగంగా ఐసీడీఎస్ ద్వారా జరుగుతున్న పౌష్టికాహార పక్షోత్సవాలు మంగళవారం ముగిశాయి. సాయిపేట పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఈకార్యక్రమంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం బాలసంజీవిని కిట్లను అందచేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు మమత, శ్రీదేవి పాల్గొన్నారు.

మాచవరంలో ఎమ్మెల్యే ఇంటూరి ఆకస్మిక తనిఖీలు



మాచవరం సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచవరంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామ సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన హాజరు పట్టికలను పరిశీలించారు. ప్రజలకు అందాల్సిన సేవలు సకాలంలో అందుతున్నాయా లేదా..? అని ఆరాతీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసమస్యలపై తక్షణం స్పందించాలని, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాల ఫలాలు అర్హులందరికీ అందేలాచూడాలని, సమయపాలన పాటించాలని నిర్దేశించారు. అనంతరం సచివాలయ సిబ్బంది, పీహెచ్‌సీల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు అడిగి తెలుసుకోవటంతోపాటు పనితీరులో మార్పుచేసుకోవాల్సిన అవసరాన్ని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రత్నజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'సదరన్' వెరిఫికేషన్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



ఏరియా వైద్యశాల వైద్యాధికారులకు వినతిపత్రం ఇస్తున్న మండవ వెంకట్రావు

కావలి, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): సదరన్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కేంద్రాల్లో దివ్యాంగులకు నీడ, కూర్చునేందుకు బల్లలు వసతితోపాటు రవాణా చార్జీలు, భోజన వసతులు కల్పించాలని టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ వెంకట్రావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన కావలి ఏరియా వైద్యశాలలో వైద్యాధికారులకు వినతిపత్రం అందచేశారు. గతంలో దివ్యాంగుల వసతులపై ఆయన సీఎంవో ఆఫీస్‌కు లెటర్ పెట్టగా వారు వెంకట్రావు కావలి అడ్రస్‌లో ఉండటంతో కావలి ఏరియా వైద్యశాలకు ఆ వివరాలు పంపి వసతులు కల్పించమని కోరారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య ఉంటే ఒక్క కావలిలోనే వసతులు సమకూర్చటం ఎలా కుదురుతోందని వైద్యశాల వారు వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన రాష్ట్రవ్యాప్తంగా సదరన్ కేంద్రాల్లో దివ్యాంగులకు వసతులు కల్పించాలని కోరుతూ ఆ లెటర్‌ను ఏరియావైద్యశాల ద్వారా సీఎంవో ఆఫీస్‌కు పంపమని కోరారు. కార్యక్రమంలో ఏరియావైద్యశాల సూపరింటిండెంట్ పద్మావతి, ఆర్ఎంవో ప్రమీల, డీఆర్‌డీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పగిలి మంచినీరు వృథా



లింగసముద్రం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని మేసేవ కేంద్రం పక్కనే ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రవహిస్తున్నది వర్షపు నీరు మాత్రం కాదండోయ్... విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసేందుకు ట్రాక్టర్‌కు ఉన్న యంత్రంతో గుంత తీస్తుండగా అంతర్గత మంచినీటి పైపు తగిలి పగిలి వృథాగా పోతున్న మంచినీరు ఇది. మంగళవారం సాయంత్రం కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు కాంట్రాక్టరు ఆయన సిబ్బంది యంత్రంతో గుంతలు తీస్తున్నారు.దీంతో లింగసముద్రం గ్రామానికి మంచినీటిని అందించే పైపులైన్ తగిలి పగిలింది. దీంతో భారీ స్థాయిలో నీరు రోడ్డుపై వృథాగా పోతోంది.దీంతో సిబ్బంది గ్రామానికి నీటి సరఫరాను నిలుపుదల చేశారు.సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



డాక్టర్ ప్రభాకర్‌నాయుడును సత్కరిస్తున్న అపోలో వైద్యులు ప్రజా సంఘాల నేతలు

కావలిటౌన్, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి) : డాక్టర్ ప్రభాకర్ నాయుడు ఆసుపత్రిలో మంగళవారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు జరిగింది. నెల్లూరు అపోలో వైద్యశాల సీనియర్ అంకాలజిస్ట్ హరిత, ప్రముఖ క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు జీవీవీ ప్రసాద్‌రెడ్డి పాల్గొని క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. దగ్గు చెస్ట్ పెయిన్, ఊపిరాడకపోవడం, బ్లోటింగ్, బ్లీడింగ్, గడ్డలు, కడుపు నొప్పి, వెన్ను నొప్పి, బరువు తగ్గడం, మల విసర్జనలో మార్పులు తదితరలక్షణాలతోపాటు జీవనశైలిలో మార్పులు, పొగతాగడం, మద్యం సేవించడం, స్థూలకాయం వల్ల కూడా క్యాన్సర్ రావచ్చన్నారు. ఈ లక్షణాలతో బాధపడేవారు వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ప్రభాకర్‌నాయుడు పేదలకు అందిస్తున్న ఉచిత వైద్యసేవలకుగాను అపోలో వైద్యులతోపాటు స్వచ్ఛంద సంఘాల నాయకులు ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా, ప్రసాదరావు, అజిత్‌బాబు, సలీంబేగ్, రాయపాటి దిలీప్, శారద, దాసు, ఘనీబాషా, జమీర్ స్వచ్ఛంద సంస్థల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం గేటువద్ద ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కందుకూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలను తక్షణం చెల్లించాలని, మున్సిపాలిటీలో పెరిగిన జనాభా ప్రాతిపదికన కార్మికుల సంఖ్యను పెంచాలని, పారిశుధ్య కార్మికులకు రావాల్సిన కనీస వసతులను అందించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్యేతర పనులకు కార్మికులను వినియోగించటం ఆపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కే. అనూషకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు బూసి సురేష్‌బాబు, వై. ఆనంద్ మోహన్, ఎస్ఏ గౌస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కాకుమాని రమణమ్మ, పులి నాగేశ్వరరావు, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా జలదంకి బైపాస్ పనులు

● పూర్తయిన వంతెనలు ● ఇక మిగిలింది తారురోడ్డు నిర్మాణమే

జలదంకి, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి పడమటి వైపున కమ్మపాలెం మీదుగా బైపాస్ రోడ్డు నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఈ రోడ్డు నిర్మాణంలో చిప్పలేరు వాగు, గౌరవరం మేజర్ కాలువ, ఏటికాలువ, లేదూటగంగమ్మ చెరువు వరవకాలువలపై వంతెనల నిర్మాణాలు పూర్తయ్యాయి. కొత్తగా నిర్మించే ఈ రోడ్డుపై మెటల్ పనులు పూర్తికాగా ఇక మిగిలింది తారు వేయడమే. దాదాపు 90శాతం పనులు పూర్తికాగా మిగిలిన పదిశాతం పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్ ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం జలదంకి మీదుగా వాహనాలు వెళ్తుండగా, తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బైపాస్‌రోడ్డు నిర్మాణం పూర్తయితే ఆ ఇబ్బందులు తొలగనున్నాయి.



చిప్పలేరు వాగుపై పూర్తయిన వంతెన



జలదంకి బైపాస్ రోడ్డుపై తారు వేసేందుకు సిద్ధం వేసిన మెటల్

దివ్యాంగుల పాఠశాల సందర్శన



దివ్యాంగుల పాఠశాలలో చిన్నారులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న సబ్‌కలెక్టరు శ్రీపూజ, కుటుంబసభ్యులు

కందుకూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ మంగళవారం కుటుంబసభ్యులతో కలిసి కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాలను సందర్శించారు. ఆమె తీసుకెళ్లిన పెన్సిళ్లు, పెన్నులు, పుస్తకాలు, ఆటవస్తువులను దివ్యాంగులందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతులను పరిశీలించటంతోపాటు పాఠశాల అభివృద్ధికి ఎలాంటి సహకారం కావాలన్నా సంప్రదించాలని తెలిపారు. వారికి మెరుగైన సదుపాయాలు, భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

వలేటివారిపాలెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : రైతులంతా తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవశాయశాఖాధికారి హేమంత్‌భరత్ కుమార్ తెలిపారు. మండలంలోని కొండసముద్రంలో మంగళవారం భూసారపరీక్షలు ప్రాముఖ్యత, పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ ఏడాది 735 మట్టి నమూనాల పరీక్షలు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ నెలాఖరు వరకు గ్రామాల్లో మట్టి నమూనాలు సేకరించనునట్లు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఉద్యాన, వ్యవసాయశాఖ సమాయకులు సురేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.



నట్టింట్లో 'సాగర గర్భం'

- ఆకట్టుకుంటున్న ఆక్వేరియం అందాలు
- రంగు రంగుల చేపలతో ముచ్చట్లు
- పెద్దలకు మైండ్ రిలీఫ్, పిల్లలకు ఆటవిడుపు

నీలిరంగు సముద్రం.. అందులో విహరించే అందమైన చేపలు... సహజసిద్ధంగా వీటిని చూడాలనుకుంటే ఆక్వేరియంతోనే సాధ్యం. అయితే ఇదీ అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు. ప్రకృతిపై ప్రేమ, చేపలను సాకాలన్న తపన ఉండాలి. ఒకప్పుడు అరుదుగా కొంతమంది ఇళ్లలోనే చేపలను పెంచేవారు. ఇప్పుడు అలా కాదు.. ఆక్వేరియాలు నట్టింట్లో పెట్టుకోవడం బాగా పెరిగింది. పెద్దలకు మైండ్ రిలీఫ్‌గా ఉంటుందని, పిల్లలకు ఆటవిడుపుగా ఉంటాయని ఆక్వేరియాల్లో అందమైన చేప పిల్లలను కడుపున పుట్టిన బిడ్డల్లా సంరక్షిస్తున్నారు.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)

ప్రకృతిని ఆస్వాదించే జంతుప్రేమికులు కుక్కలు, పక్షులు, పావురాళ్లు, కుందేళ్ల, తాబేళ్లను పెంచుకోవడం మనం చూస్తుంటాము. వీటికన్నా చాకిరీ ఎక్కువైన ఆక్వేరియం (గాజు తొట్టె) పెట్టి అందులో వివిధ రకాల చేపలను కన్నబిడ్డల్లా సంరక్షించడం ఒకప్పుడు అరుదుగా ఉండేది. కాలక్రమేణా చేపలను పెంచేవారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. కరోనా తరువాత ఈ అభిలాష మరింత పెరిగింది. ఇంట్లో పెద్దలకు ఆక్వేరియంలో చేపలను చూడగానే కాస్త మైండ్ రిలీఫ్‌గా ఉంటుందని, పిల్లలకు ఆటవిడుపుగా ఉంటాయని, పైగా నడింట్లో సాగర గర్భమే ఉందన్న ఫీలింగ్‌తో మరికొందరు ఆక్వేరియం ఏర్పాటు చేసుకుంటున్నారు. గాజు కుండీల మొదలు అడుగు, రెండడుగులు, 3, 4 అడుగులు ఇలా కావాల్సిన సైజుల్లో ఆక్వేరియాలు తయారు చేసుకుని అందులో అందమైన వింత, విచిత్రాలు కలిగిన ఆకట్టునే అనేక రకాల చేపలను ముచ్చటపడి మరీ పెంచుకుంటున్నారు. ఖర్చు ఎంతైన లెక్క చేయని ప్రకృతి ప్రేమికులు అందమైన ఆక్వేరియం ఉండాలన్న కాంక్షతో చేపలు పెంచేందుకు సిద్ధమవుతున్నారు. ఇళ్లలోనేకాదు.. హాస్పిటల్, పారిశ్రామిక కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు తదితర ప్రాంతాల్లోనే ఆక్వేరియాలు ఏర్పాటు చేస్తున్నారు.

● అందమైన చేపలతో ఆకర్షణ

మలేషియా, థాయ్‌లాండ్ సంతతికి చెందిన ఫ్లవర్‌హాన్ (వాస్తుచేప) చేపలు ఒకే ఆక్వేరియంలో మగ, ఆడ చేపలుంటాయి. పూర్తి హైబ్రీడ్ జాతితో తయారైన వీటి జీవితకాలం 7 నుంచి 30 ఏళ్లు. రూ. 1000 నుంచి 7 వేల వరకు ధర పలికే ఈ చేపలు మనతో కలిసి ఆడుకోవడం, స్నేహ స్వభావంతో ఉండటం ప్రత్యేకత. స్వదేశీ సంతతికి చెందిన టైగర్ బార్బ్ జాతి చేపలు తొలుత తెలుపు రంగుతో ఆవిర్భవించి తాజాగా గ్రీన్, గ్రీన్‌పైన ఎరుపు, బ్లాక్ రంగులతో ఆకర్షణీయంగా రూపాంతరం చెందాయి. జత రూ.200 నుంచి సైజును బట్టి ధర పలుకుతున్నాయి. మూడేళ్లపాటు వీటి మనుగడ ఉంటుంది. చైనాలో పురుడు పోసుకున్న అరవాన చేప థాయ్‌లాండ్, మలేషియాలో బ్రీడింగ్ చేసుకుని అందమైన ఆకృతిల్లో లభిస్తుంది. చైనీయులకు అత్యంత సెంటిమెంట్ కలిగిన ఈ జాతి రూ. 1500 నుంచి రూ. 15 లక్షల వరకు కూడా ధర పలుకుతుంది. ఇక ఏంజెల్, గోల్డ్, మాలి, టెట్రాన్, కోయ్‌కార్ప్ వంటి జాతులకు చెందిన చేపలను ప్రకృతి ప్రియులు ఎక్కువగా పెంచుతుంటారు.

● కరోనా తరువాత ఎక్కువగా..

కరోనా విపత్తు తరువాత చేపల పెంపకంలో భారీ సంస్కరణలు చోటుచేసుకున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. పాతతరం చేపల నుంచి క్రాస్ బ్రీడింగ్‌లతో సరికొత్త జాతులను సృష్టించారు. ఒక్కో జాతి చేప నుంచి సుమారుగా 12 రకాల హైబ్రీడ్ జాతులను వృద్ధి చేశారు. చేపల రంగులూ మారాయి. వాటిల్లో ఆకృతులు మారడంతో చేపలు పెంచుకునే వారి సంఖ్య ఘననీయంగా పెరిగింది. విదేశాల్లో జెనిటికల్ బ్రీడింగ్ చేసిన చేపల పిల్లలను చెన్నై, కోల్‌కతా వంటి మహానగరాలకు తీసుకువచ్చి అక్కడ నుంచి నెల్లూరుకు దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు.

ఇంటికి అందం తెచ్చేవిగా..

రూ.కోట్లు ఖర్చు చేసి ఇల్లు కట్టినా, రూ. క్షలు వెచ్చించి ఫర్నిచర్ పెట్టినా రాని అందం నడింట్లో చేపలతో ఆక్వేరియం పెడితే వస్తుందని నమ్ముతున్న వారు అనేకం. వీరి కోసం ఆక్వేరియాలు తయారు చేసే సెంటర్లు ఇప్పుడు నెల్లూరులో అనేక చోట్లు అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పుడు ఒకటి రెండు కేంద్రాలతో సరిపెట్టుకుని, పెద్దవి కావాలంటే చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల నుంచి తెచ్చుకునే వాళ్లం. కానీ ఇప్పుడు అందుకు భిన్నంగా నగరంలోని తయారీ కేంద్రాలు వచ్చాయి. మనం ఏ సైజు కావాలో చెబితే ఆ సైజులో అక్వేరియాలు చేసి ఇస్తున్నారు. ఇల్లు నిర్మించుకునే సమయంలో లేదా కొత్తఇల్లు కొనేటప్పుడో ఆక్వేరియానికి స్థలం కేటాయించేస్తున్నారు. అంతగా చేపల సాగు సగటు వ్యక్తి జీవనంలో భాగమైంది.



వారి సంఖ్య బాగా పెరిగింది

గతంలో కంటే ఇప్పుడు ఇళ్లలో ఆక్వేరియాలు పెట్టుకునే వారి సంఖ్య ఘననీయంగా పెరిగింది. మా లెక్కప్రకారం కరోనా తరువాత చేపలను ఇళ్లలో పెంచడం అందరికీ అలవాటుగా మారింది. పెద్దలకు కాస్త మైండ్ రిలీఫ్‌గా ఉంటుందని, పిల్లలకు ఆడుకునే వీలు ఉంటుందని చెబుతున్నారు. ఆర్డర్లు ఇచ్చి మారీ చేయించుకుంటున్నారు. ఎవరూ ఖర్చుకు వెనకడుగు వేయడం లేదు.

- ఎస్డీ మీర్ జమీర్‌హుస్సేన్, ఆక్వేరియం తయారీదారుడు



ఆ అనుభూతి మాటల్లో చెప్పలేం

మా ఇంట్లో పదహారేళ్లగా ఆక్వేరియం పెట్టి చేపలను పెంచుతున్నాను. చేపలంటే నాకు చాలా ఇష్టం. పిల్లలకు చేపలతో ఆడుకోవడం ఇష్టం కాబట్టి ఇంట్లో ఆక్వేరియం పెట్టుకున్నాము. వాటితో ఉండే అనుభూతిని మాటల్లో చెప్పలేము.

- పీ శకుంతల, నెల్లూరు



నిర్వహణ కష్టమే అయినా

ఇంట్లో ఆక్వేరియం పెట్టుకుని నిర్వహించడం చాలా కష్టం. కానీ చేపలతో ఉండే అనుబంధం ఆ కష్టాన్ని గుర్తుచేయదు. ఇంట్లో పెంచుకునే చేపలు మనలో ఓ భాగమైపోతాయి. ఉదయం, సాయంత్రం వాటికి ఫుడ్ వేయడం, తరచూ నీళ్ల మార్చడం వంటివి అలవాటుగా మారుతుంది.


- కోడూరు శేషారెడ్డి, అల్లీపురం



కోయికార్







రంగురంగుల టెట్రా



టైగర్‌బార్బ్



ఏజిల్స్



ఫ్లవర్‌హాన్ రకం చేప

పరిశ్రమలకు త్వరగా అనుమతులివ్వండి

● ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నూతనంగా పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో మంగళవారం జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన భూసేకరణ, మౌలిక వసతుల ఏర్పాటు ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ప్రింటింగ్, రెడీమేడ్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలశాఖ జీఎం ప్రసాద్, డీఎఫ్‌వో మహబూబ్ బాషా, కాలుష్య నియంత్రణ శాఖ ఈఈ అశోక్‌కుమార్, ఏపీకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌కు కలువాయి ఎస్ఐ

కలువాయి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఐ సుమన్‌ను ఉన్నాతాధికారులు మంగళవారం వీఆర్‌కు పిలిపించారు. ఎస్ఐపై పలు ఆరోపణలు నేపద్యంలో ఉన్నాతాధికారులు ఈ విధమైన చర్యలు తీసుకున్నట్లు సమాచారం. మంగళవారం సాయంత్రం కలువాయికి ఇన్‌చార్జిగా కండలేరు ఎస్ఐ రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు.

సోమశిలలో 51.585 టీఎంసీల నిల్వ

అనంతసాగరం ఏప్రిల్ 22 ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, మంగళవారం నాటికి 51.585 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 200, దక్షిణ కాలువకు 50, డెల్టాకు 1,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

రేపు హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏబీఎం బాలికోన్నత పాఠశాల మైదానంలో గురువారం పురుషుల హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి ఎస్ విక్టర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆ రోజు సాయంత్రం 3 గంటలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన వారు అన్నమయ్య జిల్లా కదిరిలో త్వరలో జరిగే 54వ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

25న కారాగారంలో మామిడితోట వేలం

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారములో ఉన్న 104 మామిడి చెట్ల కాయలు, పండ్లను కోసుకునే హక్కు కోసం ఈ నెల 25వ తేదీ వేలం పాట నిర్వహిస్తున్నట్లు నెల్లూరు కేంద్ర కారాగారం పర్యవేక్షణాధికారి సోపిరాల వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బహిరంగ వేలములో పాల్గొనే వారు 25వ తేదీ ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య ధరావతు సొమ్ము చెల్లించి టోకెన్ పొందాలని కోరారు. పంట దక్కించుకున్న వారు వెంటనే మొత్తం పైకాన్ని చెల్లించి మామిడి తోటను స్వాధీనం చేసుకోవచ్చన్నారు. పంట కాలం ముగిసే వరకు తోట కాపలా, రక్షణ బాధ్యతలు వారే చూసుకోవాలని, ప్రకృతి వైపరిత్యాల కారణంగా పంట నష్టం వాటిల్లితే జైళ్ల శాఖ బాధ్యత వహించదని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు 9885234850, 9000990587 నెంబర్లను సంప్రదించాలని కోరారు.



జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, పక్కన సూపరింటెండెంట్ సిద్ధానాయక్

జీజీహెచ్‌లో అజెండాపై రగడ

● తమ సలహాలు తీసుకోలేదంటూ సభ్యుల ఆగ్రహం ● కలెక్టర్ ఆగ్రహం.. పలు అంశాలపై సమీక్ష

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో అజెండా రూపకల్పనపై సభ్యులు అగ్రహం వ్యక్తం చేశారు. అజెండా తయారీలో తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ కమిటీ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, సభ్యుడు మొగరాల సురేష్ కమిటీలో కలెక్టర్ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లారు. అజెండా తయారీలో తమ వంతు సలహాలు ఇచ్చేవారమని, తామేమైనా పనిలేకుండా వచ్చామా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రికి అవసరమైన నిధుల సమీకరణలో తమ వంతు కృషి చేస్తామని వెల్లడించారు. కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జీజీహెచ్‌లో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సూపరింటెండెంట్ సిద్ధానాయక్‌ను కలెక్టర్ నిలదీశారు. ఇది సీక్రెట్ సమావేశం కాదని వారికి స్వయంగా లేదా మెయిల్‌లో అజెండా కాపీని పంపాలని సూచించారు. ఇక కరోనా సమయంలో వాహనాల ఏర్పాటుకు ఇవ్వాల్సిన బకాయిలు ఇప్పుడు అజెండాలో ఎందుకు పెట్టారని అధికారులను నిలదీశారు. ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోల అవసరాలపై కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ సిబ్బందిని ఎందుకు వీటికి ఉపయోగించుకుంటు న్నారని ప్రశ్నించారు. దీనికి సూపరింటెండెంట్ మాట్లాడుతూ తాను ఆసుపత్రికి 110 మంది ఎఫ్ఎన్‌వోలు, ఎంఎన్‌వోలు కావాలని డీఎంఈకి లెటర్ కూడా పెట్టామని, ఇంత వరకు అనుమతులు ఇవ్వలేదని వివరణ ఇచ్చారు. పలువురు వైద్యులు మాట్లాడుతూ తమకు వైద్య పరికరాలు కావాలని, ఏసీలు సరిగ్గా లేవని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇలా అజెండాలో పొందుపరిచిన 11 అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఆసుపత్రిలో నిధులను బట్టి వాటిని కొనుగోలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు బ్రహ్మారెడ్డి, అబిదాసుల్తానా, ఏసీసుబ్బారెడ్డి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌మన్నార్, డీఎంహెచ్‌వో సుజాత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పౌష్టికాహారాన్ని అందించాలి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సక్రమంగా పౌష్టికాహారాన్ని అందించి వారి ఎదుగుదల కు తోడ్పడాలని కలెక్టర్ ఆనంద్ ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు.. మంగళవారం కలెక్టరేట్ శంకరన్ హాల్లో పౌష్టికాహార పంపిణీపై ఐడీసీఎస్ అధికా రులతో సమావేశం నిర్వహించారు. అంగన్ వాడీలకు వచ్చే పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతీనెలా పిల్లల ఎత్తు, బరువు సక్రమంగా చూసి రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్ పోస్టులను త్వరగా భర్తీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో సమీక్ష

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి) : యూనివర్సిటీలో మంగళవారం సీడీసీ విభాగం ఆధ్వర్యంలో అనుబంధ కళాశాలల కరస్పాండెంట్స్, ప్రిన్సిపాళ్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు పాల్గొన్నారు. విద్య ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల ప్రగతి, పరీక్షల నిర్వహణ, అధ్యాపకుల శిక్షణపై విశ్లేషణ్మాతకంగా చర్చించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి మధుమతి, కరస్పాండెంట్స్, ప్రిన్సిపాల్స్ తదితరులున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

● చంపేస్తాడేమోనన్న భయంతో చంపేశారు

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పెన్నానదిలో జరిగిన హత్య కేసులో నిందితులను నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను నగర డీఎస్పీ పీ సింధుప్రియ ఆమె కార్యాలయంలో మంగళవారం మీడియాకు వెల్లడించారు. జాకీర్‌హుస్సేన్ నగర్‌కు చెందిన బేల్దారి షేక్ సుల్తాన్(38) మద్యానికి బానిసై పలువురిని బెదిరిస్తూ నగదు దోచుకొని మద్యం సేవించేవాడు. అతను ఈ నెల 16వ తేదీ రాత్రి న్యూకాలనీ సమీపంలోని పెన్నానది వద్ద దారుణ హత్యకు గురయ్యాడు. సుల్తాన్ తల్లి కరిము న్నీసా ఫిర్యాదుతో నవాబుపేట పోలీ సులు కేసు నమోదు చేశారు. ఇన్ చార్జి ఇన్‌స్పెక్టర్ కే సాంబశివరావు నేతృత్వంలో ఎస్ఐలు రెహమాన్, శివయ్య ప్రత్యేక బృందాలతో దర్యాప్తు జరిపారు. న్యూకాలనీకి చెందిన షేక్ సలీం అలియాస్ కలిమ్, వైపాడు రోడ్డు సింహపురి కాలనీకి చెందిన ఎం నాగరాజును నిందితులుగా గుర్తించి మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా హత్య చేయడానికి కారణాలు వెల్లడించారు. మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని సలీంను సుల్తాన్ అడగ్గా అతను లేవని చెప్పాడు. దీంతో సుల్తాన్ అతన్ని బెదిరించడంతో భయపడిన సలీం తన స్నేహితుడు నాగరాజుతో కలిసి సుల్తాన్‌ను హత్య చేయాలని నిర్ణయించాడు. ఈ క్రమంలో 16వ తేదీ రాత్రి కర్రలతో సుల్తాన్‌ను బలంగా కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితులను అరెస్ట్ చేసిన ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్, ఎస్ఐలు, ఏఎస్ఐ బీవీ నరసయ్య, హెచ్‌సీ ప్రసాద్, కానిస్టేబుళ్లు రత్నయ్య, సురేంద్రబాబు, మస్తానయ్య, వేణు తదితరులను డీఎస్పీ అభినందించారు.

నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయండి

● పనితీరు మెరుగుపరుచుకోండి : ఎస్ఈ

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఉద్యోగులు, సిబ్బంది పటిష్ట చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ అధికారులను ఆదేశించారు. ఆయన కార్యాలయం నుంచి మంగళవారం జిల్లాలోని డీఈలు, ఏఈలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేం దుకు ఉద్యోగులు, సిబ్బంది పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఎక్కడైనా అంతరాయాలు ఎక్కువగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోలార్ విద్యుత్‌పై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. గృహాల్లో విద్యుత్ వాడకం పెరిగిపోతోందని, దీనికి సంబంధించి అదనపు లోడ్‌ను గుర్తించి, 50శాతం సబ్సిడీతో క్రమబద్ధీకరిం చాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే వెంటనే సమాచారం ఇచ్చేందుకు ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు స్థానిక లైన్‌మన్ ఫోన్ నెంబర్ రాసి ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో సూర్యఘర్ నోడల్ అధికారి శేషాద్రి బాలచంద్ర, డీఈఈ మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● కలెక్టరేట్ ఎదుట ధర్నా

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఆ ఉద్యోగులు మంగళవారం ధర్నా చేశారు. ఆయు ష్మాన్ ఆరోగ్య మందిర్‌కు చెందిన ఏపీ మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్‌కు చెందిన వారు ఈ ధర్నా చేపట్టారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్, ప్రధాన కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకం నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్‌ను పునరుద్ధరించాలని, ఆసుపత్రుల అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపా ధ్యక్షుడు అదిత్, సంయుక్త కార్యదర్శి రెబికా, సుమాంజలి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో జైలు, జరిమానా

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : దొంగతనం చేశాడన్న కేసులో నేరం రుజువు కావడంతో గరితోటి విజయ్ కుమార్ అనే నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ నెల్లూరు నగర 5వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ గండికోట దేవిక మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరులోని జనశక్తి నగర్‌కు చెందిన మంచూరి కనకమ్మ ఇంట్లో 2018 నవంబరు 15న మూడు సవర్ల బంగారు సరుడు, మూడు సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. బాధితురాలి ఫిర్యాదుతో వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. విచారణ కాలంలో నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

కోన బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి : ఆర్డీవో



అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో నాగసంతోషిని అనూష

రాపూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మే 8 నుంచి 14 వరకు జరిగే పెంచలకోన బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆర్డీవో నాగ సంతోషిని అనూష తెలిపారు. మంగళవారం కోనలోని కమ్మ కల్యాణసత్రంలో బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు చేస్తున్న ఏర్పాట్లపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళతామని ఆమె తెలిపారు. సమావేశానికి ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి అధ్యక్షత వహించారు.

● భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

వేసవిదృష్ట్యా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఆర్డీవో ఆదేశించారు. చుట్టుపక్కల జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని, ఆ మేరకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రానికి వచ్చే రహదారులను పూర్తి స్థాయిలో కట్టడి చేయాలని, అవసరమైనచోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మరోసారి బ్రహ్మోత్సవాలపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆ సమావేశంలో బ్రహ్మోత్సవాలపై పూర్తి అవగాహన వస్తుందన్నారు. అటవీ ప్రాంతంలో చిరుత సంచారం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖా ధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, రాపూరు సీఐ సత్యనారాయణ, అటవీశాఖ రేంజి అధి కారి రవీంద్రబాబు, తహసీల్దార్ లక్ష్మీ నరసింహం, ఎంపీడీవో భవాని, ఆర్టీసీ డీఎం అనీల్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెరగని ధరలు... పొగాకు రైతు ఆందోళన



కలిగిరిలోని వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు

కలిగిరి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను బట్టి గత మూడేళ్లుగా రైతులకు పరిస్థితులు అనుకూలించడంతో పొగాకుకు రికార్డు ధరలు దక్కాయి. దీనికి తోడు బోర్డు కూడా గతేడాది నుంచి అధిక ఉత్పత్తికి అనుమతులివ్వడంతో గతేడాది కన్నా ఈ ఏడాది ఎక్కువమంది పొగాకు సాగుకు మొగ్గుచూపారు. కొనుగోళ్లు ప్రారంభమై నెల దాటుతున్నా గరిష్ఠ ధరలో మార్పు లేకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. రోజువారి కొనుగోళ్లలో 400కిపైగా బేళ్లు వేలం కేంద్రానికి వస్తున్నా వాటిలో 10నుంచి 20శాతం బేళ్లకు కూడా గరిష్ఠ ధర అందటం లేదని రైతులు పేర్కొన్నారు. అదేవిధంగా లోగ్రేడ్ పొగాకును కంపెనీలు కొనుగోలు చేయకపోవడంపై వారు ఆందోళన చెందుతున్నారు.

● ఉత్పత్తి పరిమితి పెంపు

2024-25 పంట కాలానికి పంట ఉత్పత్తి పరిమితిని గణనీయంగా పెంచారు. నెల్లూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లోని 11వేలం కేంద్రాల పరిధిలో 103మిలియన్ కిలోలుగా నిర్ధారించారు. ఎస్ఎల్ఎస్(దక్షిణాది తేలికనేలలు) పరిధిలోని కలిగిరి, డీసీపల్లి, కందుకూరు-1,2, పొదిలి, కనిగిరి వేలంకేంద్రాల్లో ఈ ఏడాది 56మిలియన్ కిలోలకు అనుమతినిచ్చారు. కలిగిరి వేలం కేంద్రంలో ఈ ఏడాది 8మిలియన్ కేజీల పొగాకు దిగుబడి అంచనా వేయగా, ఇప్పటివరకు ఒక మిలియన్ పొగాకు కొనుగోళ్లు పూర్తయినట్లు బోర్డు అధికారులు పేర్కొన్నారు.

గతేడాది రికార్డుస్థాయిలో పొగాకు ధరలు పెరగడంతో ఆ ప్రభావం ఈ ఏడాది సాగుపై పడింది. భూమికౌలు, బ్యారన్‌కౌలు, కట్టె ఖర్చు, పచ్చాకు ముఠా కూలీలు అమాంతం పెరిగిపోయాయని, ధరలు పెరుగుతాయని ఎదురుచూస్తున్నా, గరిష్ఠ ధరలో పెరుగుదల లేదని రైతులు పేర్కొన్నారు. ధరలు పెరిగేటట్లు చూడటంతో పాటులో గ్రేడుపొగాకు కొనుగోళ్లు చేసేలా బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.